ఆవలోకనం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 161 పేజీలు: 12 వెల: 6.50

**కొత్తపార్టీ పెట్టిన లాలూ కుమారుడు తేజ్ ప్రతాప్** 5లో

**రూ.40వేలకు పెరిగిన వీసా ఫీజులు**



ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాలపై అధికారులతో సమావేశమైన కమిటీ చైర్మన్ కూన రవికుమార్

### ప్రభుత్వ రంగసంస్థల
## నిర్వహణపై పరిశీలన

### విశాఖ జిల్లాలో పర్యటించిన లెజిస్లేచర్ కమిటీ
### ప్రత్యేక జ్యుడీషియల్ ప్యానెల్ ఏర్పాటుకు చర్యలు

**విశాఖపట్నం, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ, వాటి కార్యకలాపాలు, పనితీరు, అకౌంట్ల ఆడిటింగ్ పై పరిశీలనకు ఉభయ సభల సభ్యులతో ఏర్పాటైన లెజిస్లేచర్ కమిటీ జిల్లా పర్యటనను శుక్రవారం ప్రారంభించింది. ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న ఈ కమిటీ శుక్రవారం ఉదయం జిల్లాకు చేరుకొని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యింది. ఛైర్మన్ కూన రవికుమార్‌తో పాటు >>2

# మానవ వనరులే అభివృద్ధికి మెట్లు

### నాడు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించా.. నేడు జనాభా నిర్వహణ అవసరమంటున్నా
### దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ స్ఫూర్తిని కొనసాగించాలి
### ప్రపంచజనాభా దినోత్సవ సదస్సులో సిఎం చంద్రబాబు


శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా భారం కాదు, ఆస్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రస్తుత కాలంలో జనాభా నియంత్రణ కాదు నిర్వహణ అవసరమన్నారు. ప్రపంచ జనాభా 1989 జూలై 11న ప్రపంచ జనాభా 5 బిలియన్లకు చేరిన సందర్భంగా ఐక్యరాజ్య సమితి జూలై 11వ తేదీని ప్రపంచ జనాభా దినోత్సవంగా ప్రకటించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు. ఈ రోజు ప్రపంచంలో 10 నుంచి 24 యేళ్ల వయసు ఉన్న వారు 1.8 బిలియన్లు ఉన్నారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారు. కానీ జనాభా ఉన్న దేశాలవైపే అగ్రరాజ్యాలు చూడాల్సి వస్తోంది. జనాభా ఎప్పటికీ భారం కాదు. అదే మనకు తిరుగులేని ఆస్తి. ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో అభివృద్ధి సాధ్యమా అనే పరిస్థితి నుంచి ఆ జనాభానే మనకు అడ్వాంటేజ్‌గా మారింది. 140 కోట్ల జనాభా కలిగి ఉన్న మన దేశం చైనానుకూడా వెనక్కు నెట్టింది అని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో నేను కుటుంబ నియంత్రణను ప్రోత్సహించా. ఇప్పుడు నేనే జనాభా నిర్వహణ అవసరమని చెబుతున్నా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు లేదనే చట్టం తెచ్చానని గుర్తుచేశారు. ఇప్పుడు ఇద్దరు పిల్లలకన్నా ఎక్కువ ఉండాలంటున్నామన్నారు. ఎప్పటికప్పుడు ఆలోచన విధానంలో మార్పు వస్తుందన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పాలసీలను మార్చుకోకపోతే చాలా సమస్యలు వస్తాయని >>2

### ఆదాయార్జన శాఖల ద్వారా
# ఆర్థికవృద్ధికి కృషి

### రూ.180 కోట్ల విలువైన నరేగా పనులు రీఓపెన్ చేయించాం
### సంస్కరణలతో ఫలితాలు వస్తున్నాయి
**శాఖాధికారులుగా కాదు..లీడర్లుగా వ్యవహరించండి: సిఎం చంద్రబాబు**

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** సంస్కరణల అమలు ద్వారా రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సంక్షేమం అందిస్తూ..అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు...ఆదాయార్జన శాఖల ద్వారా మరింత రెవెన్యూ పెరగాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆదాయార్జన శాఖలపై,వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, మున్సిపల్, పంచాయతీరాజ్, అటవీ శాఖలపై చంద్రబాబు సమీక్షించారు. ఆయా శాఖల్లో ఆదాయార్జనకు సంబంధించి పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సముపార్జన అనేది ఎంత వరకు చేయగలిగామనే అంశంపై వివిధ శాఖల ఉన్నతాధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆదాయార్జన శాఖలు సొంతంగా ఆదాయాలు పెంచుకోవడం పైనా దృష్టి సారించాలి. ఆదాయ సముపార్జనలో ఉన్న లీకేజీలను గుర్తించి, వాటిని నివారిస్తూ రాష్ట్రానికి ఆదాయం పెంచేలా చూడాలి. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆదాయాలను ఎలా ఆర్జించాలనే అంశాలపై దృష్టి సారించాలి. వివిధ పథకాల్లో కేంద్రం నుంచి ఎలా నిధులు ఉన్నాయో గుర్తించి ఆ మేరకు ప్రతి పైసాను రాష్ట్రానికి తెచ్చుకునేలా కార్యాచరణ అమలు చేయాలి. రాష్ట్ర సొంత ఆదాయాలు పెంచుకుంటూనే.. కేంద్ర నిధులపై దృష్టి పెడితే .. రాష్ట్ర ఖజానా కు నిధుల ఇన్ ఫ్లో పెరుగుతుంది. ఈ దిశగా అధికారులు నిరంతరం పని చేస్తూనే ఉండాలి." అని ముఖ్యమంత్రి సూచించారు.

2014-19 మధ్య కాలంలో చేపట్టిన రూ. 180 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులను గత ప్రభుత్వం నిలిపేసింది. దీని వల్ల ఆ డబ్బులు కేంద్రం నుంచి రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఆగిపోయిన ఉపాధి హామీ పనులను తిరిగి రీఓపెన్ చేయించాం. ఏడాది పాటు నిరంతరం ఫాలో అప్ చేయడం వల్ల 3.52 లక్షలకు పైగా పనులను మళ్లీ రీఓపెన్ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరగా ప్రాసెస్ చేయాలి. ఓ నెల రోజుల్లోగా ఈ పనులకు సంబంధించిన రూ.180 కోట్లు వచ్చేలా చేయాలి. ఇక గత ఏడాది లానే ఈసారి కూడా గ్రామాల్లో నరేగా పనులను ప్రాధాన్యతల వారీగా గుర్తించి.. గ్రామసభల్లో ఆమోదం తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్సైజ్, ఇసుక, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల లాంటి శాఖల్లో సంస్కరణలు తెచ్చాం. ఇవి సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఈ సంస్కరణలతో ప్రజలకు మేలు జరుగుతోంది. రాష్ట్రానికి కొంత మేర ఆదాయం పెరిగింది. ప్రజలతో నిత్యం సంబంధం కలిగి ఉండే ఆదాయార్జన శాఖల పనితీరు మెరుగ్గా ఉండాలి. ఆయా శాఖల పనితీరు మీద ప్రజల్లో సంతృప్తి స్థాయి కూడా పెరగాలి. ప్రస్తుతం అన్న క్యాంటీన్లు, పెన్షన్ల పంపిణీ వంటి వాటిల్లో సంతృప్తి స్థాయి 90శాతం దాటింది. స్టాంపులు రిజిస్ట్రేషన్లు, మున్సిపల్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, గనులు వంటి శాఖల్లో కూడా >>2



### ద.మ రైల్వే జిఎంగా
## ఎస్.కె శ్రీవాత్సవ
### పిసిఇగా ఆంజనేయులు రెడ్డి

**గుంతకల్లు రైల్వే, జూలై 11,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా సంజయ్ కుమార్ శ్రీవాత్సవ,ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్‌గా డి ఆంజనేయులు రెడ్డిలను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే ఆదేశాలు జారీ చేశారు. భారతీయ రైల్వే 1988వ బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు చెందిన సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ ప్రస్తుతం అలహాబాద్‌లోని కేంద్ర రైల్వే విద్యుద్దీకరణ సంస్థ(కోర్(జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. అలాగే దక్షిణ మధ్య రైల్వే పిసిఇగా పనిచేసిన బ్రహ్మానందం జూన్ 30న పదవి విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో ప్రస్తుతం సిటిఇగా పనిచేస్తున్న డి. ఆంజనేయులురెడ్డిని నియమిస్తూ రైల్వే బోర్డు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

# నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తాం

### త్వరలో రూ.830 కోట్లతో కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు
### నగరంలోని 13 హైస్కూళ్ల ఆధునీకరణ: మంత్రి పి.నారాయణ

**నెల్లూరు, జులై 11, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరును స్మార్ట్ సిటీగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో సిటీ టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటిక ఇటు


శుక్రవారం నెల్లూరులో అధికారులు, నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ మంత్రి నారాయణ

సంక్షేమం ఇటు అభివృద్ధిని సమపాళ్లలో కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. నెల్లూరు నగర కార్పొరేషన్లలోనే 830 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. అక్టోబర్ ఒకటో తేదీ నాటికి అన్ని పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. అమృత్ స్కీం కింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు అందిస్తామని మంత్రి చెప్పారు. ఏడాదిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు. సిటీలోని 13 హైస్కూల్స్‌ను డిసెంబర్ కల్లా వీఆర్‌సీ తరహాలోనే ఆధునీకరిస్తామని మంత్రి >>2



శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

### ల్యాబ్ టెక్నీషియన్లు
## నలుగురు సస్పెన్షన్

### రంగరాయ వైద్యకళాశాలలో లైంగికవేధింపుల కేసు
### క్రిమినల్ కేసులు నమోదు చేసిన పోలీసులు
### దోషులపై కఠిన చర్యలు తప్పవు: కలెక్టర్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,జూలై 11 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా రంగరాయ వైద్య కళాశాల పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల సంఘటనలో నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు ను విధుల నుండి సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేసామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.బిందుమాధవ్ సంయుక్తంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంగరాయ వైద్య కళాశాలలో పారామెడికల్ విద్యార్థినుల నుండి లైంగిక వేదింపులు అంశంపై అందిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు, అటువంటి సంఘటనలు విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలలో పునరావృతం కాకుండా చేపట్టిన చర్యలను గురించి వివరించారు. ఈ నెల 9వ తేదీన రంగరాయ వైద్య కళాశాలలో బిఎస్సీ మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ కోర్సు చదువుతున్న 60 మంది విద్యార్థులు కళాశాలలో లాబ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వి.కళ్యాణ చక్రవర్తి తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేదింపులకు పాల్పడుతున్నాడని ఈ మెయిల్ ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేసారన్నారు. దీనిపై ఆర్ఎంసి ప్రిన్సిపాల్ వెంటనే స్పందించి ఈ ఫిర్యాదును లైంగిక వేధింపుల నిరోధానికి కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ విచారణకు అప్పగించారని, ఈ కమిటీ 9,10 తేదీలలో బిఎస్సీ ఎంఎల్టీ కోర్స్ చదువుతున్న 60 మంది విద్యార్థులు, నిందిత ఉద్యోగుల లను విచారించి, అందరి వాంగ్మూలాలు, రుజువులను నమోదు చేసిందన్నారు. విచారణ సందర్భంగా 55మంది విద్యార్థినులు, నిందితుడు కళ్యాణ చక్రవర్తితో పాటు, మరో ముగ్గురు లాబ్ టెక్నీషియన్లు ఎస్.గోపాలకృష్ణ, బి.జిమ్మిరాజు, జివిఎస్ ప్రసాదరావులు కూడా తమపై లైంగిక వేధింపులకు, అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డారని తెలిపారన్నారు. కమిటీ విచారణలో ఫిర్యాదులోని ఆరోపణలు నిజమని 55మంది విద్యార్థినులు తెలియజేసారని, రుజువుల >>2

# మాతృభాష, రాజ్యభాష రెండూ కీలకమే


శుక్రవారం హైదరాబాద్‌లో రాజ్యభాషా స్వర్ణోత్సవాలను ప్రారంభిస్తున్న ఎపి డిప్యూటీ సీఎం పవన్. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు

### హిందీని నేర్చుకోవడం మరింత బలపడడానికే: ఎపి డిప్యూటీ సిఎం పవన్
### జాతీయ భాషావిభాగానికి 50యేళ్లు: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 11, ప్రభాతవార్త :** విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాలకోసం భాషతో సంబంధం లేకుండా ముందు కెళ్తున్న ప్రస్తుత రోజుల్లో హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అలా చేయడం రాబోయేతరాల అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందన్నారు. శుక్రవారం గచ్చిబౌలి జిఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించిన రాజ్య భాష విభాగం స్వర్ణోత్సవ వేడుకల్లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి >>2

## రజత్ భార్గవ్ సిట్ విచారణకు హాజరు

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో విశ్రాంత ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ్ సిట్ ఎదుట శుక్రవారం విచారణకు హాజరయ్యారు,గత ప్రభుత్వ హయంలో రజత్ భార్గవ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేసారు. మద్యంపై విడుదలైన జీవోలు,లావాదేవీలు తదితర విషయాలపై సమాచారం కోసం సిటన అధికారులు ఆయనను విచారణకు రావాలని ఆదేశించారు.విజయవాడలో సిట్ కార్యాలయంలో రజత్ భార్గవ్‌ను విచారిస్తున్నారు.శుక్రవారం ఉదయం 10గంటలకు రజత్ భార్గవ్ విచారణకు రావల్సి ఉండగా, అనారోగ్య కారణాలతో >>2

# ఒక్క యేడాదిలో సంక్షేమం డబుల్

### ఆర్థిక నిర్వహణ కష్టమైనా మా బాధ్యతగా భావిస్తున్నాం
### సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల

**కనేకల్ జూలై 11 ప్రభాతవార్త:** నిధుల సమీకరణ ఎంత కష్టమైన ప్రజాసేవ మా బాధ్యతగా భావిస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కనేకల్లు మండలం ఎర్రగుంట గ్రామంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులతో కలసి ప్రారంభించారు.అనంతరం సభానుద్దేశించి ఆయన మాట్లాడుతూ... వైకాపా పాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆవేదన వ్యక్తపరిచారు.అప్పుల కూపంలోకి నెట్టివేసి బయట ఎక్కడ అప్పు


ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

పుట్టకుండా చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి ఎదురుకానన్ని ఆర్థిక సమస్యలు మనరాష్ట్రాల్లో వైకాపా పాలకులు సృష్టించారని ధ్వజమెత్తారు. నిత్యం అప్పుల కోసం రాత్రింబవళ్లు ఎంతో శ్రమించ వాల్సి వస్తుందన్నారు. ప్రతి నెలా ఖర్చులకు డబ్బులు సర్దుబాటు చేయడం పెద్ద సవాలుగా మారిందన్నారు. గ్రామాల్లో మహిళలు ఎలాగైతే ఖర్చుల కోసం ఇబ్బంది పడుతుంటారో అదేవిధంగా రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధులు సమకూర్చడం కూడా సమస్యగా ఉంటుందన్నారు. వైకాపా దివాలా తీయించిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు చతురత, అనుభవంతో రాష్ట్రం ప్రగతిబాట పట్టిందన్నారు. రాష్ట్రఆదాయం పెంచే విధంగా >>2

# మానవ వనరులే అభివృద్ధికి మెట్లు

>>తెలిపారు. మంచి పాలసీ ఏ విధంగా తేవాలని ఇక్కడ మనం కూర్చొని ఆలోచిస్తున్నామన్నారు. సామాజిక పరిస్థితులల్లోనేను మార్పు వస్తుందన్నారు. మానవ వనరులు అధికంగా ఉన్నందున వలనే భారత్ నుంచి, కీలకంగా తెలుగు రాష్ట్రాలనుంచి ప్రజలు ఇతర దేశాలకు వెళ్లి తమ ప్రతిభ చూపుతున్నారన్నారు.ఇప్పుడు ప్రవాస భారతీయులు అత్యధికంగా ఆయా దేశాల్లో ధనవంతులుగా ఉన్నారు.ఈ రోజు వార్త కథనాలు గమనిస్తే అమెరికాలోని విదేశీయుల్లో సంపన్న భారతీయులు అధికంగా ఉన్నారన్నారు. అందులో తెలుగువారు ఉండటం గర్వంగా ఉందన్నారు. దక్షిణాదిలో జనాభా తగ్గడం వల్ల నియోజకవర్గాల పునర్విభజనలో పార్లమెంట్ సీట్లు కూడా తగ్గుతాయనే చర్చ జరుగుతోందన్నారు. జనాభా ప్రత్యుత్పత్తి రేటులో 1.8 శాతంగా ఉన్న ఏపీ 2.1 శాతానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్2047 లక్ష్యసాధనకు జనాభా పెరుగుదల ఎంతో కీలకమని చంద్రబాబు అన్నారు. రాబోయే 20 ఏళ్లలో వచ్చే పెను మార్పులకు అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమ్మిళిత వృద్ధే జనాభా పెరుగుదలకు సరైన మార్గమన్న సీఎం జనాభా పెరుగుదలకు మంచి పాలసీని తీసుకొస్తామన్నారు. అభివృద్ధి ఉన్న చోటికి ప్రజలు వలస వస్తారనటానికి హైదరాబాద్ ఓ ఉదాహరణ అని గుర్తు చేశారు. సరైన ఆదాయం, ఉద్యోగం లేకపోవడం వల్లే చాలామంది పిల్లలు వద్దనుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. విధానాల్లో మార్పులు ద్వారా ఈ సమస్యలను అధిగమించాలని సూచించారు. ఇప్పుడు ఏ దేశంలో జనం ఉంటే వారికే ఎక్కువ గౌరవం దక్కుతోందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఎక్కువ జనాభా ఉన్న దేశం భారతదేశమని, సుమారు 143 కోట్లమంది ఉండగా, చైనా జనాభా 130 కోట్లని తెలిపారు. అమెరికాలో ఫెర్టిలిటీ రేటు 1.62 మాత్రమేనని 2.1 ఫెర్టిలిటీ రేటు ఉంటే రీప్లేస్‌మెంట్ ఉంటుందని లేనిపక్షంలో రోజురోజుకూ జనాభా తగ్గిపోతుందని తెలిపారు. మన దేశంలో బీహార్ 3.0,మేఘాలయ 2.9, వంటి రాష్ట్రాల్లో ఎక్కువ ఫెర్టిలిటీ రేటు ఉందని తెలిపారు. అలాగే ఏపీలో అది 1.78 చేరుకుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకున్న తెలుగువారు అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. దేశమంటే మనుషులు అనే నినాదానికి సార్థకత చేకూరాలని అన్నారు. గురజాడ చెప్పిన స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. ఎక్కువ మంది పిల్లలు ఉంటే కొన్ని దేశాల్లో అదే ఇస్తున్నారు, ప్రత్యక్ష నగదు బహుమతి ఇస్తున్నారని గుర్తు చేశారు. పలు దేశాల్లో చైల్డ్ అలవెన్స్ కింద ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తున్నారని తెలిపారు. హంగేరీలో పెద్ద కుటుంబాలకు కార్లు ఇస్తున్నారని సీఎం వివరించారు. చైనాలో ఇద్దరు పిల్లలు ఉంటే ప్రభుత్వం రూ.12 లక్షలు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. ఏపీలో ఎంతమంది పిల్లలు ఉన్న తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తున్నామని సీఎం వెల్లడించారు.

**యువశక్తి తగ్గి..వృద్ధులు పెరుగుతున్నారు:** ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జనాభాతో పాటు జననాల రేటు తగ్గిపోతోందని చంద్రబాబు అన్నారు. యువశక్తి తగ్గిపోయి వృద్ధులు పెరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశంలోనైతే వయోజన సమస్య వస్తుందో అక్కడ వృద్ధిరేట్ నిలిచిపోతుంది. భవిష్యత్‌లోనూ సమస్యలు వస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సంతానోత్పత్తి రేట్ పడిపోతోంది. అమెరికాలో 1.62 శాతం, యూకేలో 1.54 శాతం, హంగేరిలో 1.50 శాతం, ఫ్రాన్స్‌లో 1.49 శాతం, రష్యాలో 1.47 శాతం, జర్మనీలో 1.46 శాతం, కెనడాలో 1.33 శాతం, జపాన్‌లో 1.23 శాతం, చైనాలో 1.02 శాతం, సింగపూర్‌లో 0.96 శాతం ఉంది. సంపన్న దేశాల్లో తక్కువ జననాల రేటు కన్పిస్తోంది. 2.1 కంటే తక్కువ ఉంటే జనాభా తగ్గిపోతుంది. మన దేశంలో బీహార్ 3.0, మేఘాలయ 2.9, యూపీ 2.4, జార్ఖండ్ 2.3, మణిపూర్ 2.2, తమిళనాడు 1.8, తెలంగాణ 1.8, కేరళ 1.8, కర్ణాటక 1.7, ఏపీ 1.7 శాతంగా ఉన్నాయి. జనాభా సమతుల్యత పాటించాలంటే 2.1 రేట్ ఉండాలి. అప్పుడే జనన మరణాలు సమతుల్యంగా ఉంటాయి అని సీఎం వివరించారు.

**అగ్రస్థానంలో భారతీయులే:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో మన దేశంలో సుస్థిర పాలన, అభివృద్ధి జరుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలతో 1995లో టెక్నాలజీ విప్లవం వచ్చిందన్నారు. ఐటీతో ప్రపంచవ్యాప్తంగా మన భారతీయులు అగ్రస్థానంలో నిలిచారన్నారు. అమెరికాలో 43 దేశాలకు చెందిన 125 మంది బిలీనియర్లలో మనవారు 10 మంది ఉన్నారు. ప్రపంచంలో అత్యధిక తలసరి ఆదాయం మన భారతీయులకే వస్తోంది. 2047 వరకూ జనాభా వరమైన ప్రయోజనం ఉన్నప్పటికీ సరైన సమయంలో పరిష్కార మార్గాలు అవలంభిస్తే విజేతలుగా నిలుస్తామని అన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తొలి సదస్సుకు వచ్చిన వారితో ముఖ్యమంత్రి కాసేపు మాట్లాడారు. జనాభా నిర్వహణపై వాళ్ల అభిప్రాయాలు అడిగారు. ఈ క్రమంలో కొందరు తమ అభిప్రాయాలు చెప్పడంతో పాటు కొన్ని సందేహాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేను ఇటీవల కుప్పం వెళ్లినప్పుడు ఒక ఉమ్మడి కుటుంబాన్ని చూశా. మూడు తరాలవారు కలిసి ఉంటున్నారు. పనులు చేసి సంపదకూడా వారు పంచుకుంటున్నారు. ప్రభుత్వాలు కూడా ఎక్కువ మంది ఉంటే తక్కువ డబ్బు ఇస్తున్నాయి. ఇకపై జనాభా నియంత్రణ కాకుండా జనాభా నిర్వహణ దిశగా ముందుకెళ్తామన్నారు. ఎన్టీఆర్ తాతమ్మ కల అనే సినిమా తీశారు. ఎందరు పిల్లలుంటే అంత సంపదని అందులో చూపించారు. పిల్లలను కనే వరం భగవంతుడు మహిళలకు ఇచ్చాడని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్ర దేవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మైనా మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుహానీ జలోటా, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ ఎమ్.ప్రకాశమ్మ, ప్రొఫెసర్ సంజయ్ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్లు నలుగురు సస్పెన్షన్

>>పరిశీలనలో కూడా లైంగిక వేదింపులు, అశ్లీల మెస్సేజులు, అనుచిత ప్రవర్తన జరిగినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా నలుగురు నిందిత ఉద్యోగులను రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సస్పెండ్ చేసి, వారిపై స్థానిక వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా, శుక్రవారం మద్యాహ్నాం వారందరినీ అరెస్ట్ చేయడంజరిగిందని,వీరిపైచట్టపరమైనచర్యలుచేపట్టడం జరుగుతుందన్నారు.

ఈ సంఘటనలో తమపై జరుగుతున్న లైంగిక వేదింపులపై ధైర్యం ముందుకు వచ్చి ఫిర్యాదు చేసిన విద్యార్థినులను, ఫిర్యాదుపై తక్షణ విచారణ నిర్వహించి వారిలో వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని నింపిన ఆర్ఎంసి ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఆర్ఎంసి సంఘటన లో విద్యార్థినులు, పనిచేసే మహిళలపై లైంగిక అకృత్యాలను నిరోధించేందుకు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళశాలలు, కార్యాలయలలో మహిళల రక్షణకు ఏర్పాటైన అంతర్గత కమిటీలను మరింత బలోపేతం చేసి చైతన్య పరుస్తామని తెలిపారు. విద్యార్థినులు, పనిచేసే మహిళలు లైగింక వేదింపులు ఎదురైతే నిర్భయంగా ఈ కమీటీలకు గాని, తనకు గానీ తెలియజేయాలని, ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచి, నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఆర్ఎంసీ సంఘటనలో పోలీస్ స్టేషన్లలో శుక్రవారం ఉదయం ఫిర్యాదు నమోదు కాగా, నేరారోపితులు నలుగురిని మద్యాహ్నాం రెండున్నర లోపు అరెస్ట్ చేయడం జరిగిందని, సంబంధిత సెక్షన్ల ప్రకారం వారిపై చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. బాలికలు, మహిళల రక్షణకు చేపట్టిన చర్యల్లో భాగంగా పోలీస్ శాఖ ..శక్తి యాప్.. ను అందుబాటులోకి తెచ్చిందని, విద్యార్థినులు, వర్కింగ్ ఉమెన్ తమ పట్ల జరిగే అకృత్యాల నుండి రక్షణ పొందేందుకు ఈ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శక్తి యాప్ గురించి బాలికలు, మహిళలందరికి తెలియజేసి అవసర సమయాల్లో వినియోగించుకునేలా చైతన్య పరచాలని మీడియాను కోరారు. ఈ సమావేశంలో రంగారాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ.విష్ణువర్థన్, జిజిహెచ్ ఇన్చార్జి సూపరింటెండెంట్ డా.పి.శ్రీనివాసన్, ఆర్ఎంసి పారామెడికల్ కోర్సుల కో ఆర్డినేటర్ డా.కె.సతీష్ పాల్గొన్నారు.

# ఒక్క యేడాదిలో సంక్షేమం డబుల్

>> ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పెద్దపెద్ద కంపెనీ ద్వారా పెట్టుబడులు పెట్టించి ఉపాధి కల్పనకు ముఖ్యమంత్రి అనునిత్యం శ్రమిస్తుంటారని గుర్తు చేశారు. తద్వారా రాష్ట్ర ప్రజలకు ఉపాధితో పాటు రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా, ప్రజా సంక్షేమం కోసం బాధ్యతగా పని చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పక్కగా ఒక్కోహామీని నెరవేర్చుతున్నా మన్నారు. సంక్షేమం డబుల్ చేయగా, అభివృద్ధి పదింతలు చేస్తు న్నామని వివరించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తొలిసారి జిల్లాకు వచ్చినప్పుడు జిల్లా అభివృద్ధికి మొదట కూలీగా పనిచేస్తానని హామీ ఇచ్చామన్నారు. తనకు ముఖ్యమంత్రి ఇచ్చిన అవకాశాన్ని జిల్లా రుణం తీర్చుకోవటానికి శక్తివంచన లేకుండా పనిచేస్తాన న్నారు. ముఖ్యంగా తన పూర్వీకుల రాజకీయ నేపథ్యం రాయదుర్గం నియోజకవర్గంతో ముడిపడిందన్నారు. అందువల్లే ఉరవకొండతో పాటు రాయదుర్గంతో గట్టి సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మంత్రి పయ్యావులతో మొదటి నుండి సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయనీ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. ప్రతి క్షణం ప్రజాహితమే లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజల విశ్వాసం, ఆశీస్సులతో ఎంపికైన ప్రభుత్వం పేదరికాన్ని దూరం చేయటానికి ఎంతగానో శ్రమిస్తోందన్నారు. ఐదేళ్ల వైకాపా దుష్టపాలన హెచ్ ఎల్ సి వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆర్థిక శాఖ మంత్రి పయాలకేశవుల సహకారంతో హెచ్ఎల్సి అత్యవసర పనులకు అనుమతులు లభించాయన్నారు. వారందరి చలవవల్లే గండ్లు, పైపింగ్లు పడే పరిస్థితి నుంచి బయట పడగలుగుతున్నామన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ తో తనకున్న వ్యక్తిగత పరిచయాలతో సకాలంలో తగిన సూచనలు సలహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తుంటారని పేర్కొన్నారు. ప్రజలకు మేలు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల, ఎమ్మెల్యే కాలవ

చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రితో పాటు పయ్యావుల అనేక నిద్రలేని రాత్రులు గడుపుతుంటారన్నారు. నీధుల సమీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద కష్టంగా మారిందన్నారు. అయినప్పటికీ జిల్లాను ఏదో విధంగా అభివృద్ధి పరచాలనే దృఢ లక్ష్యంతో మంత్రి నిధులు సమకూర్చ గలుగుతున్నారన్నారు. ఇంత గడ్డు పరిస్థితుల్లో కూడా రూ.3800 కోట్ల తో హంద్రీనీవా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే వైకాపా పాలనలో ఆగిపోయిన జీడిపల్లి బైరవాణి తిప్ప ప్రాజెక్ట్ పనులు పునఃప్రారంభించామన్నారు. ఆవులదట్ల, మాల్యం బ్రాంచ్ కాలువలకు నీధులు సమకూర్చి సకాలంలో పూర్తి చేయడానికి మంత్రి తోడ్పాటు అందించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న దశలో రాయదుర్గాన్ని కూడా ప్రతిపాదన చేయించాకొమ్మని ముందే అప్రమత్తం చేశారన్నారు. నేమకల్లు రిజర్వాయర్‌తో పాటు హెచ్.ఎల్.సి ఆధునికరణ పనులను పూర్తి చేసుకోవడానికి మంత్రి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాల్లో కొనసాగినంత కాలం తమ ఇరువురి మధ్య ఇదే విధమైన ప్రేమ, అభిమానాలు కొనసాగాలని, దాంతో ప్రజలకు ఏదో విధంగా మేలు జరగాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ రంగసంస్థల నిర్వహణపై పరిశీలన

>> కమిటీలో సభ్యులుగా వున్న శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాం గోపాల్ రెడ్డి, కాంట్రాక్టర్ ఐజాక్ బాషా, శాసనసభ్యులు నడికుదిటి ఈశ్వరరావు, ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీ నాయన), గిడ్డి సత్యనారాయణ తదితరులు సమావేశంలో పాల్గొని పలు ప్రభుత్వ సంస్థల పనితీరుపై అధికారులతో చర్చించి ఆయా సంస్థల నిర్వహణకు సంబంధించి వార్షిక నివేదికలు, అకౌంట్ల ఆడిట్, పనితీరుకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో జి.వి.ఎం.సి. కమిషనర్ కేతన్ గార్గ్, వి.ఎం.ఆర్.డి.ఏ. జాయింట్ కమిషనర్ రమేష్, పర్యాటక సంస్థ డివిజనల్ మేనేజర్ జగదీష్, జిల్లా పర్యాటక అధికారి మాధవి, ఏపిఐఐసి అధికారులు తమ సంస్థల పనితీరు, కార్యకలాపాలపై కమిటీకి వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును మదింపుచేసి వాటి అకౌంట్ల నిర్వహణ, ఆర్థిక నిర్వహణపై నివేదికలను పరిశీలించి,వాటి నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రభుత్వానికి తమ కమిటీ సూచనలు చేస్తుందని ఛైర్మన్ కూన రవికుమార్ చెప్పారు. అన్ని ప్రభుత్వ సంస్థలు తమ కార్యక్రమాలపై, అకౌంట్ల నిర్వహణ, ఆడిట్ పై పూర్తిస్థాయి సమాచారంతో కూడిన నివేదికలు అందజేసినపుడే తాము ప్రభుత్వానికి సరైన నివేదికలు అందించగలమని చెప్పారు. రాష్ట్ర పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ పదహారేళ్ల తర్వాత ఈ సమావేశం తొలిసారిగా నిర్వహిస్తోందని ఛైర్మన్ రవికుమార్ పేర్కొన్నారు. విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యక్రమాలు, చేపట్టిన ప్రాజెక్టులపై జి.వి.ఎం.సి. కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు. వి.ఎం.ఆర్.డి.ఏ. కమిషనర్ తరపున జాయింట్ కమిషనర్ రమేష్ సంస్థ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా విశాఖ నగరాభివృద్ధి సంస్థ ద్వారా న్యాయ వివాదాల సత్వర పరిష్కారానికి చేసిన ఏర్పాట్లపై కమిటీ ఆరా తీసింది. ప్రజలకు త్వరగా సేవలు అందించేందుకు వీలుగా ప్రత్యేక జ్యుడిషియల్ ప్యానెల్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ సూచించారు. విఎంఆర్‌డిఏ అకౌంట్ల ఆడిట్ గురించి కూడా తెలుసుకున్నారు. ఏపి పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా పారిశ్రామిక వేత్తలకు కేటాయించిన భూములు, వాటిని ఏ మేరకు సద్వినియోగం చేసుకొని పరిశ్రమాలు ఏర్పాటు చేస్తున్నారనే అంశంపై కమిటీ సభ్యులు చర్చించారు. ఆయా భూములను పారిశ్రామిక వినియోగానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించినపుడు ఏ రకమైన చర్యలు చేపట్టారనే అంశంపై కూడా కమిటీ సభ్యులు ఆరా తీశారు. శ్రీకాకుళం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యకలాపాలపై అక్కడి మునిసిపల్ కమిషనర్ ప్రసాదరావు వివరించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులు, వాటి నిర్వహణపై సంస్థ డివిజనల్ మేనేజర్ జి.వి.బి.జగదీష్ వివరించారు. సమావేశంలో ఏపి లెజిస్లేచర్ కమిటీ సంయుక్త కార్యదర్శి పి.వి.సుబ్బారెడ్డి, జి.వి.ఎం.సి. అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ సింహాచలం, మెడ్‌టెక్ జోన్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖజిల్లాల పర్యాటక అధికారులు నారాయణరావు, కుమారస్వామి, మాధవీలత, వి.ఎం.ఆర్.డి.ఏ. ఎస్టేట్ ఆఫీసర్ బి.దయానిధి పాల్గొన్నారు.

## విచారణకు హాజరు

>> ఆయన ఆలస్యంగా వచ్చారు.మొదట తన అనారోగ్యం దృష్ట్యా మరో రోజు విచారణకు వస్తానని రజత్ భార్గవ్‌ను కోరారు.అయితే కీలక సమాచారం కావాల్సి వుండగా,ఆయన తప్పని సరి విచారణకు తక్షణం రావాలని సిట్ అధికారులు ఆయనకు స్పష్టం చేసారు.దాంతో నేడే విచారణకు వచ్చారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు నేతలు, అధికారుల్ని సిట్ విచారించి అరెస్ట్ చేసారు.

## సిటీగా మారుస్తాం

>>నారాయణ తెలిపారు. 9వ డివిజన్లో 22 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేస్తామని అదే విధంగా అల్లీపురం డంపింగ్ యార్డులో అన్ని హంగులతో పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. పినాకినిలో వాటర్ స్పోర్ట్స్ ఆక్రమిస్తే తిరిగి తీసుకుంటామని హెచ్చరించారు.సమీక్షలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## ఆర్థికవృద్ధికి కృషి

>> సంతృప్త స్థాయి కూడా 90 శాతం వచ్చేలా అధికారులు పని చేయాలి." అని చంద్రబాబు ఆదేశించారు ఆదాయార్జన శాఖలను లీడ్ చేస్తున్న అధికారులు వినూత్నంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఈ శాఖలకు చెందిన అధికారులు చక్కటి నాయకత్వం అందిస్తే.. ఆయా శాఖల పని తీరు మరింత మెరుగ్గా ఉంటుంది. ఆయా శాఖల్లో ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అన్నారు. నాయకులుగా ఆలోచించి పని చేస్తే ఎలాంటి సమస్యకు అయినా పరిష్కారం లభిస్తుంది. రాష్ట్రానికి అభివృద్ధి ఎంత ముఖ్యమో.. సంక్షేమమూ అంతే ముఖ్యం. రెండు సమపాళ్లల్లో ఉండాల్సిందే. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని.. రాష్ట్రాన్ని మరింత ప్రగతి బాటన పయనించే విధంగా పని చేయాలి." అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 22 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నారాయణపూర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 8 మంది మహిళా మావోయిస్టులు ఉండగా లొంగిపోయిన వారిపై రూ.37లక్షల రివార్డు ఉందని ఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన ఒక్కొక్కరికి రూ.50వేల నగదు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అబూజ్‌మడ్ అడవుల్లో నిరంతరం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతుందని, ఈ యేడాదిలో ఇప్పటి వరకు 110 మంది మావోయిస్టులు లొంగిపోవడం జరిగిందని ఎస్పీ తెలియజేశారు.



శుక్రవారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను సత్కరించి, గణేశ ప్రతిమను బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు

## గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో సీఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ, జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్‌తో శుక్రవారం సాయంత్రం దాటిన తరువాత సీఎం చంద్రబాబునాయుడు బేటీ అయ్యారు.ఉండవల్లిలోని తన ఇంటి నుంచి రాజభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు అక్కడి సిబ్బంది ఘన స్వాగతం పలికారు.జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్ చంద్రబాబు సాదరంగా రాజభవన్‌లోకి ఆహ్వానించారు.అనంతరం గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్‌తో చంద్రబాబు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.రాష్ట్రంలో ఇటీవల అమలులోకి తీసుకుని వచ్చిన తల్లికి వందనం పథకంతో సహా పేదరిక నిర్మూలనకు పీ4 పథకం ద్వారా తీసుకుంటున్న చర్యల గురించి సీఎం గవర్నర్‌కు వివరించారు.రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు.అమరావతి రాజధాని నిర్మాణం,యోగ దినోత్సవం, తల్లితండ్రులు,ఉపాధ్యాయుల మెగా సమావేశాల నిర్వహణ.ప్రపంచ రికార్డుల సాధన, రాష్ట్ర ఆర్ధిక పరిస్దితి,ఆదాయం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు.శాంతి భద్రతల పరిస్దితుల గురించి సీఎం తెలిపారు.తాజా రాజకీయాలతో సహా నాలుగురోజుల పాటు ఢిల్లీలో పర్యటించే అంశంపైన సీఎం చంద్రబాబు ఏపీ గవర్నర్‌కు వివరించారు. ఆరోగ్యరంగంలో తీసుకుంటున్న చర్యలను తెలిపారు.గవర్నర్‌ను ఈ సమావేశ అనంతరం గవర్నర్‌ను సీఎం చంద్రబాబు సముచిత రీతిన సన్మానించారు.శ్రీగణేశ ప్రతిమను బహుకరించారు.గంటకు పైగానే గవర్నర్‌తో సీఎం పలు అంశాలపై చర్చించారు.అనంతరం సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాస గృహానికి చేరుకున్నారు.

## కేంద్రం ఎరువుల కోత విధించలేదు

### వ్యవసాయ శాఖ సంచాలకులు డిల్లీ రావు

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం చేసే ఎరువుల కేటాయింపులలో ఇప్పటివరకు ఎటువంటి కోత విధించలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డిల్లీ రావు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజనుకు ఎప్పటి మాదిరిగానే 16.76 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు.. కేటాయించగా జూన్ నెల ఆఖరు నాటికి 5.64 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి వచ్చినట్లు వీటిని ప్రైవేటు, సహకార సంస్థల ద్వారా రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల వినియోగ పరిణామ క్రమంలోనీ సందర్భాన్ని ప్రస్తావిస్తూ పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలు తీర్చే విధంగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయు ఉద్దేశంతో అధిక దిగుబడి ఇచ్చు వంగడాలను అభివృద్ధి చేసి వాటికి కావలసిన పోషకాలను రసాయనిక ఎరువుల రూపంలో అందించడాన్ని అలవాటు చేసింది, ప్రోత్సహించింది వ్యవసాయ శాఖనే అని, అయితే ప్రస్తుత మెరుగుబడిన భూభౌతిక పరిస్థితి మరియు నేలలోని పోషకాల లభ్యతల ఆధారంగా కొత్త తరం పంటల రకాల సాగు ద్వారా తక్కువ ఎరువుల వినియోగంతో అదే దిగుబడులను సాధించవచ్చని తెలిపారు.కొంత మంది వివిధ వేదిక లలో పేర్కొన్నట్లు ఎరువుల కేటాయింపులలో కేంద్రప్రభుత్వం కోత విధించడం , వాటిని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి రైతులను ఇబ్బందులకు గురి చేయడం జరిగిందన్న వార్త పూర్తిగా అవాస్తవం అని తెలిపారు. రైతులు అవగాహన లోపంతో రోజు రోజుకు పెంచుకుంటూ పోతున్న రసాయన ఎరువుల వాడకపు మోతాదు తద్వారా ఉత్పన్నమయ్యే దుష్పరిణామాలు దృష్టిలో వుంచుకొని అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించడానికి మాత్రమే కొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులను అందుబాటులోకి తేవటం జరిగిందని తెలిపారు. వాటిలో ముఖ్యంగా సేంద్రియ మరియు జీవన ఎరువుల వాడకాన్ని పెంచడం, రసాయన ఎరువుల పై ఆధారాన్ని కొంతమేర తగ్గించడం, దిగుబడి మెరుగుదల తో పాటు పర్యావరణ హానిని నివారించడం, పచ్చి రొట్ట పైర్ల వాడకం ద్వారా భూమి సారవంతమయి ,నేరుగా నత్రజని నేలకు అందించడంలో సహాయ పడతాయి, భూసార పరీక్షల ఆధారంగా పంటలకు సరిపోయే ఎరువుల మోతాదును వాడకం ద్వారా రసాయన ఎరువుల ఖర్చును తగించవొచ్చు అని అన్నారు నానో ఎరువులు వాడటం. వల్ల ఎరువుల వృధా తగ్గి ఎరువుల పై ఖర్చు కూడా తగ్గుతుంది, నేల ఆరోగ్యం మెరుగు అవుటం నీటి కాలుష్యం తగ్గటము జరుగుతాయి పప్పు జాతి పంటలను అంతర ,ప్రధాన పంటలుగా వేసుకోవడం వలన వాటి వేర్లు గాలిలో ఉన్న నత్రజనిని నేలకు అందించి భూమి సారవంతము చేస్తాయి తద్వారా ఎరువుల వాడకం తగ్గుతుంది. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించడానికి వివిధ ప్రత్యామ్నాయాల పై రైతులలో అవగాహన కల్పించడం వ్యవసాయ శాఖ యొక్క ముఖ్య ఉద్దేశం.

## మాతృభాష, రాజ్యభాష రెండూ కీలకమే

>> కిషన్ రెడ్డి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌తో పాటు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశ ఐక్యతలో రాజ్యభాష హిందీ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. దేశ సమైక్యతలో భాగంగా ఒక బెంగాలీ గీతం జాతీయ గీతం అయ్యింది, ఒక పంజాబీ భగత్ సింగ్ దేశం కోసం పోరాడే విప్లవకారుడు అయ్యాడు, రాజస్థాన్‌కు చెందిన రాణాప్రతాప్ శౌర్యానికి చిహ్నం అయ్యారు. తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అయ్యారు. మద్రాస్ ప్రెసిడెన్సీ, ద్రవిడ ప్రాంతంలో ఉన్న ఒకరు చేసిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రతీ భాషా జీవ భాష, మాతృ భాష.. కానీ రాజ్య భాష మాత్రం హిందీ అని ఆయన స్పష్టం చేశారు. మనం ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృ భాష ఉంది. కానీ మన ఇంటి సరిహద్దులు దాటితే మన రాజ్య భాష హిందీ ఉందన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు దేశంలోని ఇతరత్రా అన్ని భాషల పౌరులకు మాతృ భాష మీద గౌరవం ఉంటుందని అన్నారు. విద్యా, వైద్యం, వ్యాపారం, ఉపాధి కోసం అన్ని భాషలు, మాండలికాలు అవధులను దాటుకుంటూ వెళ్లిపోతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో హిందీ వద్దు అనుకోవడం, వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని పరిమితం చేసినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోయినట్లు కాదని, మనం మరింత బలపడటం అన్నారు. ఇంకొక భాషని అంగీకరించడం అంటే మనం ఓడిపోవడం కాదు, కలిసి ప్రయాణం చెయ్యడం అని తెలిపారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్లనే ఐటీ రంగంలో ముందున్నామని, అలాంటిది దేశం మొత్తం మీద ఎక్కువ శాతం జనాభా మాట్లాడే హిందీ భాష నేర్చుకోవడం వల్ల ప్రయోజనమే కానీ నష్టం ఉండదన్నారు. సౌత్ ఇండియన్ సినిమాలలో 31 శాతం సినిమాలు హిందీలో డబ్ అయ్యి ఆదాయం పొందుతున్నాయని, ఇలా వ్యాపారాలకు హిందీ కావాలి, నేర్చుకోవడానికి మాత్రం హిందీతో ఇబ్బందేంటి అని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు.

**భాషలు వేరువేరు అయినా, భారతీయులందరి భావన ఒక్కటే : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

భాషలు వేరువేరు అయినా, భారతీయులందరి భావన ఒక్కటేననడానికి ఇదొక ఉదాహరణ అని తెలిపారు. అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో హిందీ, ఇతర భారతీయ భాషల ద్వారా ప్రజలతో సమన్వయం చేసుకుంటూ వికసిత భారత్, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను చేరుకునేందుకు మనమంతా కలిసి ప్రయత్నించాలన్నారు. మన దేశంలోని ప్రజలందరిని తమ తమ మాతృభాషల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలకు అనుసంధానించడం చాలా అవసరమన్నారు. అప్పుడే ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని తెలిపారు. జాతీయభాషా విభాగం ఏర్పాటై 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ స్వర్ణ జయంతి వేడుకల్లో భాగంగా మొదటి కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహించగా, రెండో కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తుండటం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఏ సంస్థకైనా 50 ఏళ్ల ప్రయాణం చాలా ప్రత్యేకమైనదని, ఈ 50 ఏళ్లలో సాధించిన ప్రయాణాన్ని గుర్తుచేసుకోవడం, సంబరాలు చేసుకోవడం ఒక ఎత్తయితే, భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించుకోవడం మరో కీలకమైన అంశమని అన్నారు. మాతృభాష స్థానాన్ని ఎలాంటి ఇతర భాషా తీసుకోలేదని మహాత్మాగాంధీ, హిందీభాషాభివృద్ధి అవసరమని మహర్షి దయానంద సరస్వతి, భౌతికశాస్త్రాన్ని మాతృభాషలో నేర్పాలని ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్, తాను శాస్త్రవేత్తగా ఎదిగేందుకు కారణం మాతృభాషలో విద్యాబోధనే అని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పడం, మాతృభాషలో విద్యను ప్రోత్సహించాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పడం ఇవన్నీ ప్రాంతీయభాషలకు గౌరవాన్ని ఇస్తూనే.. ఒక జాతీయ భాష ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతున్నాయన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి ఐక్యరాజ్య సమితిలో హిందీలో ప్రసంగించి మన భాషకు అంతర్జాతీయ తీసుకొచ్చారని, మన దేశంలో అనేక భిన్న భాషలు ఉన్నప్పటికీ, అందులోని భావన మాత్రం ఒకటేనని, స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో వందేమాతరం, భారత మాతాకీ జై నినాదాలు దేశమంతా ప్రతిధ్వనించాయన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం 11 భారతీయ భాషలకు ప్రాచీన భాష హోదాను కల్పించిందన్నారు. ఈ భాషలన్నింటికీ కనీసం 1500-2000 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. 2020లో తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానంలోనూ ప్రాంతీయ భాషలకు పెద్దపీట వేసిందని, ప్రధానమంత్రి మోడీ కూడా విదేశీ పర్యటనల్లో హిందీలోనే మాట్లాడటం, వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నప్పుడు అక్కడి భాషలో మాట్లాడటం ఇవన్నీ భారతీయ భాషల గౌరవాన్ని పెంచే దిశగా తీసుకున్న నిర్ణయాలే అని తెలిపారు. ఈ గౌరవాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మనమంతా మన మాతృభాషల్లో మాట్లాడటం, మన దేశ భాషలను గౌరవించుకోవడం చాలా అవసరమని అన్నారు.

## వారం - వర్జ్యం

12-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
విదియ రా.1.45
ఉత్తరాషాఢ ఉ.6.35
వర్జ్యం : ఉ.10.38-12.15
దు.తె.5.42-7.22
శుభసమయం:ఉ.5.20-6.00, సా.6.30-7.10
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగులు ప్రమోషన్లు పొందుతారు. కళారంగాలవారికి సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**వృషభం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలవారు విదేశీ పర్యటనలు పొందుతారు. సోదరుల నుండి శుభవార్తలు వింటారు.

**మిథునం:** కొత్తమిత్రులు పరిచయమై సాయం అందిస్తారు. ఆరోగ్యంపట్ల చాలా జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** బంధువుల నుండి ముఖ్య సమాచారం అందుతుంది. కాంట్రాక్టులు చివరిలో దక్కించుకొంటారు.

**సింహం:** ఇంటిలో కొంత సౌఖ్యం, సంతోషం కలుగుతాయి. శక్తి సామర్థ్యాలకు, ప్రతిభాపాటవాలకు తగిన గుర్తింపు పొందుతారు.

**కన్య :** ఆర్థికంగా చికాకులు ఎదుర్కొంటారు. ముఖ్యమైన పనులు శ్రమానంతరం పూర్తిచేస్తారు.

**తుల :** చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో పూర్తిచేస్తారు. రుణవత్తిడులు పెరిగి చికాకులుపెడతాయి.

**వృశ్చికం:**కుటుంబంలో ఏర్పడిన చిక్కులు తొలగిపోతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు:** ఆకస్మికంగా డబ్బు చేతి కందుతుంది. జీవితభాగస్వామి సలహాతో గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**మకరం:** ఓర్పు, పట్టుదలతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించు కోగలరు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కుంభం:** ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఉద్యోగా లలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**మీనం :** అరుదైన ఆహ్వానాలు అందుతాయి. జీవిత భాగస్వామ్య నుండి ఆస్తి లాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జగన్ విధ్వంస యాగం కొనసాగిస్తున్నారు

## ఆరోగ్య మంత్రి సత్యకుమార్




**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వికాసం కోసం సిఎం చంద్రబాబు ప్రగతి యజ్ఞం చేస్తుంటే.. జగన్ విధ్వంస యాగాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో విమర్శించారు. పరామర్శల పేరుతో జగన్ విధ్ వ్వంస రాజకీయాలకు తెర తీస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన వాహనాల కింద సొంత పార్టీ కార్యకర్తలు పడి మరణించిన మనస్తత్వం జగన్‌దన్నారు. మామిడిని ట్రాక్టర్లుతో తొక్కించడమేమిటన్నారు. ఆయన వైఖరితో ప్రజలకు మరింత దూరమవుతున్నారన్నారు.ఏడాది కూటమి పాలనలో సాధించిన విజయాలను తట్టుకునే స్థితిలో జగన్ లేడన్నారు.రాష్ట్రాన్ని జగన్ ఆర్థికంగా నష్ట పరిస్థితే, సీఎం చంద్రబాబు వ్యవస్థను గాడిలో పెట్టారన్నారు.కూటమి ప్రభుత్వ పాలనతో పెట్టుబడులకు దేశంలో అత్యంత అనువైన నాలుగు రాష్ట్రాల్లో ఏపీ ఒకటని ప్రఖ్యాత ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. జగన్ దుశ్చర్యలకు ప్రజలు గట్టి గుణపాఠమే చెబుతారన్నారు.11 సీట్లుకు పరిమితమైన ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో పులివెందులతో సహా ఎక్కడా గెలిచే అవకాశాలు లేవన్నారు.

# చట్టాల సరళీకరణ ద్వారా సులభతర వాణిజ్యం

## - డి రెగ్యులేషన్, కంప్లయెన్స్ రిడక్షన్ అంశాలపై కీలక సమావేశం

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** జూలై:వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన చట్టాల సరళీకరణలో భాగంగా సులభతర వాణిజ్యం కింద డి రెగ్యులేషన్. కంప్లయెన్స్ రిడక్షన్ అంశాలపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి(కోఆర్డినేషన్)కేబినెట్ సెక్రటేరియట్, టాస్కుఫోర్సు కమిటీ సభ్యులు మనోజ్ గోవిల్,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ల నేతృత్వంలో శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కేంద్ర కార్యదర్శి మనోజ్ గోవిల్ మాట్లాడుతూ దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డీ రెగ్యులేషన్, కంప్లయెన్స్ రిడక్షన్ కు అనుగుణంగా చట్టాల్లో మార్పులు చేయడం ముందుందని పేర్కొన్నారు. కాలాను గుణంగా వచ్చే మార్పులకు అనువుగా సులభతర వాణిజ్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా పాత చట్టాల్లో మార్పులు చేర్పులు,సరళీకరణ చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన రీతిలో ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు.దానిలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం డీ రెగ్యులేషన్ మరియు కంప్లయెన్స్ రిడక్షన్ పై కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక టాస్కుఫోర్సు ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వివిధ చట్టాల అమలును మరింత సులభతరం చేయడం ద్వారా ప్రజలకు వాణిజ్య వేత్తలకు ఉపయోగపడే విధంగా కృషి చేయడం జరుగుతుందని కేంద్ర కార్యదర్శి మనోజ్ గోవిల్ పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం నేషనల్ బిల్డింగ్‌కోడ్‌ను అమలులోకి తెచ్చిందని దానిని రాష్ట్రాలు పూర్తి స్థాయిలో అనుసరించి వివిధ బహుళ అంతస్తుల భవనాల్లో అగ్నిప్రమాద సంబంధిత భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని మనోజ్ గోవిల్ సూచించారు. ఈసమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ




డిరెగ్యులేషన్, కంప్లయెన్స్ రిడక్షన్ అంశాలపై సమావేశంలో మనోజ్ గోవిల్, కె.విజయానంద్

వివిధ చట్టాల డీ రెగ్యులేషన్ మరియు కంప్లెయెన్స్ రిడక్షన్ కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వ జన్ విశ్వాస్ చట్టానికి అనుగుణంగా రాష్ట్ర స్థాయి చట్టాల్లో మార్పులు చేర్పులు చేపట్టి ఆయా చట్టాల సరళీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.ఇందుకు సంబంధించి ఇప్పటికే 76 చట్టాల్లో మార్పులు చేర్పులు చేసి సరళీకరణకు ప్రతిపాదించడం జరిగిందని వాటిలో ఎక్సైజ్ శాఖలో 18,భూగర్భ గనులు 19,కార్మిక ఫ్యాక్టరీస్ అండ్ బాయిలర్స్ శాఖలో 21,సహకార శాఖలో 4,ఇంధన శాఖలో 3 చట్టాలను ప్రతిపాదించినట్టు సిఎస్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు సాంకేతికతను మరింత చేరువ చేసి తద్వారా సకాలంలో మెరుగైన సేవలు అందించడంలో ముందుందని ముఖ్యంగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే 520 సేవలను అందుబాటు లోకి తేవడం జరిగిందని సిఎస్ విజయానంద్ తెలిపారు.

# జిఎస్టీ వసూళ్లలో ఎపి రోల్ మోడల్ గా ఉండాలి

## - డేటా అనలటిక్స్ ద్వారా పన్నుల విశ్లేషణ: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ వసూళ్లలో ఏపీ దేశానికి రోల్ మోడల్ గా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పన్ను ఎగవేతలు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన కేంద్ర రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. డేటా అనలటిక్స్ లాంటి సాంకేతికతను వినియోగించి ఎగవేతలను అడ్డుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమర్ధవంతమైన పన్ను వసూళ్ల ప్రక్రియ ద్వారా జాతీయ సంపదను పెంచాలని సీఎం సూచించారు. అది ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ఉపకరించాలని సీఎం అన్నారు. దీనికోసం జీఎస్టీ రియలైజేషన్ కోసం కేంద్ర రాష్ట్రాల అధికారుల మధ్య సమాచార సమన్వయం ఉండాలన్నారు. జీఎస్టీ వసూళ్లకు సంబంధించి పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేలా కార్యాచరణ ఉండాలని అన్నారు. వస్తున్న పన్ను వసూళ్ల సమాచారాన్ని డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించాలని ముఖ్యమంత్రి అన్నారు. ఎగవేతలను గుర్తించేందుకు విద్యుత్ వినియోగం లాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఏపీలో ఎలాంటి పన్ను ఎగవేతలకు అవకాశం లేకుండా చూడాలని జీఎస్టీ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రతీ వ్యవస్థా సమర్ధవంతంగా పని చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, పెట్టుబడులను ఆకర్షించటంలో ఏపీ దేశంలో 4 స్థానంలో ఉందని... అన్ని రంగాల్లోనూ ఏపీ బెస్ట్ గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్ ను అభివృద్ధి చేసినందు వల్లే తెలంగాణా రాష్ట్రానికి 75 శాతం మేర ఆదాయాన్ని తెచ్చిపెడుతోందని ఏపీలోని విశాఖ, విజయవాడ, తిరుపతి లాంటి నగరాలు కూడా అదే స్థాయికి చేరుస్తామని అన్నారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో ఎక్కడా పొరపాటు జరక్కుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల సమాచారాన్ని ఒకచోటకు చేర్చి డేటా లేక్ ను రూపొందిస్తుందని ఈ సమాచారాన్ని కేంద్ర జీఎస్టీ అధికారులకూ అందుబాటులోకి తెస్తామన్నారు.

## రాష్ట్రంలో 211 మంది బాల కార్మికులకు విముక్తి

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1 నుంచి 30 వరకు నిర్వహించిన తనిఖీల్లో 211 మంది బాల కార్మికులకు పని నుంచి విముక్తి కల్పించినట్లు కార్మికశాఖ ఒక ప్రకటనతో తెలిపింది. వీరిలో 14 ఏళ్ళ లోపు వారు 21 మంది ఉన్నారని పేర్కొంది. సంబంధిత యజమానులపై కనీస వేతనాల చట్టం కింద 147 కేసులు నమోదు చేశామని, కనీస వేతనాల చట్టం అథారిటీ కోర్టు ద్వారా ఆయా బాల కార్మికులకు రూ.1,98,148 ఇప్పించామని తెలిపింది. నిబంధనలు ఉల్లంఘించి పిల్లలను యజమానులు పనిలో పెట్టుకుంటే ఆరు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష,రూ.20 వేల నుండి రూ.50 వేల వరకు కోర్టులు జరిమానా విధిస్తాయని తెలిపింది.

# తిరుమల సమాచారం

## స్వచ్ఛంద వ్యవస్థలో సంస్కరణలు

### - శ్రీవారి సేవగ్రూప్ పర్యవేక్షకులకు ఐఐఎంతో శిక్షణ

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వస్తున్న అశేషసంఖ్య భక్తులకు ఇతోధిక సేవలందించడంలో కీలకపాత్ర వహిస్తున్న శ్రీవారిసేవకుల స్వచ్ఛంద వ్యవస్థలో సంస్కరణలపై టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.



ఇందులో భాగంగా త్వరలో ప్రారంభించనున్న ప్రొఫెషనల్ శ్రీవారి సేవ, ఎన్ఆర్ఐ సేవ, గ్రూప్ పర్యవేక్షకుల సేవల కార్యాచరణ పురోగతి గురించి శుక్రవారం సాయంత్రం ఇఒ ,అదనపు ఇఒ ఇతర అధికారులతో కలసి సమీక్షించారు. ఐఐఎం అహమ్మదాబాద్ బృందంచే పర్యవేక్షకులకు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని ఇఒ ఈ సందర్భంగా సంబంధిత ఐటి జిఎం శేషారెడ్డి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవికి సూచనలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు., ఈ సందర్భంగా ఐటి విభాగం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పర్యవేక్షకుల కోసం రూపొందించిన అప్లికేషన్‌ను చూపించారు. ప్రొఫెషనల్స్ సేవలను త్వరితగతిన ప్రారంభించాలని, ఎన్ఆర్ఐ సేవలను విస్తరించేందుకు ఏపిఎన్ఆర్‌టి సంస్థతో సంప్రదింపులు చేయాలని ఇఒ తెలిపారు. ఈ సమావేశంలో అశ్వనీ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమకుమారి, పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న భక్తుల రద్దీ - వెంకన్న దర్శనానికి 24గంటలు

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం.. వరుసగా రెండవ శనివారం, ఆదివారంతో రెండుమూడురోజులు సెలవులు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. లక్ష మందికిపైగా తిరుమలలో భక్తులు ఉండ టంతో శుక్రవారం ఉదయానికి వైకుంఠమ్ 1,2క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి వెలుపల



క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి.ఉదయానికి స్వామివారి సర్వదర్శనానికి 20గంటలు సమయం పడుతుండగా సాయంత్రానికి ఈ రద్దీ విపరీతంగా పెరిగింది. సాధారణ సర్వదర్శనానికి 24గంటలు సమయం కేటాయిస్తున్నారు. 300 రూపాయలు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సిఫార్సుల ద్వారా ఎస్ఇడి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఎనిమిదిగంటల పైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు.టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు 10-12గంటలు నిరీక్షణ తప్పడంలేదు. శుక్రవారం సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. వెలుపల క్యూలైన్లలో, ఆలయంలోపల కంపార్టుమెంట్లలో శ్రీవారిసేవకులు భక్తులకు నిరంతరాయంగా పాలు,టీ, అన్నప్రసాదాలు,తాగునీరు పంపిణీ చేస్తున్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునిక భద్రత

### - తిరుమలలో భద్రతపై టిటిడి ఇఒ సమీక్ష

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తుల భద్రతతోబాటు శ్రీవారి ఆలయ రక్షణకు సంబంధించి పూర్తిస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, ఎల్‌అండ్‌టి ప్రతినిధుల నిపుణుల బృందం, ఐటి జిఎం శేషారెడ్డి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, విఎస్ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, సదాలక్ష్మిలతో కలసి సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భద్రతా ప్రణాళికలపై ఎల్‌అండ్‌టి సంస్థతో ఆయన సాంకేతిక పరిజ్ఞానం,

భద్రత వ్యవస్థను ఆధునీకరించడంపై సమాలోచనలు చేశారు. అత్యాధునిక సాంకేతిక స్కానర్లు, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటిగ్రేటెడ్ సర్వైలెన్స్ సిస్టం, కామన్‌అలారం మేనేజ్‌మెంట్ విధానం,కమాండ్ కంట్రోల్ వ్యవస్థ వంటి అంశాలను ఇఒకు వివరించారు.

# అన్యమత ఉద్యోగులపై వీడని మౌనం..

## - ఎఇఒ సస్పెన్షన్‌తోనూ స్పందించని టిటిడి!

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూయేతర ఉద్యోగులను గుర్తించిన అధికారులు వారిని ఇతర శాఖలకు బదిలీ చేయడంగానీ స్వచ్ఛంద పదవీవిరమణ చేయించడంలో మౌనమెందుకనే ప్రశ్నలు టిటిడి ఉద్యోగవర్గాల్లో వ్యక్తమవు తున్నాయి. మొన్నటికిమొన్న టిటిడి మార్కెటింగ్ విభాగంలో యాత్రికులు సమర్పించే కొన్ని వస్తువులు వేలంవేసే విభాగంలో ఒక అసిస్టెంట్ కార్యనిర్వహణ అధికారి(ఎఇఒ )రాజశేఖరబాబు అన్యమత ఆచారాలను పాటిస్తున్నారని,ప్రతి ఆదివారం చర్చికి వెళ్ళి ప్రార్థనలు చేస్తున్నారనే ఆధారాలతో అందిన ఫిర్యాదుతో టిటిడి అధికారులు ఆయనపై తక్షణం సస్పెన్షన్ వేటువేశారు. ఇదే ధోరణిని మిగిలిన వారిపై ఎందుకు తీసుకోలేక పోతున్నారనే విమర్శలు ఇప్పుడు టిటిడిలో బలంగా వినిపిస్తున్నాయి. రెండురోజుల క్రిందట టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి కూడా ఆలయం ముందు అన్యమత ఉద్యోగులు వారికివారే స్వచ్ఛందంగా తప్పుకోవాలని,లేకుంటే బయటకు పంపడం జరుగుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా శుక్రవారం ఉదయం కేంద్రసహాయమంత్రి బండిసంజయ్ తిరుమలలో శ్రీవారి దర్శనానంతరం అన్యమత ఉద్యోగులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. టిటిడిలో వెయ్యిమందికిపైగా అన్యమతస్థులు పనిచేస్తున్నారని, దేవుని పేరుతో జీతం తీసుకుంటూ అన్యమత ఉద్యోగులు హిందూ సనాతన ధర్మంపై విశ్వాసం లేదని ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. టిటిడి పాలకమండలి, అధి కారులు ఇప్పటికైనా మేల్కొని హిందూయేతర ఉద్యోగులను అందరినీ తొలగించాలని అల్టిమేటమ్ ఇచ్చారు. టిటిడిలో అన్యమతస్థులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకో వాలన్నారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సేవలో నిజమైన భక్తి,విశ్వాసాలు నిబద్ధతతో పనిచేసే వారికి అవకాశం కల్పించాలని కీలక సూచనలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదేగాక మూడునాలుగునెలల ముందే టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో అన్య మతస్థ ఉద్యోగులపై చర్యలు తీసుకుం టామని ,అన్యమత ఉద్యోగులను సాగనంపుతామని ప్రకటించారు. ఇప్పటికీ అలాంటి చర్యలేవీ తీసుకోకపోవడం దేనికి నిదర్శనమని టిటిడి ఉద్యోగవర్గాలు మండిపడుతున్నాయి.టిటిడిలో వేలాదిరూపాయలు దేవుని సొమ్మును జీతం తీసుకుంటూ అన్యమత ఆచారాలను పాటిం చడం, ఏకంగా ఆ దేవుని ప్రార్థనలు చేయడం ఎంతవరకు మంచిదనేది దుమారం రేపుతోంది. టిటిడిలో ప్రస్తుతం 6,700మంది వరకు శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వారేగాక ఇంకా సొసైటీల క్రింద, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో 12వేలమంది వరకు పనిచేస్తున్నా కొందరు అన్య మతాన్ని ఆచరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరీ శాశ్వత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో మార్పు వస్తుందనేది ఉద్యోగులు చెబుతున్నారు. -300మంది హిందూ ధార్మికసంస్థ టిటిడిలో 300మంది వరకు అన్యమత ఉద్యోగులు ఉన్నారనే విషయాన్ని ఈ ఏడాది జనవరిలోనే టిటిడి పాలకమండలి ,అధికారులు వెల్లడించారు. వారిలో వివిధ హోదాల్లో అధికారులుగా చలామణి అవుతూ టిటిడి జీతం తీసుకుంటూ అన్యమతాన్ని బలంగా ఆచరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న 22మందిని తొలి విడతలో గుర్తించారు. వీరిలో 18మందిని ఆలయ వ్యవహారాలకు ,కార్యకలాపాలకు దూరంగా ఉంచి ఇతర విభాగాలకు బదిలీ చేసిన విషయం విదితమే.

# హిందూమతంపై భక్తి, చిత్తశుద్ధి ఉన్న వారికే ఉద్యోగాలు కల్పించాలి

## - తిరుమలలో కేంద్రమంత్రి బండి సంజయ్

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ సనాతన ధర్మంపై విశ్వాసం లేని, అన్యమత ఉద్యోగులను తక్షణం తొలగించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టిటిడి పాలకమండలి వెంటనే వారందరినీ బయటకు సాగనంపాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఉద్యోగిని తొలగించడంపై స్పందించిన ఆయన



ఒకరిని తొలగిస్తే సరిపోదని, అన్యమత ఉద్యోగంలందరినీ గుర్తించి వెంటనే తొలగించాలని టిటిడికి అల్టిమేటం ఇచ్చారు. టిటిడిలో ఉన్న అన్యమతస్థులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.శ్రీవారి సేవలో నిజమైన భక్తి,నిబద్ధతతో పనిచేసే వారికి అవకాశం కల్పించాలని సూచించారు. అన్ని మతాల వారిని ఆదరించడానికి టిటిడి సత్రం కాదని కేంద్రమంత్రి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టిటిడి ఏ ఒక్కరి ఆస్తి కాదని,హిందువులు అందరిదీ అని అన్నారు. సనాతన ధర్మంకోసం అందరూ ఐక్యంగా ఉండాలని ఆయన సూచించారు. తెలుగురాష్ట్రాల్లో ధూపదీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలతోబాటు పురాతన ఆలయాలను టిటిడి అభివృద్ధిచేయాలని ఆయన కోరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లెందు రామాలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, వేములవాడ ఆలయాల అభివృద్ధికి టిటిడి సహకారం అందించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి హోదాలో పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఉదయం ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. పుట్టినరోజున శ్రీవారి దర్శనంతో మనసు సంతోషం వ్యక్తం చేశారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కేంద్రమంత్రి వెంట టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, డిప్యూటీ ఇఒ భాస్కర్ ఉన్నారు.

# వైద్య విద్యార్థినులపై లైంగిక వేధింపులు - ముఖ్యమంత్రి తీవ్ర అసహనం

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** కాకినాడ జీజీహెచ్ లో వైద్య విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు.ఈ ఘటనపై అధికారులను నివేదిక కోరారు. సీఎంకు వైద్యఆరోగ్య శాఖ అధికారులు నివేదిక అందించారు. అనంతరం నిందితులపై కఠిన చర్యలకు సీఎం ఆదేశించారు. మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో ల్యాబ్ అటెండెంట్ గా పనిచేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి అనే ఉద్యోగిపై ఈనెల 9వ తేదీ విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. తీసుకున్న అధికారులు దీనిపై అదే రోజు కమిటీని నియమించి విచారణ చేపట్టారు. గురువారం రాత్రి వరకు విద్యార్థినులతో మాట్లాడి విచారణ కమిటీ నివేదిక సిద్ధం చేసింది. కాకినాడ జీజీహెచ్ లో వైద్య విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురిని అధికారులు సస్పెండ్ చేశారు. ల్యాబ్ అటెండెంట్ కళ్యాన్ చక్రవర్తితో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు జిమ్మి రాజు, గోపాల కృష్ణ, ప్రసాద్ లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నలుగురిపై పోలీసు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. అనంతరం జిమ్మీ రాజు, గోపాలకృష్ణ, ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బయో కెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్ కల్యాణ్‌చక్రవర్తి పరారీలో ఉన్నారు. మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి కల్యాణ్‌చక్రవర్తి వెళ్లిపోయారు. కల్యాణ్‌చక్రవర్తి పెట్టుకున్న సెలవును సైతం హెచ్‌వోడీ రద్దు చేశారు. ఘటనపై నివేదిక, తీసుకున్న చర్యలను కాకినాడ జీజీహెచ్ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపారు.నేను ఇక్కడ విధుల్లో జూన్ 23న చేరాను. అప్పటి నుంచి ఈ విషయాలు నా దృష్టికి రాలేదు. జులై 8న కొంతమంది విద్యార్థులు నా వద్దకు వచ్చారు. వారిలో ఇద్దరు ముగ్గురు ల్యాబ్ అటెండెంట్ గా పనిచేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఏదైనా చెప్పాలంటే భుజాలపై చేతులు వేసి తట్టి చెప్తున్నారని తెలిపారు. తరువాత రోజు ఉదయం చక్రవర్తిని పిలిపించి హెచ్చరించాను. పద్ధతి మార్చుకోవాలని సూచించాను.

# రెవెన్యూ మాన్యువల్ సిద్ధం చేసిన ప్రభుత్వం

**విజయవాడ జులై 11 ప్రభాతవార్త ప్రతినిధి:** భూ చట్టాలు , పరిపాలన, ప్రభుత్వ ఆదేశాలపై పౌరులకు అవగాహన కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. బ్రిటిష్ హయాం నుంచి ఇటీవల వరకు ప్రభుత్వ పరంగా వెలువడిన ఆదేశాలతో మాన్యువల్‌ను 14 వాల్యూమ్స్‌ను రెవెన్యూ శాఖ తయారుచేసింది. 3706 పేజీలతో తయారైన ఈ పుస్తకాలను సీపీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో ఉంచబోతున్నారు. భూములకు సంబంధించి రాష్ట్రంలో 200 కు పైగా చట్టాలు ఉన్నాయి. వీటి గురించి రెవెన్యూ ఉద్యోగులకే పూర్తిస్థాయిలో అవగాహన లేదు. ఏ సమస్యకు ఏ చట్టం వర్తిస్తుందో అధికారుల్లో కొందరికీ తెలియదు. దీంతో క్షేత్రస్థాయిలో కొత్త సమస్యలు వస్తున్నాయి. కోర్టుల్లో జరిగే విచారణ సమయంలో ఈ వివరాలు అందుబాటులో లేక బాధితులతోపాటు అధకారులూ అవస్థలు పడుతున్నారు. ఇక సామాన్యుల పరిస్థితి మరీ దారుణం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు భూ చట్టాలు, ఉత్తర్వులు, నియామాలను 14 పుస్తకాల రూపంలో సీసీఎల్‌ఏ సిద్ధం చేసింది. భూ కేటాయింపులు పేదలకు ఎసైన్డ్, ఇంటిస్థలాల పంపిణీ రికార్డ్స్ ఆఫ్ రైట్స్, భూముల పరిరక్షణ , ఆక్రమణల నిరోధం, ఇనాం చుక్కల భూముల ,ఇతర వ్యవహారాల గురించి ఈ మాన్యువల్ సిద్ధమైంది. సీసీఎల్ అదనపు కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీ గత జనవరి నుంచి పనిచేయడం ఆరంభించింది. 200 కు పైగా చట్టాలు ఉన్నా 50 చట్టాల కార్యకలాపాలే తరచూ జరుగుతుంటాయి. ఇందుకు అనుగుణంగా వాటి వివరాలను సిద్ధం చేశారు. ఆంధ్రప్రదేశ్ డాటెడ్ ల్యాండ్స్ యాక్ట్ -2017 వచ్చినప్పటి నుంచి హైకోర్టు నుంచి వెలువడిన ఆదేశాల వరకు 53 పేజీల్లో వివరించారు. జిల్లాల విభజన ప్రారంభం నుంచి జులై 23,2024 వరకు వెలువడ్డ చట్టాలు , 84 జీఓలతో 346 పేజీల పుస్తకం తయారైంది. ప్రస్తుతం రెవెన్యూ మాన్యువల్ ఆంగ్లంలో తయారైంది. ఇందులో పౌరులకు నిత్యం అవసరమైన చట్టాలు, ఇతర సమాచారాన్ని తెలుగులోకి తీసుకురావాల్సి ఉంది. ప్రస్తుతం సిద్ధంచేసిన వాల్యూమ్స్‌లోని సమాచారాన్ని ఏఐ సాయంతో చాట్‌బాట్స్ ద్వారా వినే సౌకర్యాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. భూ పరిపాలనపై తరచూ వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నారు.

# కారాగారంలో మూడేళ్లుగా నిర్బంధం.. తప్పుపట్టిన హైకోర్టు

**విజయవాడ,జులై 11,ప్రభాతవార్త ప్రతినిధి:** తమ ఆదేశాల మేరకు నడుచుకోలేదనే కారణంతో ఓ వ్యక్తిని గుంటూరు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్ (డీసీడీఆర్‌సీ) జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపి...మూడేళ్ళుగా కారాగారంలో నిర్బంధించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఇలా చేయడం రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనంది. జైలు శిక్ష విధించే అధికారాన్ని డీసీడీఆర్‌సీ నిర్లక్ష్యంగా వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది.జ. 'పెనాల్టీ పిటీషన్ల' విచారణ సందర్భంగా తమ ముందు హాజరుకాలేదనే కారణంతో స్థిరాస్థి సంస్థ విజయసారథి హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (వీఎస్‌హెచ్‌పీఎల్) ఎండీ అల్లాభక్షును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారని,ఆయనను వెంటనే విడుదల చేయాలని గుంటూరు జిల్లా కారాగార సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన రావు,జస్టిస్ జె.సుమతితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది.గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంకాయలపాడులో వీఎస్‌హెచ్‌పీఎల్ ఎండీ అల్లాభక్షు పలువురితో ప్లాట్ల విక్రయానికి ఒప్పందం చేసుకున్నారు. వాటిని అప్పగించకపోవడంతో కొనుగోలు దారులు 2019లో గుంటూరు డీసీడీఆర్‌సీని ఆశ్రయించారు. కొనుగోలుదారులకు నాలుగు వారాల్లో 12% వడ్డీతో సొము ్మ చెల్లించాలని అల్లాబక్షును కమీషన్ ఆదేశించింది. ఆయన అలా చేయలేదని కొనుగోలుదారులు 2022లో పెనాల్టీ పిటీషన్లు దాఖలు చేశారు.

## ప్రజలంతా సంతోషంగా ఉండాలి : తెలంగాణ అధికారులు

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగురాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలని, తెలంగాణలో అన్ని అభివృద్ధి చెందాలని దేవదేవుడు శ్రీవారిని ప్రార్థించినట్లు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం తెలంగాణ ఐఎఎస్ అధికారి పంకజ్‌కుమార్, సంయుక్తకార్యదర్శి కె.శ్రీనివాస్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలోనికి చేరుకున్న వీరికి టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదాశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## పల్నాడు భక్తుడి బంగారు ఉంగరం అప్పగింత

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనానికి వచ్చిన పల్నాడుజిల్లా బొల్లాపల్లిమండలం వెల్లటూరుగ్రామం భక్తులు గదిలో వదలిపెట్టిన బంగారు ఉంగరాన్ని టిటిడి సిబ్బంది నిజాయితీతో గుర్తించి అప్పగించారు.పల్నాడుకు చెందిన బి.సుధాకర్ కుటుంబంతో తిరుమలకు వచ్చారు. వకుళమాత విశ్రాంతి గృహంలో నంబర్ 229 గదిని పొందారు. గురువారం సాయంత్రం దర్శనానికి వెళ్ళి వచ్చి గదిని ఖాళీచేసి భక్తులు హడావిడిగా బయటకు వచ్చేశారు.

Aditya Birla Housing Finance Ltd.
ADITYA BIRLA CAPITAL
HOME LOANS
Regd Office: Indian Rayon Compound, Veraval, Gujarat - 362 266 | (T) +91 22 6279 9505 | (Toll free) 1800 270 7000 | CIN: U65922GJ2009PLC083779 | homefinance.adityabirlacapital.com

**గమనిక**

నిర్వహణ సౌలభ్యం కోసం మరియు కస్టమర్‌లకు మెరుగైన అనుభవం కల్పించేందుకు **#46-17-12, 1వ అంతస్తు, కిలారి ఎన్‌క్లేవ్, దానవాయిపేట, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్-533103.** చిరునామాలో ఉన్న తన కార్యాలయాన్ని వేరొక ప్రాంతానికి తరలించాలని" ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నిర్ణయించిందని ఇందుమూలంగా తెలియజేయడమైనది. కొత్త చిరునామా ఎన్ఒ **నెంబర్ 75-8-9 ఎపిఎం టవర్స్, గాంధీపురం-2, రౌండ్ పార్క్ రాజమహేంద్రవరం దగ్గర, ఆంధ్రప్రదేశ్-533102కి అక్టోబరు 2025 నుంచి** బ్రాంచిని తరలించడం జరుగుతుంది.

*చట్టపరమైన నిబంధనల ప్రకారం మూడు నెలల నోటీసు వ్యవధి ఇచ్చిన తరువాత ఇప్పుడున్న బ్రాంచ్ పనిచేయడం ముగిసిపోతుంది.

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కొరకు
సంతకంచేసినవారు/-
స్థలం: రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్
అధీకృత సంతకందారు

వార్త

మన ప్రవర్తనలో ముందుగా మార్పువస్తే, సహజంగానే ప్రపంచంలోనూ మార్పు వస్తుంది.

-షేక్స్పియర్

# ఔచిత్య పరీక్ష!

బీహారు వంటి బీమారు రాష్ట్రాలకు సమయోచిత వాగ్దానాలు చేయాలంటే ఏలినవారికి ఎన్నికలప్పుడే దయ కలుగుతుందని కొన్ని కొన్ని సందర్భాలు ఎరుకపరుస్తున్నాయి. బీహారులో ఇరవై ఏళ్ల తర్వాత తాజాగా ఉన్నట్టుండి నవంబరు నెలలో అసెంబ్లీ ఎన్నికలు రానున్న తరుణంలో విస్తృత ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నారంటే ఎన్నో రాజకీయ పార్టీలు, ఎన్నో వర్గాలు సందేహం వ్యక్తం చేశాయి. అనుమానాలు కలుగుతున్నాయి. కాగా ఈ వ్యవహారం యధావిధిగా రాజకీయ పార్టీల వారు సుప్రీంకోర్టుకు తీసుకెళ్లగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి రాజ్యాంగ బద్ధ అధికారులున్నాయని తీర్పు చెప్పింది. కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవన్నీ రాజకీయ పక్షాల అభ్యంతరాల్లో ఉన్నవే. ఎక్కడ ఎలాంటి పేచీ వచ్చినాకానీ మూడో పక్షంగా న్యాయస్థానాలే న్యాయం చేస్తాయని నమ్మే దేశం మనది. రాజ్యాంగ అంశాల్లో మీమాంసలు కలిగినప్పుడు ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పులు, పరిష్కారాలే శిరోధార్యం. ప్రత్యేక సవరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టే విషయంలో ఎన్నికల సంఘం దోషమేమీలేదని, అందుకే ఈ అంశంపై నిలుపుదల ఉత్తర్వుల (స్టే)ఇవ్వలేమని తీర్మానించింది. మరికొన్ని కీలక సూచనలూ ఇచ్చింది. ఓటరును నిర్ధారించే పత్రాలు సమగ్రంగా లేవనీ, ఆధార, రేషన్, ఓటరు గుర్తింపు కార్డులను సైతం పరిశీలనలోకి తీసుకురావాలని సూచించింది. కాగా ఓటరు జాబితాల సమగ్ర సవరణ అధికారం ఎన్నికల సంఘానికి ఉన్నప్పటికీ అందుకోసం ఎంచుకున్న సమయం సరైనదికాదని, సరిగ్గా ఎన్నికల తరుణంలో ఈ ప్రక్రియ చేపట్టడం సమర్ధించలేమని జస్టిస్ సుధాంశుధూలియా, జస్టిస్ జోయ్ మాల్యాబాగ్చీ ధర్మాసనం అభిప్రాయపడింది. త్వరలో ఎన్నిలకు జరగనున్న తరుణంలో ఎన్నికల సంఘం 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' అని ప్రకటించగానే విపక్ష రాజకీయ పార్టీలన్నీ ఉలిక్కిపడ్డాయి. ఈ ప్రక్రియ ద్వారా దాదాపురెండు కోట్ల మందికిపైగా కీలక ప్రాంతాల్లో ఓటర్లను తొలగించేందుకేననే అపోహపడేందుకు ఆస్కారమిచ్చింది. ఆధార్ వంటి కార్డుల సంగతి పక్కనపెట్టి ఏవేవో 11 పత్రాలను పేర్కొని వాటి ద్వారా ఇంటెన్సివ్ జాబితాను తయారుచేయాలని చూడడంలో ఔచిత్యం లేదని భావించే పరిస్థితి తయారైంది. బీహారు ప్రజలంటేనే వలస జీవులు, పనిపాటలకు, శ్రమజీవనానికి, ఉపాధి కోసం దేశాంతరాలు విడిచి వెళ్లడం పరిపాటి. దేశం యావత్తు ఏ రాష్ట్రానికి వెళ్లినా, ప్రాంతానికి వెళ్లినా భవన నిర్మాణ రంగంలో బీహారు కార్మికులు కోకొల్లలుగా కనిపిస్తుంటారు. అలా వచ్చిపోయే వాళ్ల పేర్లు తొలగింపుతోపాటు కొత్తగా ఓటు హక్కు కలిగిన యువత పేర్లను చేర్చుకొని ఓటరు జాబితాలో కలుపుకోవచ్చని ఎన్నికల సంఘం నిర్దేశించింది. విదేశీ చట్ట విరుద్ధ వలసదారుల పేర్లను తొలగించడానికే ఈ 'ఇంటెన్సివ్' జాబితా సవరణ అవసరమైందని ఎన్నికల సంఘం పేర్కొనడాన్ని బట్టి రాజకీయ పక్షాల నుంచి అభ్యంతరం వెలువడింది. సమర్పించాల్సినపత్రాల జాబితా, సమయం తగినంత లేకపోవడంతో ఇ.సి ప్రతిపాదన ఆక్షేపణకు గురైంది. ఇదంతా ఓటర్లను తొలగించే ఎత్తుగడలాగే అనిపిస్తోంది. ఇదే మాట సర్వజనులదీ. ఎందుకంటే ఓటరు జాబితాలో చేర్చుకోసం సమర్పించాల్సిన పత్రాల్లో తల్లి, తండ్రి జనన తేదీలు, వారు పుట్టిన ప్రదేశాలు, అక్కడ నివాసం ఉన్నారన్న రుజువులు సమర్పించాలి. ఇలాంటి పత్రాల జారీ, సమర్పణ ఎంతో కష్టతరం. గతంలో బీహార్‌లో ఉండి వలసవెళ్లి ఉంటే అప్పట్లో బీహార్‌లోనే ఉన్నట్లు అదనపు ధృవీకరణ పత్రాలను సమర్పించాలని షరతు పెట్టింది. వలస కార్మికులకు ఇటువంటివి తీసుకురావడం జరిగే పనికాదు. ఏ రాష్ట్రంలోనూ ఇన్ని రకాల సంక్లిష్ట సమాచారాన్ని అడిగి ఉండరు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం కేవలం భారతీయుడై ఉంటే చాలు ఈ దేశంలో ఓటరుగా నమోదవుతారు. అంతెందుకు ఎవరి పుణ్యమోకానీ, వైఫల్యమోకానీ చాలా మంది ఓటర్లకు రెండు,మూడు పట్టణాల్లోనూ, రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లోనూ ఓటింగ్ హక్కు ఉన్నా అంశాలు మనకు తెలిసినవే. ఇన్ని అభ్యంతరాల మధ్య ఎన్నికలసంఘం తీసుకున్న యూటర్న్‌లను బట్టి ముందుగా సరైన యోచన చేయకుండా ప్రజలకు ఓటరు కార్డుల పేరిట వారి పౌరసత్వాన్ని అనుమానించే ప్రయత్నాలను ఆపేయాలని విపక్ష పార్టీలు సూచించాయి. ఇసి నిర్ణయం మంచిదే, కానీ సరైన తరుణం కాదు. సరైన ఆధారిత పత్రాల విషయమై రూపొందించిన జాబితా వివాదాస్పదమైందని సుప్రీంకోర్టు గమనించింది. ఎన్నికలకు ముందు ఇలాంటి సవరణల కార్యక్రమం దేనికని ధర్మాసనం ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించింది. పైగా పౌరసత్వాన్ని ధృవీకరించే అధికారం కేంద్ర హోమ్ శాకే తప్ప ఎన్నికల సంఘానికి లేదని జస్టిస్ సుధాంశుధూలియా తప్పుపట్టారు. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరిట ఒక వర్గానికి చెందిన ఓట్లను తొలగించేందుకే ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ఆరోపిస్తూనే మరికొన్ని అనుమానాలు వ్యక్తం చేశారు. బీహార్‌లో మాదిరిగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో కూడా ఇదేతంతు జరిగే అవకాశం లేకపోదని, ఇదంతా బిజెపి పన్నాగమేనంటూ ఆందోళన వెలిబుచ్చారు. కాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఎన్నికల కమిషన్ ఇకపై ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ప్రజాస్వామ్యానికి తలవంపులు తీసుకురాబోదని అనుకోవచ్చు.

పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి. అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు.



ఆస్కార్‌వైల్డ్

బంగారం నాణ్యత అగ్నిలో తెలుస్తుంది. మనిషి మంచితనం కష్టంలో తెలుస్తుంది.



జార్జి ఇలియట్

# రాజకీయ అవినీతే అసలు సమస్య!

*ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకొని కొన్ని ప్రాంతాల్లో వసూళ్లు చేసుకొంటుంటే మరికొన్ని చెక్‌పోస్టుల వద్ద దేవుని సన్నిధిలో 'హుండి' పెట్టినట్లు ఏకంగా ఒక బాక్సు పెట్టి అందులో లారీ డ్రైవర్లు నేరుగా డబ్బులు వేసే ఏర్పాట్లు చేసిన వైనం ఏసిబి దాడుల్లో బయట పడింది. ఈ అవినీతి బాగోతం కేవలం కింది స్థాయిలో ఉద్యోగుల పరిధిలో జరుగుతుంటే నమ్మశక్యం కాదు. ఆ ఒక్క శాఖే కాదు, రెవెన్యూ, ఎక్సైజ్, నీటిపారుదల తదితర శాఖల్లో అవినీతి తాండవిస్తున్నదనేది ఏసిబికి పట్టుబడుతున్న అధికారుల వద్ద దొరుకుతున్న వందల కోట్ల రూపాయలు చెప్పకనే చెబుతున్నాయి. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతిని అరికట్టకుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంతసులభం కాదు.*

దామెర్ల సాయిబాబ

ధర్మాధర్మాలు తెలియవని కాదు, మొదటిది ఒంటబట్టడం లేదు, రెండోది వదిలిపెట్టడం లేదు అన్నట్లుగా ఉంది అవినీతి విషయంలో కొందరు పెద్దలు వ్యవహరిస్తున్న తీరు. ఏ కోణంలో చూసినా అవినీతికి పాల్పడడం ధర్మంకాదని అందరికి తెలిసిందే. పైగా అది చట్టప్రకారం నేరం కూడా. కానీ దేశంలో అవినీతికి పాల్పడేవారి సంఖ్య కోట్లల్లో ఉన్నది. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నం జరుగుతున్నా ఏమాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా ఉన్నతస్థాయిలో జరుగుతున్న అవినీతికి అడ్డు లేకుండాపోతున్నది. ఆ స్థాయిలో అరికట్టేందుకు గతంలో కొన్ని ప్రయత్నాలు జరిగినా నిలువరించలేకపోతున్నారు. కిందిస్థాయిలో అవినీతిని అరికట్టేముందు ఉన్నతస్థాయిలో ముఖ్యంగా రాజకీయ అవినీతిని నియంత్రించే ప్రయత్నం చేస్తే బాగుంటుందనే అభిప్రాయంతో ఒక వ్యూహం ప్రకారం ఏకంగా లంచం ఇచ్చి ఒక మంత్రినే ఇంటికి పంపారు. అప్పట్లో అది రాజకీయంగా సంచలనం రేపింది. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడులు ఆలోచించడం లేదు. అందుకే ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు. ప్రాజెక్టుల నిర్మాణాలలో వేలాది కోట్లరూపాయలు పక్కదారిపడుతున్నాయి. ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు వచ్చినప్పుడు అంతకు ముందున్న ప్రభుత్వాల్లో కీలక బాధ్యతలు వహించినవారిపై విచారణలు చేయించడం సర్వసాధారమైపోయింది. వాటిల్లో కూడా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి తిరుగులేని రుజువులతో న్యాయస్థానాల ముందు దోషులుగా నిలబెట్ట లేకపోతున్నారు. నిరుపేదలకు ఇచ్చే ఇళ్ల కేటాయింపుల్లో కానీ, రేషన్ కార్డుల్లో కానీ, వృద్ధాప్యపింఛన్లు, సంక్షేమ కార్యక్రమాలు ఏమి తీసుకున్నా దేశవ్యాప్తంగా దళారులు ఈ అవినీతి అధికారులు చేయి కలిపి ప్రజాసొమ్మును ఎలా భోంచేస్తున్నారో తెలియని విషయాలు ఏమీ కాదు. ప్రాజెక్టుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, ఏకంగాపర్సెంటేజీలు నిర్ణయించి తీసుకుంటున్న విషయం బహిరంగ రహస్యమే. అవినీతిని అడ్డుకొని ప్రజాధనాన్ని కాపాడేందుకు ఏనాటి నుంచో ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రాల స్థాయిలో అవినీతి నిరోధక శాఖ, కేంద్ర స్థాయిలో సిబిఐతోపాటు ఈడి, నిఘా విభాగాలు మరెన్నో పనిచేస్తున్నాయి. ఎన్నో చట్టాలు చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తూనే ఉన్నారు. వేలాది మంది అధికారులను వల పన్ని పట్టుకున్నారు. మరెందరినో ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టినందుకు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైళ్లకు పంపారు, పంపుతున్నారు. ఎంత మందిపై చర్యలు తీసుకున్నా అవినీతిని నియంత్రించలేకపోతున్నారు. అధికారుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తైతే కీలక పదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు, ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరికొందరు రాజకీయ నాయకులు, దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్ని లక్షల కోట్లు భారత్ కోల్పోయిందో అంచనాలకే అందదు. అవినీతికి ఆరోప్రాణమైన కొందరు నేతలే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయటపడ్డాయి. పశ్చిమబెంగాల్ మాజీ మంత్రి ఒకరు ఉపాధ్యాయ నియామకాల కుంభకోణంలో కోట్లరూపాయలను దిగమింగి తన ఆప్తమిత్రురాలి ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా దాచి

## ఒక్క మాట

పెట్టిన వైనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రట్టు చేసింది. కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రే తన చావుకి కారణమని రాసి ఆ మధ్య ఒక యువ గుత్తెదారు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో తప్పని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సివచ్చింది. సబ్బుల తయారీకి అవసరమైన ముడి సరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికి లంచం ముట్టచెప్పాల్సిందేనని గుత్తేదారుకు ఆ ప్రాంత శాసనసభ్యుడు తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగా నలభై లక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఆ శాసనసభ్యుని ఇంట్లో జరిపిన సోదాల్లో ఎనిమిది కోట్ల రూపాయలకుపైగా అధికారులు పట్టుకున్నారు. అంతే కాదు సాక్షాత్తు ఒక హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్లకట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగం కల్పించిన రక్షణ వల్ల ఆయనపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడ నుండి వచ్చింది? ఎవరు, ఎందుకోసం ఇచ్చారు! తదితర ప్రశ్నలకు జవాబు దొరకదు. మొన్న ఒడిశాలో సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఒక ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంట్లో సోదాలు చేస్తే నలభై లక్షలకుపైగా నగదు అధికారులు కనుగొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎంతో మంది ఉన్నతాధికారులపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా అనుమతిలేక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషనర్ రాంచంద్రసమాల్ బయటపెట్టిన విషయాలు అద్దంపడుతున్నాయి. ఇవేకాదు కొందరు సీనియర్ రాజకీయ నాయకులు కూడా ఈ అవినీతిలో మునిగి తేలుతున్నారు. ఉన్నత స్థాయిలోజరుగుతున్న అవినీతిలో పట్టుబడుతున్నది ఒక శాతం కూడా ఉండకపోవచ్చు. హర్యానా ముఖ్యమంత్రి ఓంప్రకాశ్ చౌతాలా కాలంలో ఉపాధ్యాయులనియామకంలో మెరిట్ లిస్టును మార్చి నకిలీ పత్రాలను సృష్టించి వాటి స్థానంలో మూడువేల మందికిపైగా టీచర్లను నియమించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో న్యాయప్రక్రియకు దాదాపు పదమూడేళ్లకుపైగా సమయం పట్టింది. 2013 జనవరిలో న్యాయస్థానం చౌతాలకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అప్పటికి ఆయనకు 78యేళ్లు వచ్చాయి. జైలులో ఎనిమిదేళ్ల శిక్ష అనుభవించి 2021లో విడుదలయ్యారు. అలాగే తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పద్దెనిమిదేళ్ల విచారణ తర్వాత దిగువ న్యాయస్థానం నాలుగేళ్ల జైలుశిక్ష, భారీగా జరిమానా విధించింది. 2015లో కర్ణాటక హైకోర్టు జయలలితను నిర్దోషిగా విడుదల చేసింది. నిర్దోషిగా విడుదల కావడంపై సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టులో తీర్పు ఇవ్వడానికి ముందే జయలలిత మృతి చెందారు. దేశంలో తీవ్ర చర్చనీయాంశమైన దాణా కుంభకోణంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌పై 1996 నుంచి 2018 వరకు న్యాయస్థానాల్లో విచారణలు జరిగాయి. 2013లో ఐదేళ్ల శిక్షపడిన తొలి తీర్పు వచ్చే సమయానికి ఆయనకు 65యేళ్లు. ఆయన జైలులో గడిపింది మూడున్నరేళ్లే. అక్రమ మైనింగ్ ఒప్పందాలపై ఏళ్ల పాటు సాగిన విచారణలో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడకు 2017లో మూడేళ్ల జైలు శిక్షపడింది. శిక్షలు పడుతున్నది అతికొద్ది శాతమే. ముంబాయిలోని బార్‌లు, పబ్‌ల నుండి తనకు నెలకు వంద కోట్ల రూపాయలు వసూలు చేసి ఇవ్వాలని హోంమంత్రి ఒకరు అప్పట్లో పోలీసులకు లక్ష్యం నిర్దేశించారని ఆ నగర మాజీ పోలీసు కమిషనర్ పరమ్‌వీర్‌సింగ్ స్వయంగా వెల్లడించారు. ఇక మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని పట్టుకోవడం కష్టమైనా వాటిని వలపన్ని పట్టుకుంటున్నారు. కనుక బాహాటంగా నిర్లజ్జగా జరుగుతున్న అవినీతిని పసికట్టకపోవడమనే ప్రశ్న ఉదయించదు. గతవారంలో తెలంగాణ రాష్ట్రంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఏసిబి అధికారులు జరిపిన ఆకస్మిక దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకొని కొన్ని ప్రాంతాల్లో వసూళ్లు చేసుకొంటుంటే మరికొన్ని చెక్‌పోస్టుల వద్ద దేవుని సన్నిధిలో 'హుండి' పెట్టినట్లు ఏకంగా ఒక బాక్సు పెట్టి అందులో లారీ డ్రైవర్లు నేరుగా డబ్బులు వేసే ఏర్పాట్లు చేసిన వైనం ఏసిబి దాడుల్లో బయట పడింది. ఈ అవినీతి భాగోతం కేవలం కింది స్థాయిలో ఉద్యోగుల పరిధిలో జరుగుతుంటే నమ్మశక్యం కాదు. ఆ ఒక్క శాఖే కాదు, రెవెన్యూ, ఎక్సైజ్, నీటిపారుదల తదితర శాఖల్లో అవినీతి తాండవిస్తున్నదనేది ఏసిబికి పట్టుబడుతున్న అధికారుల వద్ద దొరుకుతున్న వందల కోట్ల రూపాయలు చెప్పకనే చెబుతున్నాయి. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతిని అరికట్టకుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంతసులభం కాదు. •

# నైపుణ్యాల మెరుగుదలకు విద్యే ప్రధానం


తరిగోపుల నారాయణస్వామి

విద్య మన సమాజ అభివృద్ధికి నాంది పలుకుతుంది. మన దేశ భవిష్యత్తు నిర్మాణానికి విద్యావ్యవస్థ కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యారంగంలో గత దశాబ్దంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఈ మార్పులు సమగ్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయా? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కొత్త విద్యావిధానం (2020) అమలు పరంపరలో రాష్ట్రం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నా, వాటి అమలులో స్పష్టత కొరవడినట్టు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆంగ్ల మాధ్యమ పాఠశాలల స్థాపన, పదవ తరగతి వరకూ ఆంగ్ల మాధ్యమం తప్పనిసరి చేయడం వంటి చర్యలు నగరాల్లో ఉపయుక్తంగా కనిపించినా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అవి విద్యా నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. విద్యార్థులపై డిజిటల్ ఆధారిత బోధన పెరుగుతోంది. కానీ ఇంకా చాలా మందికి ఇంటర్నెట్ సౌకర్యం, ట్యాబ్లెట్‌లు, స్మార్ట్‌ఫోన్లు లభించకపోవడం వల్ల నూతన విధానాలు పూర్తిగా ఫలప్రదంగా మారలేకపోతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో పురోగతి కనిపించినా, అధ్యాపకుల పోస్టుల భర్తీ విషయంలో మాత్రం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉన్నది. గ్రామీణ పాఠశాలల్లో బోధనా భాష, బోధనా నైపుణ్యాలు, పాఠశాలలో ఉపాధ్యాయుల లభ్యత వంటి అంశాలు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. ఒకవైపు విద్యా ప్రమాణాలు పెరిగినట్టుగా సూచనలు ఉన్నా, పరీక్షల ప్రాతిపదికన మాత్రమే విద్యను అంచనా వేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, అభినవ ఆలోచనలు, అభ్యాస నైపుణ్యాలు వెనుకబడుతున్నాయి. ఇటీవల ప్రారంభించిన మానవ వనరుల అభివృద్ధి స్కూళ్లు, నాడునేడు కార్యక్రమం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర వంటి పథకాలు వంటి చర్యలు విద్య రంగాన్ని పునర్నిర్మించడానికి వేసిన అడుగులు. అయినా, ఈ కార్యక్రమాల సమర్థవంతత ఉపాధ్యాయుల శిక్షణ, మానవ వనరుల అందుబాటుపై ఆధారపడి ఉంటుంది. విద్యార్థుల మధ్య పఠన ఆసక్తి తగ్గిపోవడం, పుస్తక రహిత విద్యావిధానం ఎక్కువగా విస్తరించడంవల్ల విద్యార్థుల నైపుణ్యం స్థిరంగా ఉండడం లేదు. ముఖ్యంగా గత కొద్ది సంవత్సరాలలో విద్యా ప్రైవేటీకరణ ఎక్కువవడంతో సామాన్య కుటుంబాలకు విద్య ఖర్చుగా మారింది. ఉన్నత విద్యా సంస్థలలో ఉపాధ్యాయుల రేషియో తగ్గిపోవడం, విజ్ఞాన కేంద్రాల కొరత, రిసెర్చ్ నిధుల లోపం వంటి అంశాలు కనిపిస్తున్నాయి. విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించే వోకేషనల్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్స్, స్టార్టప్ ప్రోత్సాహం వంటి అంశాలపై మరింత దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. పాఠశాల స్థాయిలో పరీక్షల అట్టహాసం, గ్రేడులపైనే ఆధారపడే తీరు, విద్యార్థులపై ఒత్తిడి పెంచుతోంది. మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టేవిధంగా సైకాలజికల్ కౌన్సిలింగ్, లైఫ్ స్కిల్స్ బోధనను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. మరోవైపు, విద్యారంగంలో సాంకేతికత వినియోగం, ఎడుటెక్ సంస్థలద్వారా విద్య అందుబాటులోకి రావడం, గణాంకాల ఆధారంగా విద్యా విధానాలను రూపకల్పన చేయడం వంటి నూతన ప్రయోగాలు సాధించాల్సిన ముందడుగులుగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు వేసినప్పటికీ వాటి అమలు స్థాయిలో నిర్లక్ష్యం, నాణ్యత కంటే ప్రదర్శనకే ప్రాముఖ్యత ఇవ్వడం వల్ల విద్యావ్యవస్థ ఆవశ్యకమైన మార్పులను పొందలేకపోతోంది. విద్యను కేవలం ఉత్తీర్ణత లక్ష్యంగా కాకుండా, జీవిత నైపుణ్యాల అభివృద్ధి సాధించేందుకు ఉపయోగించాలి. •

# పునరుత్పాదక ఇంధనంతోనే ఆర్థిక స్వావలంబన


డి జె మోహన రావు

పునరుత్పాదక ఇంధనం అంటే ప్రకృతిలో నిరంతరం లభించే, తరగని వనరులైన సూర్యరశ్మి, గాలి, నీరు, జీవపదార్థాల నుంచి ఉత్పత్తి అయ్యే శక్తి. బొగ్గు, పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాల మాదిరిగా కాకుండా, ఇవి వాతావరణంలోకి తక్కువ కాలుష్య వాయువులను విడుదల చేస్తాయి. సౌరశక్తి, పవనశక్తి, జల విద్యుత్, బయోఎనర్జీ ఇవన్నీ పునరుత్పాదక వనరులే. పర్యావరణానికి తక్కువ హాని కలిగించడమే కాకుండా, ఇవి సుస్థిరమైన శక్తి పరిష్కారాలను అందిస్తాయి. భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద విద్యుత్ వినియోగ దేశంగా ఉంది. మన ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతున్నందున, శక్తి అవసరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మనం ఎక్కువగా బొగ్గు, దిగుమతి చేసుకున్న ముడి చమురుపై ఆధారపడుతున్నాం. మన ముడి చమురులో దాదాపు 85శాతం విదేశాల నుంచే దిగుమతి అవుతుంది. ఇది మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం మోపడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్ ధరల హెచ్చుతగ్గులకు మనల్ని గురిచేస్తుంది. పునరుత్పాదక ఇంధనం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశానికి శక్తి స్వాతంత్ర్యాన్ని అందిస్తుంది. పర్యావరణ పరంగా, వాతావరణ మార్పుల వల్ల భారత్ తీవ్ర ప్రభావానికి గురవుతున్న దేశాల్లో ఒకటి. అకాల వర్షాలు, వరదలు, కరవులు, వేడిగాలులు మన వ్యవసాయం, నీటి వనరులు, ప్రజల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. నగరాల్లోని వాయు కాలుష్యం శ్వాసకోశ, గుండె జబ్బులకు కారణమవుతోంది. పునరుత్పాదక ఇంధనానికి మారడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా, ప్రజల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరచవచ్చు. ఆర్థికంగా, పునరుత్పాదక ఇంధన రంగం అపారమైన అవకాశాలను సృష్టిస్తోంది. ఈ రంగం 2028 నాటికి 70లక్షలు, 2047 నాటికి 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తుంది. ఇది దేశీయ ఉత్పత్తిని పెంచుతుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. భారత్‌ను గ్లోబల్ గ్రీన్ టెక్నాలజీ లీడర్‌గా మారుస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యాన్ని అందించడంలో కూడా సౌరశక్తి వంటివి ఎంతో ఉపయోగపడతాయి. 2025 మే నాటికి పెద్ద జల విద్యుత్ కేంద్రాలతో కలిపి మన దేశ మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 226.75 గిగావాట్లకు చేరుకుంది. ఇంటర్నేషనల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఏజెన్సీ నివేదికల ప్రకారం, మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో చైనా, అమెరికా, బ్రెజిల్ తర్వాత మనం ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉన్నాం. 2014-15లో కేవలం 81 గిగావాట్లు ఉన్న సామర్థ్యం ఇంతలా పెరగడం గమనించదగ్గ విషయం. సౌరశక్తి ఉత్పత్తిలో దేశం ప్రపంచంలోనే చైనా, అమెరికా తర్వాత మూడవ అతిపెద్ద దేశంగా అవతరించింది. 2025మే నాటికి మన మొత్తం సౌరశక్తి సామర్థ్యం 110 గిగావాట్లను దాటింది. పవనశక్తి (గాలి ద్వారావిద్యుత్)



సామర్థ్యంలోనూ భారతదేశం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా నిలిచింది. దీని సామర్థ్యం 2025 మే నాటికి 51 గిగావాట్లకు పైగా ఉంది. భారత్ 2030 నాటికి శిలాజ ఇంధనేతర వనరుల నుంచి 500 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని సాధిస్తామని, మొత్తం విద్యుత్ అవసరాల్లో 50 శాతం పునరుత్పాదక వనరుల నుంచే పొందుతామని ప్రకటించింది. 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాలను చేరుకోవాలనే సంకల్పం మన దీర్ఘకాలిక విజన్‌ను చూపుతుంది. దేశంలో పునరుత్పాదక ఇంధన విప్లవం రాష్ట్రాల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతోంది. సౌరశక్తి ఉత్పత్తిలో రాజస్థాన్ అగ్రస్థానంలో ఉంది. 2025 మే నాటికి దాని సామర్థ్యం 27.64 గిగావాట్లను దాటింది. భద్లా సోలార్ పార్కు వంటి ప్రపంచంలోనే అతిపెద్ద సౌర పార్కులు ఇక్కడే ఉన్నాయి. సౌర (18.13 గిగావాట్లకు పైగా) పవనశక్తి రెండింటిలోనూ గుజరాత్ అగ్రశ్రేణి రాష్ట్రాల్లో స్థిరంగా నిలుస్తోంది. పవనశక్తిలో తమిళనాడు మార్గదర్శిగా ఉంది. ప్రస్తుతం దాని సామర్థ్యం 10గిగావాట్లకు పైగా ఉంది. సౌరశక్తి సామర్థ్యం కూడా 9.77 గిగావాట్లకు పైగా పెరుగుతోంది. సౌరశక్తి (9.31 గిగావాట్లకు పైగా)పవనశక్తి రెండింటిలోనూ బలమైన స్థానంలో ఉంది. మహారాష్ట్ర ముఖ్యంగా సౌరశక్తిలో (9.88 గిగావాట్లకు పైగా) తన పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. చిన్న జల విద్యుత్ ప్రాజెక్టులు (5 గిగావాట్లకు పైగా), బయోమాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి (దాదాపు 10.74 గిగావాట్లు) కూడా దేశ శక్తి అవసరాలను తీర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ వంటి సరికొత్త సాంకేతికతలపై భారీ పెట్టుబడులు పెడుతున్నాం. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద 2030 నాటికి ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భారతదేశం పునరుత్పాదక ఇంధన రంగంలో సాధిస్తున్న ప్రగతి అద్భుతం. 2030 లక్ష్యాలు బలమైన విధానాలు, కొనసాగుతున్న ప్రాజెక్టుల (169 గిగావాట్లకు పైగా నిర్మాణంలో, 65 గిగావాట్ల ప్రాజెక్టులు టెండర్ దశలో) ద్వారా సాధ్యమయ్యేవే. దేశీయ తయారీని ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం (ముఖ్యంగా చైనా నుంచి మే 2025లో 74.8 సౌర మాడ్యూల్స్ దిగుమతయ్యాయి) మన దీర్ఘకాలిక ఆర్థిక, శక్తి భద్రతకు కీలకం. ఈ ప్రయాణంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. సౌర, పవనశక్తి వంటివి వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి వాటిని పెద్ద మొత్తంలో జాతీయ విద్యుత్ గ్రిడ్‌లోకి అనుసంధానించడం సవాలుతో కూడుకున్నది. దీనికి స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీలు, భారీ ఎత్తున శక్తినిల్వ చేసే వ్యవస్థలు (బ్యాటరీలు, పంప్డ్ హైడ్రో) అవసరం. పెద్ద ప్రాజెక్టులకు భూసేకరణ ఒక క్లిష్టమైన సమస్య. ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక నిధులు లభించడం, పెట్టుబడిదారులకు నష్టభయం తగ్గించడం కూడాముఖ్యమే. అంతేకాదుఈ అధునాతన వ్యవస్థలను నిర్మించడానికి, నిర్వహించడానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, భారతదేశ సంకల్పం, అపారమైన పునరుత్పాదక ఇంధన వనరులు మనకు భవిష్యత్తుపై నమ్మకాన్ని ఇస్తున్నాయి. ప్రపంచ స్థాయిలో మనం సాధిస్తున్న ప్రగతి, మన లక్ష్యాలు, సుస్థిర భవిష్యత్తుకోసం మన దేశం చూపుతున్న దార్శనికతను స్పష్టం చేస్తున్నాయి. పునరుత్పాదక ఇంధనానికి మారడం అనేది కేవలం శక్తి అవసరాలను తీర్చడమే కాదు. ఇది మరింత బలంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా పురోగమించే భారతదేశాన్ని నిర్మించడం. •

# ప్రజావాక్కు



### కల్తీ కల్లు మీద ఉక్కు పాదం మోపాలి

హైదరాబాద్‌లో కల్తీ కల్లుతాగి ఆరుగురు మృత్యువాత పడడం, అనేకమంది ఆసుపత్రుల పాలుకావడం బాధాకరం. తాటి చెట్లు లేకున్నా కొంత మంది కల్లు కాంపౌండ్ యజమానులు నీళ్లలో క్లోరల్ హైడ్రేడ్ డిజీ ఫామ్ అల్ప్రోజోలంకలిపి కల్తీకల్లు విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తి అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. చాలా మంది ఈ కల్లుతాగి ఊపిరి తిత్తులు, కిడ్నీ, గుండె నాడీ వ్యవస్థ దెబ్బతిని ప్రాణాలు కోల్పోవుతూ వున్నారు. హైదర్ నగర్, ఇందిరా నగర్, షంషీ గూడ కల్లు కాంపౌండ్ లలో కల్తీ కల్లు తాగి ఆరుగురు చనిపోవడం అందరినీ కలచి వేసింది. హైదరాబాద్ అన్ని జిల్లాల్లో కల్తీ కల్లు డిపోలను మూసివేయాలి. చనిపోయిన వారికిఎక్స్ షియాచెల్లించాలి. మృతుల కుటుంబాలని అన్ని విధాల ఆదుకోవాలి. కల్తీ కల్లు విక్రయదారుల మీద ఉక్కు పాదం మోపాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### రాజకీయ వైవిధ్యం

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనుకు కల పడింది ఎన్నికల లిస్ట్ సవరణ చేపట్టాలి అని. మరి ఈ కొత్త ఆలోచన భారత దేశపు వైవిధ్యాన్ని రాజకీయా వైవిధ్యాన్ని దెబ్బ కొట్టదుగా. ఒకవేళ ఈ నిర్ణయం అమలు అయితే భారత దేశంలో నష్టపోయేది దళితులు, ముస్లిం, ఆదివాసులనే పరిస్థితిఉన్నది అంతకంటే ముఖ్యంగా ప్రజలు ఈ దేశ పౌరులు అని నిరూపించుకోవాల్సిన దుస్థితిలోకి నెట్టబడుతారు. అదే ఇప్పటి విడ్డురం మరి. ముఖ్యంగా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టాల్సిన సందర్భం. ఇప్పుడు ఎందుకు వచ్చింది అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ నిర్ణయం వల్ల దేశ పౌరుల ఆయుధం అయిన ఓటును తొలగిస్తే దేశ ప్రజాస్వామిక దృక్పథాన్ని కాలరాసినట్టే.

-భారత అవినాష్, జనగామ

### బాధ్యతలు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ గురుకులలోని హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో ప్రతి విద్యాసంస్థలలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లకు వేరు వేరు చేసి నియామకాలు చేయాలి. ఈ విధానం వలన పని విభజన జరుగుతుంది. ఎప్పటి కప్పుడు పనులు పూర్తి అవుతాయి.

-రాపాక రవీందర్, జనగాం

### పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం

భారతదేశంలో మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరంగా పెరుగుతోంది. పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా డ్రగ్స్ సులభంగా లభించడం, యువత వాటి వలలో చిక్కుకోవడం గమనార్హం. కుటుంబవ్యవస్థల బలహీనత, మానసిక ఒత్తిడులు, మిత్రుల ప్రభావంవంటి కారణాలు యువతను మత్తు పదార్థాల వైపు నడిపిస్తున్నాయి. అలాగే, భారత్ రెండు ప్రధాన మత్తు పదార్థాల ఉత్పత్తి ప్రాంతాల మధ్య ఉండటం వల్ల అక్రమంగా డ్రగ్స్ ప్రవేశించే అవకాశాలు పెరిగాయి. మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యపరంగా తీవ్ర సమస్యలకు దారితీస్తోంది. హృదయ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కేన్సర్, మానసిక రుగ్మతలు, ఎయిడ్స్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి, యువత విద్యా ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కాలమే తీర్పు చెప్పాలి

తెలంగాణా రాష్ట్రానికి కొత్త అధ్యక్షునిగా ఎవరిని నియమించాలని అనేక తర్జన భర్జనలు చేసిన తదుపరి మాజీ ఎమ్.ఎల్.సి. ఎప్పటి నుండో రాష్ట్ర స్వయంసేవక్‌లో సేవలందించి, న్యాయవాది వృత్తి చేసిన అకుంఠిత దీక్షా దక్షతలు కలిగిన ఎన్. రాంచందర్ రావును ఏ పోటీ లేకుండా ఎన్నుకోవడం బిజెపి పార్టీ క్రమశిక్షణకు ప్రత్యక్ష నిదర్శనం. ఈయన బాధ్యతలు చేపట్టిన వెంటనే కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం పైనా బీఆర్ఎస్ పార్టీపైన ఆరోపణలు చేస్తూ విరుచుకుపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి అప్పుడే సమస్యలను ఎత్తి చూపుతూ ఒక బహిరంగ లేఖను రాయడం కూడా జరిగింది. రాబోయే 2029 ఎన్నికలలో తమ పార్టీకి వంద అసెంబ్లీ సీట్లు పదిహేను ఎమ్.పి. సీట్లు వస్తాయని చెప్పి వార్తల కెక్కారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పిల్లలపై డిజిటల్ దుష్ప్రభావం

ఇప్పటి డిజిటల్ యుగంలో మొబైల్స్, ట్యాబ్‌లు, టీవీలు వంటి గ్యాడ్జెట్ల వాడకం పిల్లల జీవితంలో భాగమైపోయింది. అయితే దీనివల్ల వారి ఆరోగ్యంపై, చదువుపై, ప్రవర్తనపై అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపడం ద్వారా కంటిచూపు సమస్యలు, శారీరక జడత్వం పెరుగుతోంది. ఆన్‌లైన్ గేమ్స్, యూట్యూబ్ వీడియోలు వంటి వినోదాల వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతోంది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రూ.40వేలకు పెరిగిన వీసా ఫీజులు

## ట్రంప్ 'బ్యూటిఫుల్ బిల్' భారతీయులకు పెంచిన భారం



**న్యూఢిల్లీ, జూలై 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అధికారంలోకి వచ్చాక అమలుకు తెచ్చిన వన్ బిగ్ బ్యూటిఫుల్‌బిల్ తో ఇపుడు వీసా సమీకృత ఫీజు 250 డాలర్లుగా ఖర్చవుతున్నది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా కేటగిరీలకు ఈ ఫీజులు వర్తిస్తాయి. భారత్ నుంచి ఎక్కువగా పర్యాటక వీసాలకే దరఖాస్తులు వస్తున్నాయి. టూరిస్టు, ఉన్నత విద్య, ఉద్యోగం వంటి వాటికి వచ్చే దరఖాస్తులకు 2026నుంచి మరింత భారం అవుతున్నాయి. 16వేల ఫీజు కట్టే వీసా ఇపుడు 40 వేల రూపాయలకు పెరిగింది. ప్రస్తుత వీసా ఫీజులకు అదనంగా 21,400 రీఫండ్‌కు వీలుకాని సర్‌ఛార్జిగా ఉంటుంది. ఇక ప్రతి వీసా జారీ సమయంలో ఈమొత్తం చెల్లించాల్సిందే. 2026నుంచి అమలులోకి వస్తుంది. ఈ ఫీజును ద్రవ్యోల్బణం ఆధారంగా నిర్ణయిస్తారు. వినియోగరంగ ధరలసూచీ ఆధారంగా ఈ ఫీజు నిర్ణయం అవుతుంది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలు అంటే బి-1/బి-2 అంటే టూరిస్టు, బిజినెస్ వీసాలు, ఎఫ్ అండ్‌ఎం స్టూటెంట్ వీసాలు, హెచ్1బి వర్క్ వీసాలు, జె అంటే ఎక్చేంజి విజిటర్ వీసాలకు ఈ మొత్తం అన్వయిస్తారు. కేవలం దౌత్యపరమైన వీసా హోల్డర్లు మాత్రమే అంటే కేటగిరి ఎ, కేటగిరి జిలకు మినహాయింపు ఉంది. టెక్ నిపుణులు, విద్యార్థులు, పర్యాటకులు, బిజినెస్ ట్రావెలర్లకు ఈ అదనపు మొత్తం విధిగా చెల్లించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ప్రస్తుతం యుఎస్ బి-1/బి వీసాకు 185 డాలర్లు అంటే 15,800 ఖర్చువుతోంది. వీసా ఇంటిగ్రిటీ ఫీజుకింద ఇతర మైనర్‌ఫీజులు అంటే -94 ఫీజు 24 డాలర్లు, ఇఎస్‌టిఎ ఫీజు 13 డాలర్లు మొత్తం వ్యయం 472 డాలర్లు అంటే భారత కరెన్సీలో 40,502 రూపాయలు చెల్లించుకోవాలి. ప్రస్తుత వీసా వ్యయంకంటే రెండున్నర రెట్లు ఎక్కువ భరించాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు వీఈసాలు ఎఫ్ లేదా హెచ్1బి వ్యయాలు కూడా భారీగాపెరుగుతున్నాయి. కొన్ని ప్రత్యేకపరిస్థితుల్లో మినహా ఈ ఫీజు రద్దుకాదు, తగ్గింపు ఉండదు. అన్ని వీసా నిబంధనలు భర్తీచేయాలి. వీసా గడువుకు ఐదురోజులుముందే అమెరికాను విడిచి వెళుతున్నట్లు ప్రకటించాలి. లేదా చట్టపరంగా వారి బసను పొడిగించుకున్నట్లు స్పష్టం చేయాలి. అప్పుడే రీఫండ్‌కు అర్హులవుతారు. యుఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ ఈ విధానాలను పర్యవేక్షిస్తుంది. అంతేకాకుండా ఈ కొత్తబిల్లులు విదేశీ జమలు అంటే అమెరికాలో ఉన్న విదేశీయులు వారి సొంతదేశాలకు పంపించే జమలపై ఒకటిశాతం సుంకం చెల్లించాలన్న నిబంధనను కూడా అమలుకు వచ్చింది.



# కొత్త పార్టీ పెట్టిన లాలూ పెద్దకుమారుడు తేజ్‌ప్రతాప్

**పాట్నా,జూలై 11:** బీహార్ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సొంత పార్టీ ఆర్జేడీ నుంచి బహిష్కరణకు గురైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తేజ్‌ప్రతాప్ యాదవ్ తండ్రి లాలు ప్రసాద్ యాదవ్‌కు షాకిచ్చారు. కొత్త పార్టీ బ్యానర్‌పై మహువాలో ర్యాలీ నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయబోతున్నట్టు సంకేతాలిచ్చారు. పార్టీతో విభేదాల అనంతరం తొలిసారి నిర్వహించిన ఈ ర్యాలీలో తేజ్ ప్రతాప్ మద్దతుదారులు ఆకుపచ్చ, తెలుపు రంగుల్లో ఉన్న జెండాను పట్టుకున్నారు. దానిపై 'టీమ్ తేజ్ ప్రతాప్' అని రాసి ఉంది. తన మాజీ నియోజకవర్గమైన మహువాలో రోడ్‌షోకు నాయకత్వం వహించిన తేజ్ ప్రతాప్ తన సిగ్నేచర్ గ్రీన్ క్యాప్ ధరించారు. అక్కడ మద్దతుదారుల నుంచి ఆయనకు హృదయపూర్వక స్వాగతం లభించింది. తాను ఒకరి నియంత్రణ కింద పనిచేయబోనని చెప్పిన తేజ్ ప్రతాప్ ప్రజల నిర్ణయానికి అనుగుణంగా తన తర్వాతి నిర్ణయం ఉంటుందని చెప్పారు. ప్రజలు ఏది కోరితే అదే చేస్తానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలని ప్రజలు కోరితే అక్కడి నుంచి పోటీ చేస్తానని వివరించారు. తేజ్ ప్రతాప్ 2015 అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తాజాగా ఆయనను ఆరేళ్లపాటు పార్టీనుంచి బహిష్కరిస్తూ ఆయన తండ్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. కాగా, అనుష్క యాదవ్ అనే మహిళతో ఉన్న ఫొటోలను షేర్ చేసిన తేజ్‌ప్రతాప్ ఆమెతో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు తెలిపారు. అయితే ఆ తర్వాత ఆ ఫొటోలను డిలీట్ చేశారు. తన ఫేస్‌బుక్ హ్యాక్ అయిందని పేర్కొన్నారు. అయితే, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీనిని తీవ్రంగా పరిగణించిన లాలుప్రసాద్ తన పెద్దకొడుకుతో ఉన్న అన్ని సంబంధాలను తెంచుకున్నట్టు ప్రకటించారు.



## 9 నెలలుగా ఇంట్లోనే శవంగా..

# నటి మృతి కేసులో సంచలనం!

**ఇస్లామాబాద్, జూలై 11:** దయనీయస్థితిలో శవమై కనిపించిన పాకిస్థాన్ నటి కేసులో కీలక విషయం వెల్లడైంది. ఆమె తొమ్మిది నెలల క్రితమే ఇంట్లో చనిపోయి ఉండొచ్చని తెలుస్తోంది. గుర్తుపట్టలేని విధంగా కుళ్లిపోయిన ఆమె మృతదేహాన్ని కరాచీలోని అపార్ట్‌మెంట్‌లో మంగళవారం పోలీసులు గుర్తించారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం పాక్‌కు చెందిన ఆ నటి పేరు హుమైరా అస్ఘర్ అలీ. లాహోర్‌కు చెందిన ఆమె ఏడేళ్ల క్రితం కరాచీకి వచ్చి, ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. చాలా అరుదుగా మాత్రమే ఆమె కుటుంబసభ్యుల వద్దకు వెళ్లేవారు. కొన్ని నెలలుగా ఆమె అద్దె కట్టడం లేదని ఆ ఇంటి యజమాని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా ఆమె మృతి చెందిన విషయం బయటపడింది. పూర్తిగా కుళ్లిపోయి, ఎముకలు బయటపడిన స్థితిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఆమె తొమ్మిది నెలల క్రితమే ప్రాణాలు కోల్పోయి ఉంటారని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. 'ఆమె గతేడాది అక్టోబరులో చివరి ఫోన్ కాల్ చేసింది. అద్దె ఇంటికి దగ్గర్లోని వారు ఆ సమయంలోనే ఆమెను చూశామని చెప్పారు' అని పోలీసు అధికారులు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో ఆమె ఫ్లాట్‌కు ఆ నెలలోనే ఎలక్ట్రిసిటీ నిలిపేసి ఉండొచ్చన్నారు. ఆ ఇంట్లో ఆహారమంతా పాడైపోయింది. కొన్ని వస్తువులు తుప్పుపట్టాయి. నటి ఉంటున్న అంతస్తులో ఉన్న మరో ఫ్లాట్ కూడా ఖాళీగా ఉండటంతో మృతదేహం నుంచి వచ్చిన దుర్వాసనను ఎవరూ గుర్తించలేకపోయారు. కొంతమంది ఫిబ్రవరిలో ఆ అంతస్తుకు వచ్చినా.. అప్పటికే కొన్ని నెలలు కావడంతో ఎవరికీ దుర్వాసన రాలేదు. మూడు రోజు క్రితం ఆమె మృతదేహాన్ని గుర్తిస్తే దానిని తీసుకెళ్లడానికి కుటుంబసభ్యులు నిరాకరించడం గమనార్హం. చివరకు ఆమె సోదరుడు అందుకు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. ఒక యేడాదిన్నరగా ఆమె తమ వద్దకు రాలేదని నటి సోదరుడు చెప్పారు. కాగా.. మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లాహోర్ చెందిన హుమైరా 2015లో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. పలు టెలివిజన్ షోల్లో కనిపించారు. జలేబి (2015), లవ్ వ్యాక్సిన్ (2021)చిత్రాలు చేశారు. 2022లో వచ్చిన తమాషా రియాల్టీ షోతో పాపులరయ్యారు.

# కుమార్తెపై దీపక్ ఎందుకు కాల్పులు జరిపినట్లు?

## టెన్నిస్ అకాడమీయే కాల్పులకు మూలకారణమా?

## నేరం అంగీకరించిన టెన్నిస్‌స్టార్ తండ్రి దీపక్‌యాదవ్



**గురుగ్రామ్, జూలై 12:** లగ్జరీ ఫామ్‌హౌస్, నెలకు 17లక్షలకుపైగా ఆదాయం ఉన్న వ్యక్తి తన కుమార్తెను తానే స్వయంగా ఎందుకు కాల్చి చంపారన్న వార్తలు ఇపుడు నగరంలో చక్కర్లు కొడుతున్నాయి. 25 ఏళ్ల టెన్నిస్‌ప్లేయర్ రాధికా యాదవ్‌ను కన్నతండ్రే కాల్చిచంపేసిన ఉదంతం అందరినీ కలవరపరిచింది. గురుగ్రామ్‌లోని సుశాంత్‌లోక్ ప్రాంతంలో అత్యంత లగ్జరీ ఇంటిలో రాధికా కుటుంబం నివసిస్తోంది. దీపక్ యాదవ్(49) తానే హత్యచేసినట్లు అంగీకరించాడు. ఐదు రౌండ్లు కాల్చాడు. కిందిఅంతస్తులో ఉన్న రాధిక మేనమామ వెంటనే పైకి చేరుకునే సరికి కిచెన్‌లో రక్తపుమడుగులో ఉన్న రాధికాను తన కారులో పక్కనే ఉన్న ఆసియా మారింగో ఆసుపత్రికి తరలించారు. కాని వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని ధృవీకరించడంతో వర్ధమాన టెన్నిస్ తార ఒకటి రాలిపోయి నట్లయింది. దీనికంతటికి సొంతవూరు వజీరా బాద్‌లో ఆయనకు లెక్కకుమించిన ఆస్తులున్నాయి. లగ్జరీ ఫామ్‌హౌస్‌కూడా ఉంది. నెలకు 18 లక్షల వరకూ ఆదాయం వస్తున్నా తాను కూతురు సంపాదనపైనే ఆధారపడి బతుకుతున్నట్లు చెడు ప్రచారం జరగడంతో భరించలేకపోయినట్లు పోలీసులకు తెలిపాడు. అయితే ఇది నిజం కాదని ఆయనకు అంతకుమించిన ఆస్తులే ఉన్నాయని గ్రామస్తులు చెపుతున్నారు. అలాగే తాను సొంతంగా ఉంచుకున్న తుపాకి సంపన్నులు మాత్రమే వినియోగించగలరని దాని లైసెన్స్ కూడా ఆషామాషీగా ఏమీ రాదని చెపుతున్నారు. రాధికా సెక్టార్ 57లో ఒక టెన్నిస్ అకడామీని కూడా నిర్వహిస్తోంది. ఈ అకాడమినీ, టెన్నిస్‌కు వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలని దీపక్ రాధికపై ఒత్తిడి తెచ్చినా పట్టించుకోలేదు. ఇదేక్రమంలో ఇద్దరిమధ్య జరిగిన వాగ్వాదంలో కోపం పట్టలేక కాల్పులు జరిపినట్లు ఒప్పుకున్నాడు. అయితే కూతురు అంటే అమితమైన ప్రేమ. రెండులక్షల విలువైన టెన్నిస్ రాకెట్లు కూడా కొనితెచ్చాడు. ఆమె కోసం ఏదైనా చేసేందుకు వెనుకాడని దీపక్ స్వయంగా ఈపనికి ఎలా పాల్పడ్డారన్నది అంతు బట్టకుండా ఉంది. ఈ పరిణామాల క్రమంలోనే దీపక్ కూతురిపై కాల్పులు జరిపినట్లు తేలింది. ప్రస్తుతం 14రోజుల జ్యుడిషియల్ కస్టడీలో కొనసాగుతున్నాడు.

# పాకిస్థాన్ దాడుల్లో భారత్‌కు ఎలాంటి నష్టం జరగలేదు

## అందుకు ఒక్క ఆధారమైనా చూపాలి

## విదేశీ మీడియాకు సవాల్ విసిరిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్



**న్యూఢిల్లీ, జులై 11:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాల్ విసిరారు. చెన్నైలోని ఓ కార్యక్రమానికి హాజరైన దోవల్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు. సోషల్ మీడియాలో విదేశీ వార్తా సంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను దోవల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది, ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అత్యంత ఖచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ భారత్‌కు నష్టం జరి గినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్న గీతకూడా పడనివ్వలేదని అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని దోవల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్ -30 ఎంకెఐ యుద్ధవిమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయన్నారు.

పాకిస్థాన్ సైన్యం ఢిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలి స్టిక్ క్షిపణులను భారత బలగాలు గగనతల రక్ష ణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థవం తంగా పేల్చివేశాయని తెలిపారు.


# కిట్టీపార్టీలతో కోట్లు కొల్లగొట్టిన మహిళ



**బెంగళూరు, జూలై 11:** బెంగళూరులో కిట్టీ పార్టీల పేరుతో ఓ మహిళ తన సోషల్ మీడియా స్నేహితులను రూ. 5 కోట్లు మోసం చేసింది. 49 ఏళ్ల సవిత అనే మహిళ బంగారు దిగుమతులు, అధిక రాబడి పెట్టుబడుల పేరుతో ఆకర్షణీయమైన వల విసిరి తన స్నేహితుల నుండి రూ. 5 కోట్లకు పైగా మోసం చేసిందని ఆరోపణలు రావడంతో ఆమెను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, నగరంలోని బసవేశ్వరనగర్ ప్రాంతంలోని కిర్లోస్కర్ కాలనీకి చెందిన సవిత అనే ఈ మహిళ తన స్నేహితురాళ్లతో తరచూ కిట్టీ పార్టీలు నిర్వహించేది. ఈ పార్టీలలో ఆమె తాను విదేశాల నుంచి తక్కువ ధరకు బంగారం దిగుమతి చేసుకుంటా నని చెప్పేది. అంతేకాకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే వారి డబ్బును రెట్టింపు చేస్తానని ఆకర్షణీయమైన పథకాలను వారికి వివరించేది. ఆమె మాటలను నమ్మిన చాలామంది మహిళలు పెద్ద మొత్తంలో డబ్బును సవితకు ఇచ్చారు. మొదట్లో కొందరికి కొద్ది మొత్తంలో లాభాలు కూడా చూపించడంతో ఆమె మాటలను అందరూ గుడ్డిగా నమ్మారు. అయితే, కొంతకాలం తర్వాత సవిత ఎవరికీ డబ్బు తిరిగి ఇవ్వకుండా దాటవేస్తూ వచ్చింది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల నుండి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో సవిత చాలా మందిని ఇదే తరహాలో మోసం చేసిందని తేలింది. ఆమె కేవలం కిట్టీ పార్టీలలో పాల్గొనే మహిళలనే కాకుండా, తన ఇతర స్నేహితులు మరియు బంధువులను కూడా నమ్మించి మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో, పోలీసులు సవితను మరియు ఈ మోసంలో ఆమెకు సహకరించిన మరొక వ్యక్తిని అరెస్టు చేశారు. వారిని స్థానిక కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. పోలీసులు ప్రస్తుతం వారి నుండి మరింత సమాచారం రాబట్టే ప్రయత్నంలో ఉన్నారు. మోసపోయిన వారి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## ప్రైవేట్‌రూమ్‌లో ఎమ్మెల్యే.. పక్కనే క్యాష్‌తో బ్యాగ్


# శివసేన వైరల్ చేసిన విడియో



**ముంబయి,జూలై 12:** మహారాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సత్ వివాదంలో చిక్కుకున్నారు. ఒక ప్రైవేటురూమ్‌లో ధూమపానంచేస్తూ హాఫ్ డ్రెస్‌లో ఉన్న ఆతడి విడియో బైటకివచ్చింది. అంతేకాకుండా అదే ప్రైవేటు రూమ్‌లో ఒక బ్యాగ్ నిండా క్యాష్ కూడా ఉందన్న ప్రచారం హోరెత్తింది. అంతకు ఒకరోజుముందే ఆయనకు ఆదాయపు పన్ను శాఖనోటీసులు జారీచేసారని చెప్పారు. తన ఆస్తులు ఒక్కసారిగా పెరగడంలో ఉన్న మూలాలు చెప్పాలని, 2019నుంచి 2024 అసెంబ్లీ ఎన్నికలనాటికి ఆస్తులు భారీగా కూడబెట్టారని రాబడులకు మూలం చెప్పాలని ఐటిశాఖ నోటీసులు పంపించింది. థాకరే శివసేన నేత సంజయ్‌రౌత్ ఈ విడియోను పోస్టు చేసారు. అసహాయతకు చిరునామా ఫడ్నవిస్ అని ఆపోస్టుకు ట్యాగ్‌లైన్‌జోడించారు. ఇంకెలా ఎంతమంది కూటమిలో ఉన్నారో పాపం ఫడ్నవిస్ అని సానుభూతిని ప్రకటించారు. సామాజిక న్యాయశాఖమంత్రి సంజయ్ శిర్సత్ తన బెడ్‌కు పక్కనే ఉన్న బ్యాగ్‌నిండా దస్తులే ఉన్నాయని, రౌత్ చెపుతున్నట్లు క్యాష్‌లేదని అన్నారు. ఔరంగాబాద్ వెస్ట్‌స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శిర్సత్ డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండే వర్గానికి ఎందినవారు. ఈ సోషల్‌మీడియా వైరల్‌కావడానికి ఒకరోజు ముందే ఆయనకు ఆదాయపుపన్నుశాఖ నోటీసులు జారీచేసిందని ఆయనే స్వయంగా ప్రకటించారు. తన వ్యక్తిగత ఆస్తులు గడచిన ఐదేళ్లలో ఒక్కసారిగా భారీ వృద్ధిని ఎలాసాధించాయో చెప్పాలంటే ఐటి నోటీసులు జారీ చేసారు. కొందరు వ్యక్తులు ఆదాయపు పన్ను శాఖకు తనపై ఫిర్యాదులు చేసారని అందువల్లనే తనకు నోటీసు వచ్చిందని ఆయన అన్నారు. తానేమీ భయపడనని నోటీసులకు స్పందిస్తానని, అయితే కొంత గడువు కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. తానేమీ తప్పులు చేయలేదని, సరైన స్పందనే ఇస్తానని శిర్సత్ చెప్పుకొచ్చారు.

# బీహార్ ఎన్నికలు హైజాక్‌కు బిజెపి కుట్ర

## ఒడిశాలో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి రాహుల్‌గాంధీ



**భువనేశ్వర్,జూలై 11:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పుల చెరిగారు. మహారాష్ట్రలో చేసినట్లుగానే త్వరలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేసేందుకు బిజెపి యత్నిస్తోందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు ఈ చర్యను అడ్డుకుంటాయని చెప్పారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎన్నికల సంఘం తమ విధులను నిర్వర్తించడం లేదని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పుల చెరిగారు. మహారాష్ట్రలో చేసినట్లుగానే త్వరలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేసేందుకు బిజెపి యత్నిస్తోందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు ఈ చర్యను అడ్డుకుంటాయని చెప్పారు. ఒడిశాలోని భువనేశ్వంలో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎన్నికల సంఘం తమ విధులను నిర్వర్తించడం లేదని, బిజెపికి ప్రయోజనాలు చేకూర్చేందుకు పని చేస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐదుగురు పెట్టుబడిదారుల కోసం పనిచేస్తుందేకానీ నిరుపేద ప్రజల కోసం పనిచేయట్లేదు. జల్, జమీన్, జంగల్ (నీరు, భూమి, అడవి) ఎప్పటికీ గిరిజనులకు సొంతం. అటవీ హక్కు పట్టాలను గిరిజనులకు ఒడిశా ప్రభుత్వం ఇవ్వడం లేదు. పెసా, ట్రైబల్ బిల్లులను గిరిజనుల కోసం కాంగ్రెస్ తీసుకువచ్చింది. వాటిని అమలు చేసి గిరిజనుల భూమి వారికే దక్కేలా చేస్తాం. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం, గత పాలకులైన బిజెడి వారిలాగే ఒడిశాను దోచుకుంటున్నదని రాహుల్ గాంధీ, ఆరోపించారు. మేం ప్రభుత్వ సంస్థల్ని స్థాపిస్తే బిజెపి ప్రైవేటు పరం చేస్తోందని ఏఐసిసి అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు.

## యువ ప్రేమజంటపై గ్రామస్తుల కర్కశం

# నాగలికట్టి కొడుతూ పొలం దున్నించిన వైనం



**రాయగడ,(ఒడిశా), జూలై 11:** ప్రేమ వివాహం చేసుకున్న ఒక యువ జంటపై ఆగ్రామ పెద్దలు అమానుషంగా ప్రవర్తించారు. నాగలికి ఎద్దుల్లాగా కట్టి కర్రలతో కొడుతూ వాళ్లతో పొలం దున్నిస్తూ వారిని చితక బాదారు. ఆపై పాప పరిహారం అంటూ గుడిలోను చిత్రహింసలకు గురిచేసారు. ఇందుకు సంబంధించిన విడియో వైరల్ కావడంతో పోలీసులు రంగప్రవేశం చేసారు. రాయగడజిల్లాలోని కంజమజ్జిరా గ్రామంలో జరిగిన ఈసంఘటనలో గ్రామానికి చెందిన యువకుడు యువతి చాలాకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలను ఒప్పించి ఇటీవలే వివాహం చేసుకున్నారు. అయితే ఈ వివాహానికి ఊరిపెద్దలు కొందరు అభ్యంతరం వ్యక్తం చేసారు. అయితే ఈ ఇద్దరూ వరుసకు బంధువులే అయినప్పటికీ గ్రామ ఆచారం ప్రకారం ఈ తరహా వివాహం అపచారమని చెపుతూ ఈ శిక్షను విధించారు. తొలుత వీళ్లతో పొలం దున్నడం పేరిట హింసించిన కొందరు ఆపై గుడికి తీసుకెళ్లి పాపపరిహారంపేరిట ప్రత్యేక పూజలు చేయించారు. ఈమొత్తం ఉదం తాన్ని గ్రామయువకులు విడియోతీసి సోషల్ మీడియాలో పోస్టుచేసారు. పోలీస్ సూపరిం టెండెంట్ ఎస్.స్వాతికుమార్ మాట్లాడుతూ శుక్రవారం ఒక బృందం గ్రామానికి వెళ్లిందని, కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## సంక్షిప్తంగా..

### వంతెన ప్రమాదంలో 20కి పెరిగిన మృతులు



**అహ్మదాబాద్, జూలై 11:** ఆనంద్‌జిల్లాలోని పద్రా తాలూకాలో మహిసాగర్‌నదిపై ఉన్న గంభీర వంతెన కూలిన సంఘటనలోమృతుల సంఖ్య 20కి పెరిగింది. ఈ ప్రమాదంలో ఐదునుంచి ఏడు వాహనాలు నదిలోకి పడిపోవడంతో నదిలో కొట్టుకునిపోయారు. ఇప్పటికీ ఇద్దరి ఆచూకీ తెలియడంలేదని సహాయక బృందాలు తెలిపాయి. ఇప్పటికే చనిపోయిన వారిగ్రామాల్లో విషాదఛాయలు కొనసాగుతున్నాయి. పార్టీల వారీగా ఈ సంఘటన రాజకీయ రంగుపులముకుంది. అయితే పురజనులు మాత్రం పార్టీల వైఖరిని తూర్పారబడుతున్నారు. ప్రజాపనుల శాఖకు చెందిననలుగురు ఇంజినీర్లను ప్రాథమిక నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసారు. ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్ స్వయంగా ప్రజాపనుల శాఖను నిర్వహిస్తున్నారు. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. 30రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీచేసారు.

### కోయంబత్తూరు పేలుళ్ల ఉగ్రవాది 27యేళ్ల తరువాత పట్టివేత




**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** తమిళనాడులోని కోయంబత్తూరులో 1998లో జరిగిన పేలుళ్ల ఘటనలో నిందితుడుగా వున్న ఐఎస్ఐ ఉగ్రవాది 27ఏళ్ల తరువాత పోలీసులకు చిక్కాడు. నాటి ఘటనలో 58 మంది మరణించగా 250 మందికి పైగా ప్రజలు గాయపడ్డారు. బిజెపి అగ్రనే తలు పాల్గొన్న ఈ సభను ఐఎస్ఐ ఉగ్రవాదులు టార్గెట్ చేయడంతో జరిగిన పేలుళ్ల దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ పేలుళ్ల కేసులో దాదాపు అందరు నిందితులు పట్టుబడగా సీరియల్ కిల్లర్‌గా పేరుగాంచిన సాదిక్ రాజా అలియాస్ టైలర్ రాజా (48)ను బెంగళూరులోని విజయపురలో తమిళనాడు ఉగ్రవాద వ్యతిరేక బృందం, కోయంబత్తూరు పోలీసులు, కర్ణాటక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి శుక్రవారం అరెస్టు చేశారు.

### హిందూస్థాన్ యూనిలీవర్‌కు తొలిసారి మహిళా సిఇఒగా ప్రియా నాయర్

**ముంబయి,జూలై 11:** హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్‌కు తొలిసారి మహిళ నాయకత్వం వహించబోతున్నారు. ప్రస్తుతం కంపెనీ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియా నాయర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి, మేనేజింగ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన విషయం తెలి సిందే. ఈ నియామకం ఆగస్టు 1 నుంచి అమ ల్లోకి రానున్నది. ప్రస్తుతం సీఈఓగా ఉన్న రోహిత్ జావా వ్యక్తిగత కారణాలరీత్యా జులై 31తో తనబాధ్యతల నుంచితప్పుకొంటున్నారు. ఆపై ప్రియా నాయర్ సంస్థను నడిపించనున్నారు. ఈ పదవిలో ఐదేళ్లపాటు కొనసాగుతారు. ఒక మహిళను ఎండీ, సీఈఓ పదవిలో నియమించడం హెచ్‌యూఎల్ చరిత్రలో ఇదే మొదటిసారి.

### హోటల్ సిబ్బందిని కొట్టిన ఎమ్మెల్యేపై కేసు నమోదు



**ముంబయి, జూలై 11:** మహారాష్ట్రలో శివసేన షిండేవర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై కేసు నమోదైంది. ఓ హోటల్ కార్మికుడిపై దాడి కేసులో ముంబై పోలీసులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ముంబై చర్చిగేట్‌లోని ఎమ్మెల్యేల క్యాంటీన్‌లో తనకు వడ్డించిన ఆహారం రుచిగా లేదని, కుళ్లిపోయిందని ఆరోపిస్తూ క్యాంటీన్ కార్మికుడు, మేనేజర్, ఇతర సిబ్బందిపై పిడిగుద్దులు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్ కాగా ఎమ్మెల్యే తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. మహారాష్ట్ర అసెంబ్లీ, విధాన సభలో ఈ అంశాన్నిప్రతిపక్షాలు, శివసేన (ఉద్ధవ్) వర్గం లేవనెత్తాయి. ఇక ఈ ఘటనపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ ఈ విషయంపై విచారణ జరిపి పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఎమ్మెల్యేపై పోలీసులు చర్యలు చేపట్టారు.

### పాక్‌లో పంజా విసిరిన బలోచ్ తిరుగుబాటుదారులు!

**ఇస్లామాబాద్, జూలై 11:** పాకిస్థాన్‌లో బలోచ్ రెబల్స్ చెలరేగిపోతున్నారు. తాజాగా దక్షిణ బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో పలు వాహనాలపై దాడి చేసి తొమ్మిదిమందిని కాల్చి చంపారు. ముందుగా గురువారం సాయంత్రం పలు బస్సులను ఆపి వీరిని కిడ్నాప్‌చేశారు. తర్వాత సమీపంలోని పర్వతాల్లోకి వారిని తీసుకెళ్లి హత్య చేసినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ వెల్లడించింది. అర్థరాత్రి వారి మృతదేహాలు బయటపడినట్లు గవర్నమెంట్ అధికారి ఒకరు తెలిపారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో 'తుడ' ప్రత్యేక కార్యాచరణ

- స్కూల్ఆఫ్ప్లానింగ్ ఆర్కిటెక్చర్ అధ్యాపకులతో ప్రణాళికలు



**తిరుపతి,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న ఐదేళ్ళలో స్మార్ట్‌సిటీ తిరుపతి నగర పరిధిని మరింత విస్తరింపజేయాలన్న లక్ష్యంతో జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలతో తుడ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతోందని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం అధ్యాపకులతో కలసి తుడ పరిధిలోని శెట్టిపల్లి భూములను పరిశీలించారు. తుడ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులను, అభివృద్ధి పనులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుసకున్నారు. తుడ అభివృద్ధిలో తాము భాగస్వామ్యమై, అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. తిరుపతి జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు ఉన్నందున నిత్యం లక్షలాదిమంది భక్తులు, పర్యాటకులు జిల్లాకు విచ్చే స్తున్నారన్నారు. వారికి అన్ని రకాల వసతులు కల్పించడానికి తుడ కృషి చేస్తుందన్నారు. టిటిడితో కలసి తుడ తిరుపతి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందని, అదే స్థాయిలో శ్రీకాళహస్తి దేవస్థానంతో కలసి శ్రీకాళహస్తి ప్రాంత సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అవసరమైన మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మిస్తున్నామని ఛైర్మన్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

## నేడు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహణ**

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 12 శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరంలో దాదాపు 8 వేల రూపాయల విలువైన... మెమోగ్రఫీ ,గర్భాశయా స్కానింగ్ ,పాప్స్ మియర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారు .వెంటనే రిపోర్టులు కూడా అందజేస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా వ్యవస్థాపకులు ఏపీయుడబ్ల్యుజె రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ పాల్గొంటారు ఎంతో ఉపయోగకరమైన ఈ శిబిరంలో విజయవాడ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పనచేసే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరుతున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు జయరాజు,దాసరి నాగరాజు,ఎపీడబ్ల్యుయుజె నగర అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసారు.

# ర్యాపిడో డ్రైవర్లుగా మహిళలు అండగా నిలిచిన మెప్మా

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** స్వయం ఉపాధి రంగంలో మహిళలు నిలదొక్కునేందుకు ఏపీ ప్రభుత్వ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుంటుంది.మోటారు వెహికిల్ రంగంలోను వారికి అండగా నిలుస్తోంది,మోటారు వాహనాలపై ప్రయాణికులను తీసుకుని వెళ్ళేందుకు వీలుగా వారికి రాయితీపై విద్యుత్తు బైక్‌లు,స్కూటీలుఅందిస్తోంది. ఆటో రిక్షాలను అందిస్తోంది. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు ఏర్పడినవే స్వయం సహాయక సంఘాలు వడ్డీ లేని రుణాలు ఇస్తూ స్వయం సమృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వాటిని మరింత బలోపేతం చేసి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సీఎం చంద్రబాబు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రధాన నగరాల్లో ఇప్పటికే మహిళలు ఈ ర్యాపిడో సేవల్లో ఉన్నారు. విజయవాడ, విశాఖలో 400 మంది చొప్పున లబ్ధిదారులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించి 4 వేల 800 మందిని ర్యాపిడో నెట్‌వర్క్‌లో చేర్చడమే లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. విజన్2047కు అనుగుణంగా మహిళలు అభ్యున్నతి సాధించేందుకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందంటున్నారు. మెప్మాతో ర్యాపిడోను అనుసంధానం చేసి మహిళలకు 12 వేల వరకు సబ్సిడీ కింద విద్యుత్ వాహనాలు అందిస్తూ ఉపాధికి బాటలు వేశారు.సాధారణంగా ర్యాపిడో అంటేనే పురుష డ్రైవర్లు కనిపిస్తారు. కానీ ఇక్కడ మహిళా ర్యాపిడో డ్రైవర్లను చూడొచ్చు. రు. మెప్మాలో ఉన్న మహిళలకు మరింత అండగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అతివలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చేందుకు సబ్సిడీ కింద విద్యుత్ వాహనాలు అందించింది. కొందరికి స్కూటీలు, మరికొందరికి ఆటోలు పంపిణీ చేసింది. అంతేకాకుండా మెప్మాతో ర్యాపిడోను అనుసంధానం చేసింది. ర్యాపిడో యాప్‌ను ఉపయోగించడంపైనా శిక్షణ ఇచ్చారు. ర్యాపిడో సర్వీసులను మహిళలు నిర్వహించే విధంగా ఏపీ ప్రభుత్వం మెప్మా ద్వారా సహకారం అందిస్తోంది. వారికి డ్వాక్రా గ్రూప్ ద్వారా వాహనాలు తీసుకుంటే ద్విచక్రవాహనానికి రూ.12 వేలు, ఆటో తీసుకుని ర్యాపిడోకి వాడుతుంటే రూ.30 వేల సబ్సిడీ పొందవచ్చు.

# అన్యాయంపై రోడ్డెక్కేవారంతా అసాంఘిక శక్తులేనా?

**- సిఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా జగన్ విమర్శలు**



**విజయవాడ, జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** అన్యాయంపై రోడ్డెక్కే వారంతా అసాంఘిక శక్తులేనా?అని వైకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి(జగన్) ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెండు నెలలుగా పంట కొనేవారు లేక రైతులు మామాడికాయలను ఎక్కడికక్కడ పారబోస్తున్నారు.వారంతా మీ కంటికి రౌడీలు,దొంగలు,అసాంఘిక శక్తుల్లా కనిపిస్తున్నారా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబును 'ఎక్స్' వేదికగా జగన్ ప్రశ్నించారు. 'మీ సిద్ధాంతం ప్రకారం చూస్తే ...రాష్ట్రంలో తమకు అన్యాయం జరిగిందని రోడ్డెక్కే ప్రతి రైతు,యువకుడు,నిరుద్యోగి,మహిళ ...వారికి అండగా నిలిచే వారంతా రౌడీలు తమకు అన్యాయం జరిగిందని రోడ్డెక్కే ప్రతి రైతు,యువకుడు, నిరుద్యోగి, మహిళ...వారికి అండగా నిలిచే వారంతా రౌడీలు,అసాంఘిక శక్తులేనా? మామిడి రైతులు కష్టాల్లో లేకపోతే...కిలోకి రూ.4 చొప్పున ప్రభుత్వం నుంచి ఇస్తామన్న ప్రకటన ఎందుకు చేశారు? బంగారుపాళ్యానికి నా పర్యటన ఖరారు కాగానే మీ వ్యవసాయ శాఖ మంత్రిని ఢిల్లీకి ఎందుకు పంపారు?ఏటా మే నెలలో పల్స్ ఫ్యాక్టరీలను తెరుస్తుండగా,ఈ సారి నెల ఆలస్యంగా...అందులోనూ కొన్నింటినే ఎందుకు తెరిచారు? సరుకంతా ఒకేసారి వచ్చేలా చేయడం దోపిడీకి ఆస్కారం కలిగించినట్లు కాదా? మీరు ఇస్తానన్న రూ.4 ఎంతమంది రైతులకిచ్చారు?ఎంతమందికి రూ.8 చొప్పున ఫ్యాక్టరీలు చెల్లించాయి' అని ప్రశ్నించారు.రాష్ట్రంలో ప్రభుత్వం అణచివేత వైఖరిని వదులుకోవాలన్నారు.

## కానిస్టేబుల్ రాత పరీక్షా ఫలితాలు విడుదల

**ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా**

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీసు కానిస్టేబుల్స్ నియామ కాల కోసం రాత పరీక్షలో 33,921 మంది ఎంపికైనట్లు పోలీసు రిక్రూ ట్మెంట్ బోర్డు రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. గత నెల 1వ తేదీన నిర్వ హించిన ఈ పరీక్షకు మొత్తం 37,600 మంది హాజరవగా, వీరిలో పురుషులు 32,364 మంది, మహిళలు 5,236 మంది ఉండగా, ఎంపికైన వారిలో పురుషులు 29,211 మంది, మహిళలు 4,710 మంది ఉన్నారని గురువారం విడు దల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగా విశాఖపట్నం కేంద్రంలో 10,354, కాకినాడ కేంద్రంలో 5,502, గుంటూరు కేంద్రంలో 7,323, కర్నూలు కేంద్రంలో 6,320, తిరుపతి కేంద్రంలో 4,417 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. అభ్యర్థులు వారి మార్కుల జాబితాల కోసం షషష.రఠ్రీజూత్తీ.ఛజూ.ఱ్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అభ్యర్థులు వారి ఒఎంఆర్ షీట్‌లను పరిశీలించు కునేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఒఎంఆర్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 12వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలని తెలిపారు. వెరిఫికేషన్‌లో మార్కులు పెరిగితే చెల్లించిన ఫీజును అభ్యర్థికి వెనక్కి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాల వివరాలను ఎస్ఎంఎస్, ఇమెయిల్ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు హెల్ప్ లైన్ 94414 50639 లేదా 91002 03323 నంబర్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల లోపు సంప్రదించవచ్చని సూచించారు.

# నర్సింగ్, బిఎస్సీ చదివిన ఎస్సీ యువతకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ

**మంత్రి డాక్టర్ డోలాబాల వీరాంజనేయస్వామి**

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** నర్సింగ్, బీఎస్సీ(ఎన్) చదివిన ఎస్సి నిరుద్యోగ యువతకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారంఆయన కార్యాలయం నుంచి ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎస్సి యువతకు ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది మంత్రి తెలిపారు.నర్సింగ్, బివిలీ చదివిన ఎస్సి యువతకు రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు.. మొదటి విడతలో 150 మందికి శిక్షణ ఇచ్చి అనంతరం వారికి జర్మనీలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఎస్సిల్లో చదువుకున్న ఏ ఒక్కరూ ఉద్యోగ,

ఉపాధి లేమితో ఉండకూడదన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం.ఎస్సిలను ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా మరింత బలోపేతం చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు పాటుపడుతు న్నారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ అవకాశాన్ని నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో పోలీసుల తనిఖీలు

**గంజాయి చాక్లెట్లు స్వాధీనం**

**విజయవాడ జులై 11 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రైల్వేస్టేషన్‌లో కోరమాండల్ రైలు లో శుక్రవారం రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గంజాయితో ప్యాక్ చేసిన చాక్లెట్లను తీసుకెళ్తుండగా యువకుడిని అదుపు లోకి తీసుకున్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నట్టు రైల్వే డీఎస్పీ రత్నరాజు తెలిపారు. గంజాయిని చాక్లెట్ ఉండలుగా మార్చి రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని రైల్వే డీఎస్పీ రత్నరాజు తెలిపారు.

# లోకాయుక్త జోక్యంతో లైబ్రరీ సెస్ వసూలు

**తూ.గో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ.366.88 లక్షల చెల్లింపు**

**కర్నూలు, జూలై 11, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల నుండి లైబ్రరీలకు రావలసిన సెస్ బకాయిలను లోకాయుక్త తీర్పు మేరకు చెల్లించారు. గత పది సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సెస్ మొత్తం చెల్లించకపోవడంతో గ్రంథాలయాల అభివృద్ధికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. కె.సాంబశివరావు దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ చేపట్టింది. అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ స్థానిక సంస్థల నుండి రూ.366.88 లక్షల లైబ్రరీ సెస్ బకాయిలను గ్రంథాలయ సంస్థ తిరిగి పొందడంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సంస్థ కీలక పాత్ర పోషించింది. 20072008 మరియు 2016 2017 మధ్య అనేక మున్సిపాలిటీలు, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం, కాకినాడ, పిఠాపురం, తుని మరియు అన్ని గ్రామ పంచాయితీలు సేకరించిన లైబ్రరీసెస్ ను జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించటంలో విఫలమయ్యాయని ఫిర్యాదిదారుడు ఫిర్యాదు చేయటం జరిగింది. లోకాయుక్త సంస్థ జారీ చేసిన ఆదేశాలకు ప్రతిస్పందిస్తూ, జిల్లా కలెక్టరు విచారణలు నిర్వహించి బకాయిలు ఉన్నమాట వాస్తవమని అంగీకరిస్తూ అనేక నివేదికలను సమర్పించారు. లోకాయుక్త నిరంతర జోక్యం మరియు పర్యవేక్షణ కారణంగా, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం, కాకినాడ, పిఠాపురం, తుని మున్సిపాలిటీలు మరియు పంచాయితీలతో సహా అన్ని స్థానిక సంస్థలు తన బకాయిల మొత్తం రూ.366.88 లక్షలు చెల్లించాయి. సంస్థగతంగా ఏర్పడిన అవకతవకలు నివారించడం, స్థానిక సంస్థల మధ్య జవాబుదారీతనాన్ని పెంపొందిచడంలో మరియు లైబ్రరీ సెస్ వంటి చట్టబద్ధమైన బాధ్యతలను నెరవేర్చటంలో లోకాయుక్త సంస్థ తన పాత్రను సమర్ధవంతగా సోషిస్తుంది. ప్రజాసేవలు అందించటంలో పారదర్శకత మరియు సమస్యలు పరిష్కరించడానికి ఈ సంస్థ తన నిబద్ధతను పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసింది.

# వేగంగా దుర్గమ్మ ఆలయ అభివృద్ధి పనులు

**- జగన్మాతకు భక్తుల జయనాదాలతో ఆషాఢం సారె**

**ఇంద్రకీలాద్రి, జూలై 11, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగిరం చేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులకు ఆదేశాలిచ్చారు. శుక్రవారం నాడు అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఆలయంలోని నూతన యాగశాల, పోటు పనుల అభివృద్ధిని తెలుసుకుని పనులు త్వరితంగా చేయాలన్నారు. సమీక్షకు ముందు ఇఓ క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సమీక్షలో యాగశాల డోనర్ సంగా నరశింహారావు, ఆలయ ఇఇ కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది, అన్ని వర్కుల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. వారికి శుక్రవారం భక్తబృందాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆషాడం సారెను సమరి ్పంచారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన 100బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు. ఆషాడం సారె సమ ర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు అన్న



మంత్రి కొల్లురవీంద్ర దంపతులకు వేదాశీర్వచనం అందిస్తున్న దృశ్యం



నిత్యాన్నపథకానికి దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ప్రసాదాలు అందించారు. దుర్గమ్మవారికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు చీర, సారె, వెండిపళ్ళెంను శుక్రవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదం, శేషవ స్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన ఆళ్ళ శివారెడ్డి దంపతులు శుక్రవారం రు.1లక్ష విరాళాన్ని అందించారు. దాతకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదం, శేషవ స్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## ఉదయగిరిలో యువకుడు దారుణ హత్య

**ఉదయగిరి (నెల్లూరు), జూలై 11, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఆల్మైర్ ఫంక్షన్ హాల్‌లో హామీద్ హత్య అతనిపై ఇద్దరు యువకులు ఇనపరాడులతో కత్తులతో దాడి చేయడంతో సంఘటన స్థలంలోనే హామీద్ అనే యువకుడు మృతి అనంతరం ఆల్మైర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహణ ఆర్థిక వ్యవహారంలో వివాదాలు. విచారిస్తున్న పోలీసులు.

# ప్రజల సమస్యలు తీర్చడానికే ఇంటింటి పర్యటన



గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

**ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**

**కళ్యాణదుర్గం, జూలై 11 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ప్రజలను నేరుగా కలుసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తెలిపారు. శుక్రవారం కళ్యాణదుర్గం రూరల్ మండలం ఎర్రంపల్లి, నారాయణపురం గ్రామంలో సుపరి పాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందిన తీరు, గ్రామంలో నెలకొన్న సమస్యలు అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజలు నేరుగా కలుసుకొని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మంగళ హారతులు ఇచ్చి గజమాలలతో సత్కరించి తెలుగుదేశం పార్టీ పాలనలో తాము ఎంతో సౌకర్యంగా ఉన్నామని ప్రజలు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు మంజూరు చేయిస్తామని, కాలనీలో సీసీ రోడ్లు లేని చోట త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైనేజిలు వేయించి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.. ఒక్కో ఇంట్లో నలుగురు, ఐదుగురు చదువుతున్న కుటుంబాలకు కూడా తల్లికి వందనం వంద శాతం వచ్చిందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వారి ఖాతాల్లోకి నగదు జమచేయడం జరుగుతుందన్నారు.. సుపరి పాలనలో తొలి అడుగులో భాగంగా సమస్యలు తెలుసుకునేందుకు ఇంటింటికి వెళుతుంటే ఎమ్మెల్యే, అధికారులతో కలసి తమ ఇంటి దగ్గరికే వచ్చి సమస్యలు తెలుసుకుంటుండడం చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.. ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున మండల కన్వీనర్ గోళ్ళ వెంకటేశులు ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తలారి రంగయ్య పై మండిపడిన ఎమ్మెల్యే : సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో గ్రామాల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య విమర్శలపై ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. తనపై గాని తన సంస్థపై ఎలాంటి ఆధారాలు లేకుండా విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- మంత్రి సత్య కుమార్ యాదవ్**



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్

**అనంతపురం, జూలై 11 ప్రభాతవార్త బ్యూరో** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గంలోని శివనగర్‌లో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, రోగులతో నేరుగా సంభాషించి, కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కేంద్ర పనితీరును పరిశీలించి, వారి సేవాపరమైన అంకితభావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపుదల అవసరమని పేర్కొన్నారు. యువతకు సరైన సమాచారం, ఆరోగ్య సంరక్షణ సదుపాయాల అందుబాటుతో వారి భవిష్యత్తు మెరుగవుతుందని నొక్కిచెప్పారు. జనాభా గణాంకాల కంటే మానవ అస్తిత్వం, శ్రేయస్సు ముఖ్యమన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 దిశగా మేము నడుస్తున్నామన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం ప్రజలకు సాధికారత కలిగించే వేదికగా మారాలని, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసి, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం సిబ్బంది అంతా నిబద్ధతతో పని చేయాలని పిలుపునిచ్చారు.

## డ్రాపవుట్ చిల్డన్స్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి**

**ఆత్మకూరు (నెల్లూరు), జూలై 11, ప్రభాతవార్త :** రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ మెంబర్ బత్తుల పద్మావతి ఆత్మకూరులోని ఎపిఆర్ఇఎస్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె ముందుగా విద్యార్థులతో ముఖా ముఖి సంభాషించారు. వారి నుండి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్స్, విద్యార్థుల అటెండెన్స్‌ను , ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రాపవుట్ చిల్డ్రన్స్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రత్యేక బాల బాలికలు తప్పనిసరిగా స్కూల్ జీవితాన్ని అనుభవించాలని దానికి సిబ్బంది చేయాలని ప్రిన్స్‌పాల్‌ను ఆదేశించారు. మెనూ రిజిస్టర్ ప్రనకారం ఆహారపదార్థాలను తనిఖీ చేశారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించినా, వారి హక్కులకు భంగం కలిగించినా ఉపేక్షించేది లేదన్నారు. పాఠశాల తరగతి గదులు , ప్రాంగణం అపరిశుభ్రంగా ఉందని పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కన్యాకుమారి ట్రైన్ లో విస్తృత తనిఖీలు

**రేణిగుంట జూలై 11 ప్రభాతవార్త** కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషకు చేరుకుంది. అకస్మాత్తుగా పెద్ద సంఖ్యలో పోలీసులు రైలు బోగీలోకి ప్రవేశించారు. ఏం జరుగుతుందో అర్థం కాక ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. ఎవరు భయపడాల్సిన అవసరం లేదని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి పర్యవేక్షణ నందు ఆర్పిఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో ఆర్పిఎఫ్, జి ఆర్ పి, లీగల్ టీం రైల్లో నిషేధిత వస్తువుల అక్రమ రవాణా పై తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో ప్రయాణికులు కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. రైలు అన్ని భోగిలను నిశితంగా పరిశీలించారు. రేణిగుంటలో ప్రారంభమైన తనిఖీలు పాకాల వరకు రైల్లోనే ప్రయాణిస్తూ చేశారు. ఒక్క బ్యాగును కూడా వదిలిపెట్టకుండా క్షుణ్ణంగా వెతికారు. అనుమానితులను ప్రశ్నించారు. అంతకుముందు రేణిగుంట రైల్వే స్టేషన్ ఉన్న ప్రయాణికుల బ్యాగులను చెక్ చేశారు. తనిఖీల్లో భాగంగా డాగ్ స్క్వాడ్ ను వినియోగించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ రైళ్లలో గంజాయి తదితర మత్తు పదార్థాలు, గ్యాస్ సిలిండర్లు, పేలుడు పదార్థాలు, పెట్రోలు, కిరోసిన్, డీజిల్ లాంటి మండే పదార్థాలు, రవాణా చేయకూడదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్ జి టి 4. కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు.

# ఎస్వీయూలో రూసా స్ట్రాటజిక్ సమీక్షా సమావేశం

**తిరుపతి విద్య, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ పథకం కింద జరుగుతున్న ప్రాజెక్టుల పురోగతిని అంచనా వేయడానికి ఒక వ్యూహాత్మక సమీక్షా సమావేశం శుక్రవారం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఛాంబర్‌లో జరిగింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్ ఆచార్య కె.రామ మోహనరావు ఈ సమావేశానికి హాజరై విశ్వవిద్యాలయ అధికారులతో మాట్లాడారు.రూసా పనుల అమలును వేగవంతం చేయాలని విశ్వవిద్యాలయాన్ని కోరుతూ,రూసాను సంస్థ ప్రయోజనం కోసం పూర్తిగా ఉపయోగించాల్సిన అవసరాన్ని చెబుతూ ఆయన అనేక విలువైన సూచనలు మరియు అంతర్దృష్టులను అందించారు.యస్వీయూ దాని మౌలిక సదుపాయాలు,

విద్యా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇది ఒక గొప్ప అవకాశం అని ఆయన పేర్కొన్నారు.ఉపకులపతి ఆచార్య అప్పారావు ప్రస్తుత రూసా సంబంధిత కార్యకలాపాలు,క్యాంపస్‌లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సమావేశానికి వివరించారు.

# సెప్టెంబర్‌లో తిరుపతిలో క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో

**- బ్రోచర్లను ఆవిష్కరించిన తుడ ఛైర్మన్, క్రెడాయి కార్యవర్గం**

**తిరుపతి,జూలై 11ప్రభాతవార్త:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌ఫో 2025 సెప్టెంబర్ 5,6,7తేదీల్లో జరగనుంది. ఈ ఎక్స్‌ఫోకు సంబంధించి కార్యక్రమాల ప్రాధాన్యత బ్రోచర్లు తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, క్రెడాయ్ కార్యవర్గం ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను క్రెడాయ్‌లో ఒక సభ్యుడని,

నేడు తుడ ఛైర్మన్ హోదాలో ఈ కార్యక్రమంలో పాల్గోనడం ఆనందంగా ఉందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో స్థిరపడాలని, స్థిరనివాసం ఏర్పరచుకోవాలని ఇతర ప్రాంతాల వాసులు అధికంగా సుముఖత చూపుతుంటా రన్నారు. ముఖ్యంగా విల్లాస్, డూప్లెక్స్‌హౌస్, అపార్టుఎమంట్లు అధికమవుతున్న సందర్భంలో క్రెడాయి లాంటి నమ్మకమైన సంస్థ ప్రజల అవసరాలను గుర్తించి,నిర్మాణాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

## బిసి హక్కుల సాధనకు జూలై 20న ఛలోఢిల్లీ

**విజయవాడ, జూలై 11, ప్రభాతవార్త :** దేశంలో 50శాతం పైగా వున్న బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించి బిసి ల హక్కుల సాధనకు జూలై 20న ఛలో ఢిల్లీ కి తరలిరావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డా లగుడు గోవిందరావు పిలుపునిచ్చారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జూలై 21న జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బిసిల జనగణన, కులగణన కూడా చేపట్టాలనిన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

శనివారం 12 - జూలై - 2025




# ఒడలరేవులో కేంద్రీయ విద్యాలయల నిర్మాణ కోసం భూసేకరణకు 3.30 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

**విద్య శాఖ మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు : ఎంపీ హరీష్ బాలయోగి**

**కోనసీమ బ్యూరో, జులై 11 , ( ప్రభాతవార్త ) :**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,అల్లవరం మండలం,ఒడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణం కోసం 7.50 ఎకరాల భూసేకరణకు 3.30 కోట్లు రూపాయలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి తెలిపారు.ఎన్నో ఏళ్లుగా కోనసీమ వాసులు ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయ కల సాకారం చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు హరీష్ ధన్యవాదాలు తెలియజేశారు.ఇది కొంతకాలంగా కోనసీమ ప్రజలు ఎదురుచూస్తున్న ఆశయానికి దారిచూపుతుంది. మన ప్రాంతంలోని మత్స్యకార కుటుంబాలు, వ్యవసాయ కార్మికులు, ఓ ఎన్ జి సి తదితర రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు స్థానికంగా ఉన్నతమైన సిబిఎస్సి విద్యను అందించే అవకాశం కల్పిస్తుందని హరీష్ అన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పిల్లల భవిష్యత్తు కోసం ఒడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయాన్ని త్వరితగతిన ప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

# తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం

**- 45 రోజుల్లో ఎకరాకు 150 కిలోల తేనె ఉత్పత్తి**



**అంబాజీపేట , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

తేనెటీగల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని, కొబ్బరి,అరటి తోటల్లో తేనెటీగల పెంపకం రైతులకు చక్కటి అవకాశమని కృషీవల కోకోనట్ ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీర రాఘవులు, సంకల్ప సేవా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రత్న కిషోర్ లు అన్నారు. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో తేనెటీగల పెంపకంపై రైతులకు రెండు రోజులపాటు నిర్వహించే అవగాహన సదస్సును శుక్రవారం ప్రారంభించారు. కృషీవల కంపెనీ సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ అధ్యక్షతన అవగాహన సదస్సులో వీరరాఘవులుతో పాటు రత్నకిషోర్ మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ తేనెటీగల పెంపకం ఉపయోగపడుతుందన్నారు. కొబ్బరి,అరటి తోటల్లో వీటి పెంపకాన్ని చేపట్టవచ్చన్నారు. తేనెను ఉత్పత్తి చేసి వ్యాపారం చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా స్థిరపడవచ్చని సూచించారు. ఎకరా కొబ్బరి తోటలో రైతులు 10 పెట్టెల్లో తేనెటీగల పెంపకాన్ని చేపట్టడం ద్వారా 45 రోజులకు 120 నుంచి 150 కిలోల తేనె ఉత్పత్తి చేయవచ్చన్నారు. ప్రస్తుత మార్కెట్లో స్వచ్ఛమైన తేనెకు డిమాండ్ ఉన్న దృష్ట్యా కిలో రూ. 600 నుంచి రూ. 650 వరకు ధర పలుకుతుందని రత్న కిషోర్ వివరించారు. ప్రకృతి పరంగా ఉత్పత్తి చేయడం ద్వారా ఆరోగ్యానికి మంచిదన్నారు.

ఎకరానికి 10 పెట్టెలలో తేనెటీగలను పెంచడం ద్వారా రూ.40 వేలు ఖర్చు అవుతుందన్నారు. పెట్టుబడి పోను రాబడి మూడు నెలలలో నెలకు రూ.15 వేలు చొప్పున రైతులు లాభాన్ని ఆర్జించవచ్చని తెలిపారు. అనంతరం సంకల్ప సేవ ఫౌండేషన్ డైరెక్టర్లు సునీల్ శశాంక, గుబ్బల విక్రమ్ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. తేనెటీగల పెంపకంనకు ఉత్సాహంగా ముందుకు వచ్చే రైతులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు పొందే విధి విధానా లను సేవ ఫౌండేషన్ వివరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు ముత్యాల జమ్మిలు, ఉప్పుగంటి భాస్కరరావు, దంగేటి గిరిధర్, నిట్టాల విజయ సాయి, ముత్యాల సత్తిబాబు, శివరామకృష్ణ రాజు, పిల్లా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్ లో ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం : ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

నియోజకవర్గంలోని ప్రజల ప్రతి సమస్య పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలువురు హాజరై వినతి పత్రాలను ఎమ్మెల్యేకు సమర్పించారు. తమ సమస్యల పరిష్కరించమని కోరారు. ఎమ్మెల్యే తక్షణమే సంబంధిత అధికారులకు సమస్య తెలిపి సత్వరమే సక్రమ పరిష్కారం ఇవ్వాలని ఆదేశించారు.పలువురు మహిళలు తమ సమస్యలపై ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేయగా ఆ సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పలు సమస్యలను



అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గ్రామాల్లో మౌలిక వసతుల అవసరాలపై ప్రజలు ప్రజా దర్బార్లో తెలియచేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా వంటి ప్రజా అవసరాలపై ప్రజా దర్బార్లో తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, బిజెపి ఇన్చార్జి దాట్ల కృష్ణ వర్మ, రేఖ బుల్లి రాజు, మండపాక అప్పన్న దొర, బద్ది సురేష్ యల్లపు దొరబాబు, బత్తుల వెంకన్న, షేక్ వల్లి, తదితరులు పాల్గొన్నారు.

# వలసపాకల సాయిబాబా సన్నిధిలో గురు పౌర్ణమి వేడుకలు..సినీ నటుడు సుమన్ సందడి



**కాకినాడ రూరల్ , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

కాకినాడ రూరల్ మండలం వలసపాకలలోని సద్గురు శ్రీ సాయిబాబా ఆలయంలో పెంకే వీరబాబు ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి సినీ నటుడు హీరో సుమన్ విచ్చేసి, భక్తులను ఉత్సాహపరిచారు. ఆయన రాకతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు, స్థానిక ఎమ్మెల్యే నానాజీ తనయుడు పంతం సందీప్, టిడిపి జిల్లా కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా ముఖ్య అతిథులుగా పాల్గొని, సాయిబాబా ఆశీస్సులు పొందారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, సాయిబాబా దర్శనం చేసుకున్నారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే సాయిబాబా నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. భక్తులు భజనలు, కీర్తనలు ఆలపిస్తూ, సాయిబాబా పట్ల తమ భక్తిని చాటుకున్నారు. ప్రత్యేక పూజలు, హారతులు, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సినీ నటుడు సుమన్‌ను చూసేందుకు, ఆయనతో మాట్లాడేందుకు భక్తులు ఆసక్తి చూపారు. సుమన్ కూడా భక్తులకు అభివాదం చేస్తూ, వారితో కలిసి గురు పౌర్ణమి వేడుకలలో పాల్గొన్నారు. ఈ వేడుకలు వలసపాకలలో ఆధ్యాత్మిక శోభను మరింత ద్విగుణీకృతం చేశాయి.

# విద్యుత్ షాక్ తో యువకుడు మృతి..ఎమ్మెల్యే మద్దిపాటి పరామర్శ

**గోపాలపురం , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

గోపాలపురం మండలంలోని వేళ్ళ చింతలగూడెం గ్రామంలో శుక్రవారంవిద్యుత్ షాక్ తో మందపాటి రాజేష్(25) మృతి చెందారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వేళ్ళ చింతలగూడెం గ్రామం వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలవేసి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు . మందపాటి రాజేష్ గోపాలపురం కేబుల్ నెట్వర్క్ నందు పనిచేస్తున్నాడువిధి నిర్వహణలో భాగంగా గొల్లగూడెం సమీపంలోహై వోల్టేజ్ విద్యుత్ స్తంభానికి కేబుల్ వైర్ కట్టడానికి స్తంభం ఎక్కాడు. దీంతో విద్యుత్ షాక్ గురై కింద పడిపోయాడు.స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళగా అప్పటికే రాజేష్ మరణించి నట్లువైద్యులు ధ్రువీ కరించారు. దీంతో వేళ్ళ చింతలగూడెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబాన్ని పోషించే రాజేష్ విద్యుత్ షాక్ తో మరణించడంతో కుటుంబ సభ్యుల రోదన అందరినీకన్నీరు పెట్టించింది. ఈ విషయం



తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వేళ్ళ చింతలగూడెం గ్రామం వెళ్లి కుటుంబ సభ్యులనుపరామర్శించి ధైర్యం చెప్పారు కేబుల్ నెట్వర్క్ యజమాని వద్ద నుంచి రాజేష్ కుటుంబానికి ఎమ్మెల్యే లక్షా 50 వేల రూపాయలు ఇప్పించారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం నుంచికూడా రాజేష్ కుటుంబానికి 5 లక్షల రూపాయలు సహాయంగా ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే మద్దిపాటి తెలిపారు.

# రంగరాయ వైద్య కళాశాల విద్యార్థులు పట్ల ల్యాబ్ అటెండెంట్ లైంగిక వేధింపులు

**- నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు సస్పెండ్**
**- క్రిమినల్ కేసులు నమోదు చేసిన పోలీసులు**
**- లైంగిక వేధింపులు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు జిల్లా కలెక్టర్ షణ్మోహన్**






**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

కాకినాడ జిల్లా రంగరాయ వైద్య కళాశాల పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల సంఘటనలో నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు ను విధుల నుండి సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేసామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.బిందుమాధవ్ సంయుక్తంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంగరాయ వైద్య కళాశాలలో పారామెడికల్ విద్యార్థినుల నుండి లైంగిక వేదింపులు అంశంపై అందిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు, అటువంటి సంఘటనలు విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలలో పునరావృతం కాకుండా చేపట్టిన చర్యలను గురించి వివరించారు. ఈ నెల 9వ తేదీన రంగరాయ వైద్య కళాశాలలో బిఎస్సీ-మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ కోర్సు చదువుతున్న 60 మంది విద్యార్థులు కళాశాలలో లాబ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వి.కళ్యాణ చక్రవర్తి తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేదింపులకు పాల్పడుతున్నాడని ఈ మెయిల్ ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేసారన్నారు. దీనిపై ఆర్ఎంసి ప్రిన్సిపాల్ వెంటనే స్పందించి ఈ ఫిర్యాదును లైంగిక వేధింపుల నిరోధానికి కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ విచారణకు అప్పగించారని, ఈ కమిటీ 9, 10 తేదీలలో బిఎస్సీ-ఎంఎల్టి కోర్స్ చదువుతున్న 60 మంది విద్యార్థులు, నిందిత ఉద్యోగుల లను విచారించి, అందరి వాంగ్మూలాలు, రుజువులను నమోదు చేసిందన్నారు. విచారణ సందర్భంగా 55మంది విద్యార్థినులు, నిందితుడు కళ్యాణ చక్రవర్తితో పాటు, మరో ముగ్గురు లాబ్ టెక్నీషియన్లు ఎస్.గోపాలకృష్ణ, బి.జిమ్మిరాజు,జివిఎస్ ప్రసాదరావులు కూడా తమపై లైంగిక వేధింపులకు, అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డారని తెలిపారన్నారు. కమిటీ విచారణలో ఫిర్యాదులోని ఆరోపణలు నిజమని 55 మంది విద్యార్థినులు తెలియ జేసారని, రుజువుల పరిశీలనలో కూడా లైంగిక వేదింపులు, అశ్లీల మెస్సేజులు, అనుచిత ప్రవర్తన జరిగినట్లు నిర్థారణ అయిందని తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా నలుగురు నిందిత ఉద్యోగులను రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సస్పెండ్ చేసి, వారిపై స్థానిక వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా, శుక్రవారం మధ్యాహ్నం వారందరినీ అరెస్ట్ చేయడం జరిగిందని, వీరిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సంఘటనలో తమపై జరుగుతున్న లైంగిక వేదింపులపై ధైర్యం ముందుకు వచ్చి ఫిర్యాదు చేసిన విద్యార్థినులను, ఫిర్యాదుపై తక్షణ విచారణ నిర్వహించి వారిలో వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని నింపిన ఆర్ఎంసి ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఆర్ఎంసి సంఘటన లో విద్యార్థి నులు, పని చేసే మహిళలపై లైంగిక అకృత్యాలను నిరోధించేందుకు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళశాలలు, కార్యాలయలలో మహిళల రక్షణకు ఏర్పాటైన అంతర్గత కమిటీలను మరింత బలోపేతం చేసి చైతన్య పరుస్తామని తెలిపారు. విద్యార్థినులు, పనిచేసే మహిళలు లైగింక వేదింపులు ఎదురైతే నిర్భయంగా ఈ కమీటీలకు గాని, తనకు గానీ తెలియజేయాలని, ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచి, నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఆర్ఎంసీ సంఘటనలో పోలీస్ స్టేషన్లలో శుక్రవారం ఉదయం ఫిర్యాదు నమోదు కాగా, నేరారోపితులు నలుగురిని మధ్యాహ్నం రెండున్నర లోపు అరెస్ట్ చేయడం జరిగిందని, సంబంధిత సెక్షన్ల ప్రకారం వారిపై చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. బాలికలు, మహిళల రక్షణకు చేపట్టిన చర్యల్లో భాగంగా పోలీస్ శాఖ శక్తి యాప్ ను అందుబాటులోకి తెచ్చిందని, విద్యార్థినులు, వర్కింగ్ ఉమెన్ తమ పట్ల జరిగే అకృత్యాల నుండి రక్షణ పొందేందుకు ఈ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శక్తి యాప్ గురించి బాలికలు, మహిళలందరికి తెలియజేసి అవసర సమయాల్లో వినియోగించుకునేలా చైతన్య పరచాలని మీడియాను కోరారు. ఈ సమావేశంలో రంగా రాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ. విష్ణువర్ధన్, జిజిహెచ్ ఇన్చార్జి సూపరిం టెండెంట్ డా.పి.శ్రీనివాసన్, ఆర్ఎంసి పారామెడికల్ కోర్సుల కో-ఆర్డినేటర్ డా.కె.సతీష్ పాల్గొన్నారు.

## శ్యాకంబరీ దేవిగా కనకదుర్గమ్మ వారు



**మామిడికుదురు , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా మామిడికుదురు మండలంలోని పాశర్ల పూడి బాడవలో వేంచేసియున్న శ్రీ కనక దుర్గ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలు రకాల కూరగాయలతో విశేష అలంకరణ చేశారు. ఆలయంలో జరిగిన కుంకుమార్చన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త తోరం రమణారావు ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.

## ఉపాధ్యాయునికి సన్మానం



**మామిడికుదురు , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

మండల పరిధిలోని ఈదరాడ సిద్ధార్థపేట మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడి గా గత ఎనిమిది సంవత్సరాలుగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న షబ్బీర్ హుస్సేన్ ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శిరిగినీడి శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ చుట్టుగుల్ల లక్ష్మీ రమేష్ ,మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కుసుమ వనజా కుమారి శ్రీధర్ పాల్గొన్నారు. పాఠశాల మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మన్ కుసుమ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడి గా హుస్సేన్ పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు.గ్రామ ప్రజలు,పెద్దలు శాలువాలతో సన్మానం చేసి హృదయ పూర్వక వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో గోసంగి సత్య సునీత, జి.సత్యనారాయణ,బి. సత్య నారాయణ,కే శ్రీను,కె.మంగా దేవి పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ రెడ్నం సతీష్ సైకిల్ లు పంపిణీ

**రామచంద్రపురం , జులై 11 , ( ప్రభాతవార్త )**

రామచంద్రపురం మండలం కాపవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎంపీటీసీ రెడ్నం సతీష్ సొంత నిధులతో ఆరు సైకిల్ లను విద్యార్థులకు అందజేశారు.కాపవరం గ్రామంలో హైస్కూల్ నందు ఇతర గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు ఉచితంగా సైకిల్లు మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని చేతులు మీదుగా అందజేశారు .వెల్ల గ్రామం నుంచి కాశి అక్షయ (8th), సూర్యతేజ (9th), కందులపాలెం గ్రామం నుంచి కడలి కావ్య(7th) విద్యార్థులకు రెండో విడతగా మొత్తం 6సైకిల్లు పంపిణీ చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముమ్మిడి సత్యనారాయణ మీడియాకు తెలిపారు.మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని మాట్లాడుతూ ఎంపీటీసీ రెడ్నం సతీష్ ఇతర గ్రామాల నుండి వచ్చే వారికి సైకిల్ ఉచితంగా ఇవ్వడమే కాకుండా తన ఎంపీటీసీ పరిధిలో ఉన్న తాడిపల్లి గ్రామం నుండి 6వ తరగతి చదువుతున్న పితాని అక్షిత, మాచవరపు శంకరి నాగ నిత్య తల్లితండ్రుల అభిప్రాయం ప్రకారం ఆటో మీద ఉచితంగా తీసుకుని రావడం ఆయన సేవాతత్పరతకు నిదర్శ



నమని కొనియాడారు .వీరే కాకుండా ఎప్పుడైనా ఇతర గ్రామాల నుండి ఎంత మంది విద్యార్థులు కాపవరం హైస్కూల్ నందు జాయిన్ అయిన వారందరికీ ఉచితంగా సైకిల్ పంపిణీ చేస్తానన్న మాట తన గ్రామంలో ఉన్న హైస్కూలు అభివృద్ధి చేయుటకు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు . కార్యక్రమంలో ఎంపీటీసీ గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి,విద్యా కమిటీ చైర్మన్ గీసాల వీర వెంకట రామ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రఘు, హెల్త్ అసిస్టెంట్ దివ్య,ప్రధానోపాధ్యాయులు ముమ్మిడి సత్యనారాయణ,ఉపాధ్యాయులు వాసంశెట్టి వెంకట రమణ,స్కూల్ మాజీ చైర్మన్ ప్రస్తుత గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మత్తి లక్ష్మీ మణిమాల ,విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు జన సురక్ష సద్వినియోగం చేసుకోవాలి



**రౌతులపూడి , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

మండలంలోని రాజవరంలో శుక్రవారం తుని యూనియన్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో జన సురక్ష క్యాంపెయిన్ జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జన సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలోములగపూడి శాఖ బ్రాంచ్ మేనేజర్ సాయి లక్ష్మణ్, తుని శాఖ ఫీల్డ్ ఆఫీసర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి, చింతకాయల రాజబాబు, శ్రీ సోమరౌతు దొర, బక్కా రమణ, వెంకటేష్, రుత్తల చిట్టి అబ్బాయి, ఈగలు ఎర్రయ్యమ్మ, డ్వాక్రా సంఘాల వివోఏ ఈగల సాయి దేవి, ఇతర నాయకులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవం

**రావులపాలెం , జులై 11 , ( ప్రభాతవార్త ) :**

రావులపాలెం ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్బవ దినోత్సవాన్ని కార్మికులు ఘనంగా నిర్వహించారు.యూనియన్ జిల్లా అధ్యక్షుడు రావుల సుబ్బారావు యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్ష కార్య దర్శులు ఎల్.ఎస్‌రావు, జిపి.రావు అధికసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం



**రాజమహేంద్రవరం , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
లైన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఆనంద్ రీజెన్సీ ఎదురుగా గల చున్నీలాల్ జాజు రోటరీ మున్సిపల్ స్కూల్ నందు శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా దినోత్సవం మీద విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 100 మంది పాల్గొనగా , ప్రథమ బహుమతి పూర్ణానంద గౌరంగికి, రెండో బహుమతి మనోజ్ఞ, తృతీయ బహుమతి స్నేహిత లు గెలుచుకున్నారు. 10 మందికి కన్సోలేషన్ బహుమతి గా డిక్షనరీలు అంద జేశారు. ఈ బహుమతి ప్రధాన సభలో ముఖ్యఅతిథిగా పూర్వపు జిల్లా గవర్నర్ గ్రంధి వెంకటేశ్వర రావు పాల్గొని జనాభా నియంత్రణ అవసరాలను తెలియజేశారు. జోనల్ చైర్మన్ మద్దుల వి ఎస్ శ్రీరామ్ గుప్తా మాట్లాడుతూ 2025వ సంవత్సరానికి 8.5 బిలియన్ల జనాభా చేరే అవకాశం ఉంది కాబట్టి అందుకు అవసరమయ్యే వనరులు సమకూర్చుకోవడానికి యువతరాన్ని సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షులు ఎం ఎస్ వి కిరణ్ కుమార్ అధ్యక్షత వహించగా కార్యదర్శి తేజ కాల్దరి, ట్రెజరర్ తమ్మనప్రీతం, క్లబ్ అడ్మిన్ గ్రంధి లక్ష్మీ వసంత కుమారి, ఇన్చార్జ్ హెడ్మాస్టర్ రత్తయ్య పాల్గొన్నారు.

# కౌశిక పూడికతీత పనులను పరిశీలించిన ఆర్డీఓ పి. శ్రీకర్

**కొత్తపేట , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
కొత్తపేట గ్రామ పరిధిలోని పలివెల మెయిన్ డ్రైన్ (కౌశిక డ్రైన్) నందు జరుగుచున్న పూడికతీత పనులను కొత్తపేట రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీకర్ పరిశీలించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ కాలనీ వంతెన వద్ద కౌశిక డ్రైన్ శుభ్రం చేసి గట్టు కు ఇరువైపులా ఉంచిన మురుగును, మట్టి దిబ్బలను తక్షణమే తీసివేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా, పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని పంచాయతీ వారిని, డ్రైన్ పై ఉన్న ఆక్రమణలను గుర్తించి జాబితా తయారు చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించినారు. కళా నగర్, బి.యస్.యన్.ల్ ఆఫీసు మరియు గోగివారిపేట నందు చేసిన పూడిక తీత పనులను పరిశీలించి ఇంకనూ కొన్ని చోట్ల ఉన్న మురుగు, గుర్రపుడెక్కలు, మట్టి దిబ్బలని వెంటనే



తొలగించే విధముగా మండల స్థాయి లో అన్నీ శాఖలు సమన్వయముతో పనిచేయాలని కోరారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ వై. రాంబాబు, యం.పి.డి.ఓ పి. నరేష్ కుమార్, ఏ. ఇ (డ్రైన్స్) జె. యల్. నాగరాజు, రెవిన్యూ మరియు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# స్వచ్ఛత గ్రామాలే లక్ష్యం : డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్



**అంబాజీపేట , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
స్వచ్ఛత గ్రామాలే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు,పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామాన్ని సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచేందుకు అందరం కలిసి పనిచేద్దామని డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఇరుసుమండ లో తడి, పొడి చెత్తపై పంచాయతీ కార్యదర్శి ఆర్. ఏడుకొండలుచంటి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటింటికి ఇచ్చిన ప్లాస్టిక్ టబ్ లలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా వేయాలన్నారు. వాటితో సంపద కేంద్రాల వద్ద కంపోస్టు ఎరువును తయారు చేస్తారన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దన్నారు. తడి, పొడి చెత్తలపై ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు, ఇంటింటికి వెళ్లి గృహిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే మాచవరం గ్రామపంచాయతీ పరిధిలో కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో తడి,పొడి చెత్త టబ్ లను పంపిణీ చేశారు.

# ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

**రావులపాలెం , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
ఏపీఎస్ ఆర్టీసీ ఆదాయం పెంచడంలో ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాలని రావులపాలెం డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్.కుమార్ అన్నారు. రావులపాలెం డిపో పరిధిలో జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు డ్రైవర్లు, ముగ్గురు కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్ సిబ్బందికి శుక్రవారం డిపో వద్ద అభినందన సభ జరిగింది. అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు కె.కోటేశ్వరరావు, పి.ఆర్.రుక్మిణి, వి.ఎస్.ఆర్ మూర్తి, డ్రైవర్లుపి. ప్రకాష్ రావు, కె.మోహన్, ఎన్. సుబ్బారావులకు, ఉత్తమ శ్రామిక్, మెకానిక్ లకు కూడా ప్రశంసా పత్రాలు అందించారు. ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకుని ఇష్టంతో ప్రయత్నిస్తే డిపోను మరింత అభివృద్ధి పథంలో నడిపించవచ్చని డిఎం అన్నారు.

**ఆషాఢ మాసంలో ప్రత్యేక బస్సులు :**
ఆషాడ మాసం సందర్భంగా ప్రతి శుక్రవారం అష్ట దేవి దర్శనం కోసం ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో నుంచి



ప్రత్యేక బస్సులు నడపుతున్నామని డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్.కుమార్ తెలిపారు. శుక్రవారం డిపో నుంచి మూడు ప్రత్యేక బస్సులు బయలుదేరి వెళ్ళాయని చెప్పారు. మొదటి శుక్రవారం ఐదు బస్సులు నడిపామన్నారు. అలాగే వచ్చే శుక్రవారం టిక్కెట్లు కావలసిన వారు స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9959225537, 738291 1871 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# గండేపల్లి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## - సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే నెహ్రూ



**గండేపల్లి , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
ప్రజా సమస్యలను పరిష్కరించేందు కృషి చేస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం గండేపల్లి గ్రామంలోని వెంకన్న బాబు గుడి వీధి, శెట్టిబలిజిపేట ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు,అందించిన సంక్షేమ ఫలాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శెట్టిబలిజపేట కాలనీ వాసులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన సమస్య డ్రైనేజీ నీరు పోయే వీలు లేక దుర్గంధ భరితంగా తయారైందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఒకే ఇంట్లో ఎక్కువ మంది ఉంటున్నామని ఇళ్ల స్థలాలు, హౌసింగ్ లోన్లు ఇప్పించాలని విన్నవించు కున్నారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యలన్నీ పరిష్కరించేందుకే ఈ పర్యటన అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు,పోతుల మోహనరావు, గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, యలమాటి కాశి, కేతిన వెంకన్న చౌదరి, చాగంటి సత్యనారా యణమూర్తి, కంటిపూడి రామారావు, యిప్పెర్ల సురేష్, వెంపాటి రాజు, సుంకవిల్లి రమేష్, వెంపాటి సతీష్, చిటికెల కన్నబాబు, ఉప్పలపాటి సత్తిబాబు, ఆళ్ల సత్తిబాబు,పైలా వెంకన్న, లంజపల్లి రామకృష్ణ,చాగంటి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యాలే తొలి ప్రాధాన్యత..ఉప కమీషనర్, ఈఓ,నల్లం సూర్య చక్రధరరావు

**ఆత్రేయపురం , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
ఏడువారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల సౌకర్యాలే తొలి ప్రాధాన్యత గా పనిచేస్తున్నామని ఉప కమీషనర్, ఈఓ,నల్లం సూర్య చక్రధరరావు అన్నారు. ఈ క్రమంలో భక్తుల సూచనలను, సలహాలను తీసుకునేందుకు, వారి సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుండి భక్తులు పలువురు చూసనలు, సలహాలు ఇవ్వడం తో తప్పక పాటిస్తానని, ఇప్పటికే భక్తుల కోసం కోట్లాది రుపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించడంతో భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. మరికొందరు కొన్ని సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 30 నుండి 40 మంది భక్తులు ఫోన్ కాల్స్ ద్వారా మాట్లాడం జరిగిందన్నారు. హైదరాబాద్, తాడేపల్లిగూడెం నుంచి ఫోన్ చేసిన భక్తులు పార్కింగ్ ప్రదేశంలో ఎదురవుతున్న సమస్యలను ఈవో దృష్టికి తీసుకురాగా సమస్యను సత్వరమే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. శనివారం రోజు వచ్చే భక్తులకు అరిటాకులో భోజనం పెట్టాలని భక్తులు కోరారు. ఈ అంశంపై డిప్యూటీ కమిషనర్ సమాధానం ఇస్తూ ప్రతి శనివారం 20 వేల నుండి



25 వేల మందికి అన్నదాన సత్రం ద్వారా భోజన సదుపాయం కల్పిస్తున్నా మన్నారు. ప్లేట్లలో భోజనం అందించడం తాత్కాలికమే అని, వకుళా మాత అన్నదాన భవనం నిర్మాణం పూర్తి కాగా నే భోజనం టేబుల్స్ ఏర్పాటు చేస్తామని, అందులో ఒకేసారి 3,500 మంది కూర్చొని భోజనంచేసే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.అప్పుడు భక్తులకు పూర్తిగా అరటిఆకులో అన్న ప్రసాదం పెట్టేలా చర్యలు తీసుకుం టామని తెలియజేశారు. శనివారం లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నా వారికి ఏ విధమైన ఇబ్బంది కలగకుండా దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వచ్చే ప్రతి భక్తుడు స్వామివారిని కనులారా దర్శించి, సంతృప్తి పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఫ్లైవర్ ఏర్పాటు చేశామని ఈవో తెలిపారు. క్యూలైన్లో మంచినీటి సదుపాయం చిన్నపిల్లలకు బిస్కెట్లు పంపిణీ జరుగుతుందన్నారు. ఆలయంలోపల అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డయల్ యువర్ ఈవో ద్వారా గాని లేదా నేరుగా గాని స్వామి వారి భక్తులు తెలియజేసే సమస్యలకు, ఇబ్బందులకు పరిష్కారం చూపడంతో పాటుగా వారి యొక్క అమూల్యమైన సలహాలు తీసుకుంటామని చెప్పారు. ఆలయం లోపల సెక్యూరిటీ సిబ్బందిని పెంచడం గురించి భక్తులు అందించిన సలహాను పాటిస్తామన్నారు. ప్రతి శుక్రవారం భక్తుల సౌకర్యార్థం డయల్ యువర్ ఈవో, కార్యక్రమాన్ని కొన సాగిస్తున్నామని భక్తులు అసౌకర్యానికి గురైన, దేవస్థానం గురించి చూసనలు, సలహాలు ఉదయం 9, గంటలనుండి 10గంటల మధ్యలో 088552 71888 నెంబర్ కి తెలియజేయవచ్చునని ఈఓ చక్రదరరావు తెలిపారు.

# కోనసీమ తిరుమలలో జబర్దస్త్ నటి వర్షా


## - వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి రూ 1లక్ష విరాళం స్వామివారి ఆదాయం రూ.5 లక్షలు



**ఆత్రేయపురం , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శుక్రవారం భారీ గా భక్తులు తరలివచ్చారు. దీంతో స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ, 5లక్షల 7వేల 565లు ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు. ఉదయం మేలుకొలుపు ఐశ్వర్య లక్ష్మి హెూమం గోపూజ అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు వేదమంత్రాలతో కనుల పండువగా నిర్వహించారు శ్రీ స్వామివారి దర్శించుకొని అన్నప్రసాదాలను స్వీకరించారు జబర్దస్త్ నటులు వర్షా వారి కుటుంబ సభ్యులతో శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు.. వీరికి అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి రావులపాలెం గ్రామానికి చెందిన కంకటాల సూర్యనారయణ .భారతి దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,000 లు విరాళంగా అందించారు వీరికి ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ . కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, వై శ్రీను , శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేసారు.



# గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



**సీతానగరం , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని సింగవరం గ్రామంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ములగ అప్పలరాజు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో డబ్బులు, బంగారం, ఇతర సామాన్లు కాలిపోయాయని, సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బాధితులను పరామర్శించిన బత్తుల**
సింగవరంలో అగ్నిప్రమాద బాధితులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాధితులకు అండగా నిలిచారు. బత్తుల బలరామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అగ్నిప్రమాద బాధితులకు రూ. 5,000 ఆర్థిక సహాయంతో పాటు, బియ్యం, బట్టలు, దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రంగరాయ మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులు అమానుషం : జమ్మలమడక నాగమణి

**కాకినాడ రూరల్ , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
రంగరాయ మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న పారామెడికల్ విద్యార్థులపై లైంగిక దాడులు అమానుషమని, వేధింపులకు పాల్పడిన ల్యాబ్ అటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తిని అతని అనుచరులను వెంటనే సస్పెండ్ చేసి బాధితులకు న్యాయం చేయాలని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోనే పేరెన్నిక గన్న రంగరాయ మెడికల్ కళాశాలలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగమణి అన్నారు.గత నెల రోజులుగా విద్యార్థులు వేధింపులకు గురవుతున్న ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని ,విద్యార్థులు తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తేనే గాని కళాశాలలో ఏమి జరుగుతుందో తెలుసుకోలేని స్థితిలో పర్యవేక్షణ లోపం కనిపిస్తుందని ఆమె అన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో మహిళలకు యువతులకు సరైన రక్షణ కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం నేడు విద్యార్థుల మానప్రాణాలకు రక్షణ కల్పించలేని దుస్థితికి దిగజారిందని ఎన్నికల సమయంలో ఆడపిల్లల జోలికి వస్తే తాటతీస్తామంటూ హెచ్చరికలు చేసిన నాయకులే ఈ సంఘటన కు ఏం సమాధానం చెబుతారని అని ఆమె ప్రశ్నించారు. గతంలో గుడ్లవల్లేరు లో విద్యార్థులకు జరిగిన అవమానం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆమె గుర్తు చేశారు ఇటువంటి సంఘటనలు కూటమి ప్రభుత్వంలో సర్వసాధారణం అయిపోయాయని దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని ఆమె అన్నారు. నేడు కాకినాడలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన కీచకుల పీచమనచాలని ఆమె అన్నారు. వారిని వెంటనే ఉద్యోగం నుండి సస్పెండ్ చేసి వారిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు .తల్లిదండ్రులు అల్లారుముద్దుగా పెంచుకున్న తమ పిల్లలను చదువుల నిమిత్తమై ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి చదువుల కోసం పంపిస్తుంటే



ఇటువంటి కీచకుల బారిని పడి అనేక లైంగిక వేధింపులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఈ కూటమి ప్రభుత్వంలో దాపరించిందని ఆమె వాపో యారు. సాక్షాత్తు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతి నిధ్యం వహిస్తున్న జిల్లాలోనే ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని పవన్ కళ్యాణ్ ఈ సంఘటనపై పూర్తి బాధ్యత తీసుకొని ఇటువంటి సంఘటనలు పునరావృ తం కాకుండా తగిన చర్యలు చేపట్టి కళాశాల పరువును కాకినాడ నగర ప్రతిష్టను జిల్లా పరువును నిలబెట్టాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు.

# పోతులూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొమ్ముల కన్నబాబు



**ప్రత్తిపాడు , జులై 11 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని పోతులూరు గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు క్లస్టర్ ఇంచార్జ్ ,టిడిపి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొమ్ముల కన్నబాబు, ఆధ్వర్యంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు అమరాది వెంకట్రావు మండల నాయకులు టీ రాయవరం సర్పంచ్ తట్టవర్తి సుబ్బారావు, స్థానిక మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు తదితరులు హాజరై స్థానిక టిడిపి శ్రేణులతో కలిసి కరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం అందచేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సత్యప్రభ సారధ్యంలో మునుపెన్నడు లేనివిధంగా అభివృద్ధి చేసి చూపించడం ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లోని నెలకొన్న సమస్యలను ప్రజలు తమ వద్దకు తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అందుకోవడంలో ఇబ్బందులు ఉన్న వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా అధికారులు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గత వైసిపి అరాచక పాలన, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పరిపాలన ను ప్రజలు గుర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బర్ల చక్రం, శెట్టి వెంకన్న బాబు, మాజీ ఎంపిటిసి నాగులపల్లి బాబ్జి, నాగులపల్లి రాంబాబు, ఆవాల చంద్ర రావు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు

# లోవలో మారుమ్రోగిన ఆధ్యాత్మికత

## - భారీగా తరలివచ్చిన మహిళలు
## - అమ్మవారికి సారే-చీర సమర్పణ

**తుని( రౌతులపూడి) , జులై 11 , ( ప్రభాతవార్త )**
తుని మండలం, లోవ గ్రామంలో వేంచేసి యున్న స్వయం భూ శ్రీ తలంపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవములలో శుక్రవారం ఆధ్యాత్మికతతో మారుమ్రోగింది. ఉదయం మంగళ వాద్యాలతో సుప్రభాతన శ్రీ అమ్మవారి మెలుకొలుపుతో ఆలయ ప్రధానార్చకులు గ్రామదేవత ఆగంమంతో జరుగుచున్న నిత్యార్చన, అనంతరం భక్తులకు దర్శనములు కల్పించారు. ఆషాఢ మాసం 3వ శుక్రవారం సందర్భంగా ఉత్సవ ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు పర్యవేక్షణలో భక్తులు సమర్పించు చీర,సారె కార్యక్రమంలో వందలాదిగా భక్తులు వారి వారి ఇండ్లలో స్వయంగా తయారు చేసిన పిండి వంటలు శ్రీ అమ్మవారికి సమర్పించుటకు తరలి వచ్చారు. వందలాదిగా విచ్చేసిన మహిళా భక్తులు శ్రీ అమ్మవారికి సమర్పించే సారె బిందెలను తలపై ఉంచుకొని వారి వారి గ్రామాల నుండి కాలినడకన విచ్చేసే దృశ్యం, శ్రీ తలంపులమ్మ అమ్మవారి శరణ ఘోషతో దారి పోడవునా ప్రజలందరికి ఆధ్యాత్మిక భావనతో కనువిందు కలిగిం చారు. ఆలయ రాజగోపురం నుండి దేవస్థాన కార్యనిర్వ హణాధికారి ఆలయ మర్యాదలతో మంగళ వాయిద్యాలు నడుమ భక్తులకు స్వాగతం పలికారు. దేవస్థానంచే ఏర్పాటు చేసిన ఆలయ వేదపండితులు అర్చకులు వారిచే నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులందరు అత్యంత భక్తిశ్రద్ధలతోపాల్గొన్నారు. శుక్రవారం చండీ హెూమము పూర్ణాహుతి, పూజా కార్యక్రమాలు పూర్తి అయిన తదుపరి



భక్తులకు ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీ అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసారు. దేవస్థాన కార్యనిర్వహ ణాధికారి వారి పర్యవేక్షణలో ఆలయమునకు విచ్చేసిన భక్తులకు సిబ్బంది శ్రీవారి సేవకులు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేసినారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుండి విచ్చేసిన భక్తులతో ఆయా గ్రామ పెద్దలు పాల్గొని భక్తులకు సౌకర్యాలు ఏర్పాట్లులో సహకారాన్ని అందచేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు మాట్లాడుతూ శ్రీ తలంపులమ్మ అమ్మవారి దేవస్థానంలో తొలిసారిగా శ్రీ అమ్మవారికి భక్తులు చీర సారె సమర్పించు ఈ కార్యక్రమంలో మా గ్రామానికి అవ కాశం వచ్చినం దుకు చాలా ఆనంద దాయకమని, ఇందు కు కార్యనిర్వ హాధికారికి గ్రామ ప్రజలు అందరి తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నెల 13న భక్తులు శ్రీ తలం పులమ్మ అమ్మవారిని శాకంబరీ అలంకరణలో దర్శించు కొని శ్రీ అమ్మవారి ఆశీస్సులు పొందగలరని, అధిక సంఖ్యలో వచ్చుచున్న భక్తులకు క్యూలైన్లు, మంచినీరు, ఉచిత ప్రసాదం, చంటి పిల్లలకు పాలు పంపిణీ, ప్రాథమిక వైద్య సదుపాయాలు, ఏర్పాటు చేయుట జరిగినదని తెలిపారు. ట్రాఫిక్ నకు అంతరాయం లేకుండాను, ఏవిధమైన అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు వారి సహాకారాన్ని పోందుట జరుగుచున్నదన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# రాష్ట్రపతి మెచ్చిన రైతు బిడ్డ !




గ్రామీణ నేపథ్యం... వ్యవసాయ కుటుంబం... చిన్నప్పటి నుంచి తల్లిదండ్రుల రెక్క చూసి పెరిగింది. వారిని ఉన్నత స్థాయిలో చూడాల్సి ఉంది. అందుకే ఆత్మవిశ్వాసం చదివి సీఎంఏలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేత మీదుగా పట్టా అందుకుంది. ఆమె కొత్తపేట తేజస్విని. తన విజయాన్ని మనతో పంచుపందిలా.

అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లెలోని కన్నెమడుగు మా స్వస్థలం. అమ్మానాన్నలు నాగవేణి. రఘురామిరెడ్డి, వారికి మేం ముగ్గురం సంతానం అమ్మానాన్నలిద్దరూ వ్యవసాయం చేస్తా సాగులో కంటే లాభాలు రావాలంటే ఎక్కువ చూశారు నాన్న అయినా మా చదువుల్ని ఆపని ప్రాథమిక విద్య స్థానిక పాఠశాలలోనే సాగింది. హైస్కూలు విద్యను మదనపల్లెలోని వలస జవహర్ నవోదయలో చదివాను.

తిరుపతిలో సీఏ పూర్తి చేశాను. జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలన్న లక్ష్యంతో ఎన్ని ఇబ్బందులు వచ్చినా రోజుకు 12-14 కష్టపడి చదివేదాన్ని, 2024 జులైలో ఐసీఏఐ (ఇన్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) విడుదల చేసిన సీఏ ఫైనల్ ఫలితాల్లో ఆలిండియాలో 14వ స్థానం సాధించాను. 2024 ఆగస్టులో ఐఎంఏ (ఇన్ డిగ్రీ ఆఫ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్) ఆధ్వర్యంలో విడుదలైన సీఎం ఏ (సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్) ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సొంతం చేసుకున్నాను. ఇందుకుగానూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా ఢిల్లీలో పట్టా అందుకున్నారు. అమ్మానాన్నల కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఇది. ప్రస్తుతం బెంగళూరు లోని ఓ ప్రైవేటు కంపెనీలో జాబ్ చేస్తున్నాను. అమ్మానాన్నలను బాగా చూసుకోవడం, చెల్లితమ్ముళ్లను ఉన్నత చదువులకు వెళ్లేలా చూడటంతోపాటు ఊరికి మంచి పేరు తీసుకురావాలి.

ఇవే నా ముందున్న ప్రధాన లక్ష్యాలు. □

## వాడేసిన బ్యాగు ధర రూ.85 కోట్లు



బ్రిటన్‌కు చెందిన దివంగత నటి, గాయని జానే బర్కిన్ (జేన్ బిట్‌కిన్) కోసం ఫ్రాన్స్ లగ్జరీ బ్రాండ్ హార్మీస్ (హెర్మ్స్) గతంలో ఓ అరుదైన బ్యాగ్‌ను తయారు చేసింది. ఆ బ్యాగును ఇప్పుడు వేలం వేయగా అది రికార్డు ధర పలికింది. పారిస్లో సోథిబే ఆక్షన్ హౌస్ నిర్వహించిన వేలంలో జపాన్కు చెందిన ఓ ప్రైవేట్ కలెక్టర్ ఈ ఒరిజినల్ బర్కిన్ బ్యాగ్ను 8.58 మిలియన్ యూరోలకు సొంతం చేసుకున్నారు. అంటే భారత కరెన్సీలో ఆ ధర దాదాపు రూ.8.5 కోట్ల పైమాటే..

నటి పేరే బ్రాండ్‌గా మారి... 1980లో నటి జానే బర్కిన్ ఓసారి పారిస్ నుంచి లండన్ వెళ్తుండగా విమానంలో ఆమె పక్క సీట్లో హార్మీస్ ఇప్పటి యజమాని జీన్ లూయీస్ డ్యూమస్ కూర్చున్నారు. ఆయనతో మాట్లాడిన ఆమె.. ఓ బిడ్డకు తల్లిగా తనకు కావాల్సిన రీతిలో మంచి బ్యాగు దొరకడం లేదని చెప్పారు. అనంతరం 1984లో హార్మీస్ సంస్థ పిల్లలను వెంట తీసుకెళ్లి తల్లుల అవసరాలకు ఉపయోగపడేలా ప్రత్యేకమైన బ్యాగ్‌ను రూపొందించి నటికి అందించింది. ఆ బ్రాండ్‌కు 'బర్కిన్' అని పేరు పెట్టింది. తొలి నాళ్లలో ఆ బ్యాగ్ నటి బర్కిన్ తరచూ వెంట తీసుకెళ్లేవారు దానిపై జె.బి అనే అక్షరాలతో ప్రత్యేకంగా రూపొందించారు. ఇక లోపల లోహంతో చేసిన రంగులు, భుజం నుంచి జారిపోకుండా ఉండేలా స్ట్రాప్, నెయిల్ క్లిప్పర్ వంటివి ఉంచారు. కొన్నేళ్ల పాటు ఆ బ్యాగ్‌ను వినియోగించిన నటి ఈ తర్వాత హార్మీస్ ఇచ్చేశారు. అనంతరం 1994లో దాన్ని వేలం వేసి వచ్చిన డబ్బును ఎయిడ్స్ ఛారిటీకి అంద జేశారు. ఆ తర్వాత కొన్నేళ్లకు పారిస్‌కు చెదిన కేథరీన్ బెనియర్ అనే మహిళ వేలంలో దాన్ని సొంతం చేసుకున్నారు.

25 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు సోథిబే సంస్థ ఈ బ్యాగ్‌కు వేలం నిర్వహించింది. మిలియన్ యూరోలతో వేలం మొదల వగా, జపాన్‌కు చెందిన ఓ వ్యక్తి దీన్ని 8.58 మిలియన్ యూరోలకు దక్కించుకున్నారు. కొన్ని కారణాల రీత్యా ఆ వ్యక్తి వివరాలను సోథిబే బయట పెట్టలేదు. ఓ హ్యాండ్‌బ్యాగ్‌కు ఇంత ఎక్కువ ధర పలకడం చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. అంతకుముందు 2021లో హాంకాంగ్‌లో నిర్వహిన ఓ వేలంలో మొసలి చర్మంతో చేసిన వజ్రాలు పొదిగిప ఓ బ్యాగు 5,13,00 డాలర్లకు అమ్ముడైంది. □

# ఒత్తిడి లేని భారత్ లక్ష్యంగా..




**అన్నీ బాగున్నాయి అనుకున్నప్పుడు వచ్చే కష్టాల్లోనే జీవితం ఉంటుంది. అని ఓ చిత్రంలో చెప్పినట్లుగా.. నిజంగా కష్టాలు వచ్చినప్పుడే జీవితం మలుపు తిరుగుతుంది. కొంతమంది వాటికి దాసోహమైతే..మరికొంతమంది ధైర్యంగా ఎదుర్కొని ఇతరులకు మార్గదర్శకులుగా మారుతుంటారు. మహారాష్ట్రకు చెందిన డాక్టర్ అనూజా లునియా రెండో కోవకు చెందుతుంది.** సాఫీగా సాగుతోన్న ఆమె జీవితంలో అనుకోకుండా వచ్చిన ఆరోగ్య సమస్యలు తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. వాటన్నిటికీ ఒత్తిడి కూడా కారణమని తెలుసుకున్న ఆమె.. దానిననుంచి బయటపడేందుకు తీవ్రంగా శ్రమించ డమే కాకుండా సానుకూల ఫలితాన్ని రాబట్టింది. అంతేకాదు ఆ ఫలాలను ఇతరులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుని స్ట్రెస్ స్ట్రాటజిస్ట్‌గా మారింది. ఆ తర్వాత రచయిత్రిగానూ మారిన ఆమె వేలమంది జీవితాలను ప్రభావితం చేస్తోంది. అవి తాత్కాలికమే.. మహారాష్ట్రలోని థానేకు చెందిన అనూజ తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లే. దాంతో తమ కూడా వైద్య రంగంలోనే ప్రవేశించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే ఫిజియోథెరపీలో డిగ్రీ పట్టా అందుకుని అదే విభాగంలో కెరీర్ ప్రారంభించింది. అయితే అదే సమయంలో ఆమె ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ (ఐబిడి) అనే సమస్యకు లోనైంది. దాదాపు ఐదేళ్ల పాటు మందులు వాడినా తాత్కాలిక ఉపశమనం లభించడమే కానీ, సమస్య నయం కాలేదు. ఈ క్రమంలో ఎలాగైనా సరే దీన్నుంచి బయటపడాలని ఒక ప్రణాళిక రూపొందించుకున్న ఆమె.. ఒకవైపు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమిస్తూనే మరోవైపు జీవనశైలిలో మార్పులు చేయాలని నిర్ణయించుకుంది. విపరీతంగా బరువు కోల్పోయి.. ఎప్పుడైతే అనూజ తన జీవనశైలిలో మార్పులు చేయడం మొదలు పెట్టిందో.. అప్పట్నుంచీ క్రమంగా ఆమె శరీరంలో సానుకూల మార్పులు మొదలవడం గమనించిందట. క్రమంగా తన ఆరోగ్యం మెరుగుపడడంతో 2008లో ఫిట్‌నెస్ స్టూడియో, పాలీక్లినిక్‌లను ప్రారంభించింది. అలా ఒకవైపు తన ఆరోగ్యాన్ని కాపాడుంటూనే మరోవైపు కెరీర్‌పై పూర్తిగా దృష్టి పెట్టింది. అలా కొన్నేళ్ల పాటు ఆమె ప్రయాణం సంతోషంగా సాగింది. కనీసం ఆహారం కూడా తీసుకోలేని స్థాయికి చేరుకుంది. దానివల్ల విపరీతంగా బరువు కోల్పోయింది. పని చేయడానికి కూడా శక్తి లేకపోవడంతో ఫిట్‌నెస్ స్టూడియోని మూసేసింది.

**ఒత్తిడి లేని భారత్ లక్ష్యంగా..** పరిస్థితులు ఎంత దయనీయంగా మారినా అనూజ మాత్రం కుంగిపోలేదు. సమస్యను పరిష్కరించుకోవడానికి ఉన్న అన్ని మార్గాలను అన్వేశించాలనుకుంది ఈ విధంగానే తన సమస్యకు ఒత్తిడి కూడా ఓ ప్రధాన కారణం అని తెలుసుకుంది. అందుకే ఒత్తిడిని తగ్గించేందుకు 1 నెలల పకడ్బందీ ప్రణాళికను రూపొందించుకుంది. అది తిరిగి సాధారణ జీవితాన్ని గడపడానికి ఉపయోగ పడింది. ఈ ఒత్తిడి ఒత్తిడి వల్ల తనలాగా ఇతరులు ఇబ్బందులు ఎదుర్కోకూడదని ఒత్తిడి 'స్ట్రెస్ స్ట్రాటజిస్ట్'గా మారింది. భారతదేశాన్ని ఒత్తిడి లేని దేశంగా తన వంతుగా కృషి చేయడానికి సంకల్పించుకుంది. ఇందులో భాగంగానే రచయిత్రిగా మారిన ఆమె 'రిలాక్స్ ప్లే త్రివే' అనే బుక్‌ని రాసింది. ఇందులో ఒత్తిడి తగ్గించడానికి 111 యాక్టివిటీలను చేర్చింది. అలాగే దీనికి సంబంధించిన సంస్థలలో కూడా వర్క్‌షాప్‌లు కొనసాగుతున్నాయి. అలా ఇప్పటివరకు దాదాపు 18 వేల మందికి పైగా జీవితాలను ప్రభావితం చేసింది. ఇతర ఇతరులకు మార్గదర్శకులుగానూ మారింది. □

## పదార్థాలు పాడవకుండా..



**తీరిక లేని జీవితం లో ఏరోజు కారోజు వెళ్లి..** తాజా కూరగాయలు కొనుక్కోవడం కొంచెం కష్టమైన సంగతి. అందుకు బదులుగా కవర్లలో పెట్టి ఫ్రిజ్‌లో భద్రం చేయడం మామూలే. మరి అవి వారం పదిరోజుల వరకూ తాజాగానే ఉండాలంటే. సిలికాన్ వెజిటబుల్ ఫుడ్ స్టోరేజ్ బ్యాగ్స్ వాడితే సరి. ఈ జిప్ లాక్ కవర్లు గాలి చొరబడనివ్వవు, మందంగా ఉంటాయి. సీల్ వేసినట్లుగా ఉండి. కాయలు, పండ్లను మరింత తాజాగా ఉంచుతాయి. నాణ్యమైన మెటీరియల్‌తో చేయడం వల్ల మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు. ఒకదాని మీద ఒకటి కాకుండా పక్కపక్కన నిలబెట్టొచ్చు. ఈ స్టోరేజ్ కంటెయినర్ ఫ్రీజర్ సంచుల్లో లంచ్‌తో సహా చిరుతిళ్లు, పానీయాలను కూడా భద్రం చేసేయొచ్చు. వీటిల్లో ఉంచిన పదార్థాల్ని మరో పాత్రలోకి తీయ కుండా.. తిన్నగా కవర్‌తోనే అవెన్‌లో వేడిచేయొచ్చు. ఫ్రిజ్‌లో ఎక్కువ స్థలం ఆక్రమించదు, డిష్‌వాషర్‌తో శుభ్రం చేయడమూ తేలికే. నాణ్యమైన సిలికాన్ కనుక పదార్థాల రుచి తగ్గదు, విషతుల్యం కాదు. □

# బ్లౌజుకు అందమైన అల్లిక

ఫ్యాషన్ ఫ్యాషన్








చీర ఎంత ఇష్టంగా కొన్నా.. తరవాత మన దృష్టంతా బ్లవుజు మీదే. దాన్ని ఎలా కుట్టించాలనే! అవును మరి చీర అందం మొత్తాన్నీ నిర్ణయించేది అదే కదా. ఆ మాత్రం శ్రద్ధే కాదు. ఖర్చు పెడతాం. ఎప్పటికప్పుడు నయా ట్రెండ్ ఏంటా అని తెలుసుకోవడమూ ఇందులో భాగమే. ఇందుకు పట్టు, రోజువారీ చీరలన్న తేడా ఉండదు. ఇప్పుడు కాబోయే వధువుల దగ్గర్నుంచి, గృహిణుల వరకూ ఆకర్షిస్తున్నవేంటో తెలుసా? పిన్ టక్ డిజైన్లు, పేరు మాత్రం కొత్తదేం కాదు. ఒకప్పుడు బ్లవుజులపై సన్నని ప్లీట్స్‌ను పక్కపక్కనే నిలువుగా కుట్టేవారు. ఇప్పుడు కాస్త ట్రెండ్ మారింది. ఆ ప్లీట్స్‌నే డైమండ్ ఆకారంలోకి మార్చేస్తున్నారు. పూసలు, అద్దాలు, ఆరీ వర్క్ జతతో భలే ఆకట్టుకుంటున్నాయి కదూ! కాటన్, లినెన్, సిల్క్, షిఫాన్.. అన్ని వస్త్రాలకూ ఈ అల్లిక నప్పుతోంది. పట్టు వాటికైతే నెటెడ్ వస్త్రంపై వీటిని జోడిస్తున్నారు. ఆరీ వర్క్, అందమైన పిన్ టక్ అల్లికలపై ఆసక్తి చూపుతున్నారు. మదువులైతే ఈ కాంబినేషన్‌ని ఏరి కోరి కుట్టించుకుంటున్నారు. పైగా ఆధునిక లుక్ అదనం. మనసు దోచకుండా ఉంటాయా? మరీ మీ సంగతేంటి? మీకూ నచ్చిందా.. ఈ అందమైన అల్లిక? ఇంకేం ప్రయత్నంచేయండి మరి.
















## ఆకుకూరల ప్రయోజనాలు -2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఆకుకూరల్లోని పిండి పదార్థాలు, ప్రోటీన్స్ డయాబెటిక్స్, ప్రీడయాబెటిక్స్‌లోని చక్కెర స్థాయిల్ని నియంత్రిస్తాయి. ఆకుకూరల్లోని సోడియం, పొటాషియం, మాంగనీస్‌లు అధిక రక్తపోటుని నియంత్రించి గుండెజబ్బులు, పక్షవాతం, ఆల్జీమర్స్ వంటివి రాకుండా కాపాడుతాయి. ఆకుకూరల్లోని బి కాంప్లెక్స్ విటమిన్ పిండి పదార్థాల్ని గ్లూకోజ్‌గా మార్చి శరీరానికి శక్తినిచ్చే ఇంధనాలుగా పనిచేస్తాయి. విటమిన్ ఇ హార్మోన్ల అసమానతకి, వంధ్యత్వానికి చర్మానికి ఉపయోగపడతాయి. విటమిన్ కె వల్ల రక్తం గడ్డకట్టడానికి ఉపయోగపడేది, గుండె, రక్తనాళాల జబ్బులు, ఎముకలు గుల్లబారడం, కిడ్నీస్టోన్స్‌ని నియంత్రించే శక్తిని కల్గి రక్తనాళాల స్థితి స్థాపకతని కాపాడుతుంది. అంతేకాకుండా బాడీ ఫిట్‌నెస్‌కి శరీరంలో వేడిని తగ్గించి చలువ చేయడానికి శీతాకాలంలో వేడిని కల్గించడానికి ఉపయోగపడి శరీర ఉష్ణోగ్రతని క్రమబద్ధీకరిస్తుంది. **జాగ్రత్తలు :** పచ్చి ఆకుకూరల్ని ఎక్కువగా తీసుకోరాదు. వీటిలోని రసాయనాల స్ప్రే వల్ల ఆక్సలేట్స్, ఫైటిక్ ఆసిడ్స్ వల్ల కాల్షియం, ఐరన్ ఖనిజాల పోషణకి ఆటంకం కల్గి పోషకాహార లోపం కల్గుతుంది. చాలా మందిలో ఆకుకూరలు తినే అలవాటు లేకపోవడం వల్ల అధిక ఫైబర్ వల్ల కడుపులో అనీజీ,గ్యాస్ ట్రబుల్ కాబట్టి అలవాటు అయ్యేంతవరకు మితంగా తీసుకోవాలి. ఆకుకూరల వల్ల ఎటువంటి హాని జరగదు. అంతేకాకుండా చాలా మంది విరేచనాలు కల్గిస్తాయని తినరు. పిల్లలకి పెట్టరు. వీటిని రాత్రిపూట తినకూడదని వీటిని ఎక్కువగా తింటే మలం పరిమాణం ఎక్కువుగా ఉంటుందని మలంలో ఆకులు అరగక తిన్నది తిన్నట్లే వస్తుందని రకరకాల అపోహలతో ఆకుకూరల్ని తినడానికి విముఖత చూపిస్తారు. నేల, నీరు ద్వారా ఆకుకూరలు సూక్ష్మక్రిములు, కీటకాలతో కలుషితం కావడం వల్ల, రసాయనాల స్ప్రే వల్ల వీటిని సరిగా కడగకపోవడం వల్ల విరేచనాలు, ఫుడ్ పాయిజనింగ్ వస్తాయి. అంతేగాకుండా ఆకుకూరల్లోని అధిక ఫైబర్ వల్ల ఒకేసారి అధిక మోతాదులో కాని, తరుచుగా లేదా కంటిన్యూగా ఒకే రకం ఆకుకూరల్ని తిన్నా, ఎక్కువ రోజులు నిల్వ ఉన్న ఆకుకూరల్ని తిన్నా విరేచనాలు వస్తాయి. కొందరిలో రోజుకి 2-3 సార్లు తింటే ఆహారం తిన్న వెంటనే మల విసర్జనకి పోవాల్సి ఉంటుంది. అంతేకాని ఆకుకూరలు తినడం మానివేయడం మంచిది కాదు. ఇవి ఆరోగ్యానికి అన్ని విధాల మేలు చేస్తాయి. ఎలర్జీ ఉన్నవారిలో కొంతమంది సున్నితంగా ఉంటారు. **ఉదా :** పాలకూర, కాలే, తోటకూరవల్ల ఎలర్జీరాష్ వచ్చే అవకాశముంది. ఇలాంటివారు పాలక్‌ని ఇతర ప్రోటీన్స్‌తో కలిపి తినడం మంచిది. ఇరిటబుల్ బవల్ సింన్డ్రోమ్, జీర్ణకోశ సమస్యలున్నప్పుడు దీర్ఘకాలిక రోగాలతో బాధపడేటప్పుడు, ఆపరేషన్స్ జరిగిన తర్వాత, అంటువ్యాధుల నుండి కోలుకుంటున్నాప్పుడు ఆకుకూరల్ని మితంగా తీసుకోవాలి. ముఖ్యంగా పిల్లలు, పెద్దలు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆకుకూరల్లోని విటమిన్ కె ఎక్కువగా ఉండి ఫోటో సింథసిస్ వల్ల కొన్ని రకాల మందులు, ఆంటీ కోయాగ్యులెంట్స్ (బ్లడ్ థిన్నర్స్) వాడేవారు మానివేయకుండా మితంగా తీసుకోవాలి. అలాగే ఆకుకూరల్లోని ఆక్సలేట్స్, ఫైటిక్ ఆసిడ్స్ వల్ల కాల్షియం ఐరన్ పోషణకి ఆటంకం ఏర్పడి కిడ్నీలో స్టోన్స్ వచ్చే అవకాశముంది. అలాగే కిడ్నీస్టోన్స్‌తో బాదపడేవారు తక్కువగా తీసుకోవాలి లేదా నీళ్ళతో ఉడికించి లేదా ఉడికిన తర్వాత వచ్చే నీళ్ళని పారబోయడం మంచిది. ముఖ్యంగా పాలకూరని తగ్గించాలి. ఆకుకూరల్లోని గ్లూకోసినోలేట్ వల్ల అయోడిన్ పోషన జరగక గాయిటర్ వచ్చే అవకాశముంది. కొన్ని ప్రాంతాల్లో కొన్ని నేలల్లో పెరిగే వీటికి వాడే క్రిమిసంహారం వల్ల, బాక్టీరియల్ కాలుష్యం (ఈ కోలై, సాల్మోసెల్లా) వల్ల ఫుడ్ పాయిజనింగ్ లేదా కడుపు నొప్పి, విరేచనాలు రాకుండా వీటిని ఉప్పునీటిలో 10-15 నిమిషాలుంచి బాగా శుభ్రపర్చిన తర్వాతనే వాడుకోవాలి. పచ్చి ఆకుకూరలు జీర్ణ కావడానికి టైమ్ పడుతుంది పసరువాసన వల్ల తినలేనప్పుడు ఉడికించి కాని లేదా వివిధ వంటకాల్లో, వివిధ పదార్థాలతో చేర్చి తీసుకోవడం మంచిది. ఎక్కువ ఉడికిస్తే ఎ,బి,సి, విటమిన్లు ఆవిరై పోతాయి. ఆకుకూరల్లో పిండిపదార్థాలు 20 గ్రా దాకా ఉండడం వల్ల ఉడికించి తినడం షుగర్ రోగులకి మంచిది. అలాగే నైట్రేట్ రూపంలో నత్రజని చేరడం వల్ల హోమ్గ్లోబిన్‌ని ఆక్సీకరణం చేసి మిథో మోగ్లోబినేమియాకు దారి తీస్తుంది. ఆకుకూరలు హైపో థైరాయిడిజమ్‌ని ఎఫెక్ట్ చేస్తాయి. కాని మలబద్ధకం సమస్య ఉన్నవారు మితంగా తీసుకోవడం అన్ని విధాలా మంచిది. ఇది థైరాయిడ్ పని తీరుకి ఆటంకం కల్గిస్తాయి. సంప్రదాయేతర ఆకుకూరల్ని ఎక్కువగా వాడరాదు. మధ్య మధ్యలో సేంద్రియ ఎరువులతో పండించిన ఆకుకూరల్ని వాడడం మంచిది. □

## వాస్తవం


ఆధ్యాత్మికం



ఒక రాజ్యంలో మహారాజు బీదసాదలకు నిత్యం అన్నదానం చేయించే వాడు. ఓ రోజు భోజన వితరణ చేయిస్తుండగా, ఓ గద్ద పామును నోట కరచుకొని పోతోంది. పాము గద్ద పట్టు నుంచి తప్పించు కోవటానికి విశ్వప్రయత్నం చేస్తోంది. ఆ ప్రయాసలో దాని కోరల నుంచి జారిన విషం భోజన పదార్థాల్లో పడింది. అదెవరూ గమనించలేదు. కొంతసేపటికి ఆ ఆహారం తినన పేదలు చనిపోగా రాజు దిగ్భ్రాంతి చెందాడు. ఈ పాపానికి కారణం యమలోకంలోచర్చనీయాంశమైంది. గద్ద ఆహార సేకరణలో పామును పట్టుకుంది,. సర్పం ప్రాణభయంతో విషం చిమ్మింది. ఈ పొరపాటు రాజుకు తెలియదు. ఆ పాపం ఎవరి ఖాతాలో వేయాలని చిత్ర గుప్తుడు అడిగితే-ముందు భూలోకానికి పదమన్నాడు. దారిలో కొందరిని కదిలించాడు. మహారాజు అన్నదానం పేరుతో విషం పెట్టి చంపుతున్నాడు అని కొందరు, జనాభాను తగ్గించేదుకు విష ప్రయోగం చేయిస్తున్నాడు అని మరికొందరు మాట్లాడుకుం టున్నారు. నిజం తెలుసుకోకుండా తమ కాలాన్ని వృథా చేసుకుంటూ గాలివార్తలు, వదంతులను వ్యాపింప చేస్తున్న వీళ్లందరి ఖాతాలో వేయిండి.ఆ పాపమంతా అంటూ చిత్రగుప్తుడికి ఆజ్ఞ జారీచేశాడు యమధర్మరాజు. ప్రచారంలో ఉన్న ఈకథలో వాస్తవం ఎంతో కానీ.. అసత్యాలను ప్రచారం చేయడం మాత్రం మహా పాపమని అర్థం చేసుకోవాలి. □

## ఉద్యోగం పట్ల ఆసక్తి తగ్గుతోందా?

వృత్తిగత జీవితంలో నిరాశానిస్పృహలు ఆవరిస్తున్నాయా..? రోజురోజుకీ ఉద్యోగం జీవితంలో ఆసక్తి తగ్గిపోతోందా..? అనుకున్నంత ఉల్లాసంగా, ఉత్సాహంగా పని చేయలేకపోతున్నారా..? తెలియని ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారా..? అయితే ఈ సమస్యల నుంచి బయటపడేందుకు కొన్ని చిట్కాలు మీకోసమే.. ఆఫీసులో చేస్తున్న పని మీద ఆసక్తి తగ్గిపోవడానికి మీరు ఏదో విషయంలో ఒత్తిడికి గురవడమో లేక మీరు పని చేస్తున్న రంగం మీద కాకుండా వేరే రంగం మీద ఆసక్తి ఉండడమో. కారణం కావచ్చు. మీరు ఆలోచించి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం మంచిది. లేదంటే మీ కెరీరే ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. రోజూ రొటీన్ జాబ్ చేస్తున్నామనే భావన కలుగుతోందా? పనిలో ఆసక్తి తగ్గడానికి అదే కారణమని అనుకుంటున్నారా.. అయితే, అలాంటి సమయంలోనే మీ పనిని మీకు తగ్గేలా మలచుకోండి. రోజూ చేసే పనినే విభిన్నంగా చేయడానికి ప్రయత్నించండి. అంతకు మించి మీరు చేస్తున్న పనిలోనే రోజుకో కొత్త అధ్యయనం నేర్చుకోవడానికి సంకల్పిం చండి. మీ సహచర ఉద్యోగులతో విభేదాలే మీకు ఆఫీసు పనిలో నిరాసక్తతను, నిస్పృహను కలిగిస్తున్నాయని అనుకుంటున్నారా? అయితే, అలాంటి విభేదాలను వీలైనంత వరకు పరిష్కరించు కోవడానికి ప్రయత్నించండి స్నేహపూర్వ 'మైన వాతావరణంలో అందరినీ గౌర విస్తూ, నిబద్ధతతో పని చేయండి. □



## మేలు చేసే ద్రాక్ష గింజలు

తియ్యటి ద్రాక్షపండ్లను ఇష్టపడని వాళ్లు సామాన్యంగా ఉండరు. ఇప్పుడు సీన్‌లెస్ వస్తోంది. గింజలుంటే కూడా వాటిని తీస్తాం కదూ! నిజానికి అవి కూడా చాలా మంచిదని సర్వేల్లో తేలింది. ద్రాక్ష గింజలను యథాతథంగా కాదు గానీ.. వాటి సారాన్ని అనేక విధాల ఉపయోగిస్తున్నారు. ఇంతకీ దానివల్ల లాభాలేంటో చూద్దాం...

- ✦ గ్రేప్ సీడ్ ఎక్స్‌ట్రా ట్రాక్ట్ బీపీని క్రమబద్ధం చేస్తుంది. గుండెజబ్బులను దూరంగా ఉంచుతుంది.
- ✦ ఎముకలకు దృఢత్వాన్ని తెచ్చిపెడుతుంది.
- ✦ పుండ్లను తగ్గించడంలో తోడ్పడుతుంది.
- ✦ . టాబ్లెట్లు, క్యాప్స్యూల్స్ అధిక శాతం ద్రాక్షగింజల సారాన్నే వినియోగిస్తున్నారు. హైకొలెస్ట్రాల్, అథెరోస్క్లెరోసిస్, రక్తసరఫరా సరిగా లేకపోవడం వంటి జబ్బులను ఇది కొంతవరకూ నయం చేస్తుంది. ఇంకా పరిశోధనలు చేయాల్సి ఉంది.
- ✦ ద్రాక్ష విత్తనాలు అనేక విధాల మేలు చేసే మాట నిజమే అయినా.. అది సరిపడకపోతాతే కడుపు నొప్పి,వాంతులు, వికారం, విరేచనాలు, బలహీనత లాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందువల్ల గ్రేప్‌సీడ్ ఎక్స్‌ట్రాక్ట్‌ను వైద్యుల సలహాతో మాత్రమే వాడాలి. □



# తెర



## పెళ్లంటే భయమేస్తోంది

పెళ్లి చేసుకోవాలంటేనే భయమేస్తుందని ప్రముఖ నటి శృతి చెప్పుకొచ్చింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె పెళ్లి గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. నాకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకోవడం కోసం నేనెంతో కష్టపడ్డాను. కానీ, ఆ బాధ్యతలను ఒక చిన్న కాగితం మీద పెట్టాలంటే భయమేస్తుంది. పెళ్లి చేసుకోవాలని లేదు. పెళ్లి చేసుకొని తల్లిఅయ్యాకా.. విడిపోయి ఒక సింగిల్ మదర్ గా ఉండాలనుకోవడం లేదు. ఎందుకంటే సింగిల్ మదర్ కష్టాలు నాకు తెలుసు. నా లైఫ్ లో ఒకసారి పెళ్లి దగ్గరవరకు వెళ్లి వచ్చాను. చేసుకోవాలనుకున్నాను. కానీ, ముడిపడలేదు. పెళ్లి అనేది ఇద్దరు మనుషులకు సంబంధించిన విషయం కాదు. రెండు జీవితాల బాధ్యత. ఇద్దరిలోనూ విధేయత ఉండాలి. నిబద్ధత ఉండాలి. ఒకరిలో ఉంటే అది నిలవదు. ఒంటరిగా ఉండడం నాకు కొత్తేమి కాదు. ఎన్నో విషయాలను ఒంటరిగా ఉన్నప్పుడే నేర్చుకున్నాను.. అంటూ చెప్పుకొచ్చింది. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే శృతి ప్రేమ అనే మాయలో పడింది. లండన్ యాక్టర్ మైఖేల్ కోర్సలేతో పీకల్లోతు ప్రేమలో పడింది. ఇక వీరిద్దరూ చెట్టాపట్టాలేసుకొని అన్నిచోట్లా కెమెరా కంటికి కనిపించారు. త్వరలోనే ఈ జంట పెళ్లి చేసుకుంటుంది అనుకొనేలోపు ఇద్దరు బ్రేకప్ చెప్పుకొని విడిపోయారు.

### గేమ్ ఆఫ్ ఛేంజ్ సినిమా

# జీవన విధానాన్ని తీర్చిదిద్దే అస్త్రం

**చిత్ర నిర్మాత, కథానాయకుడు సిద్ధార్థ్ రాజశేఖర్**


గేమ్ ఆఫ్ చేంజ్ సినిమా ఒక శక్తివంతమైన జీవన విధానాన్ని తీర్చిదిద్దే అస్త్రం అని నమ్ముతున్నాను. సాధారణమైన క్షణాలు అసాధారణమైన మార్పులను రేకెత్తించిన పలు వ్యక్తుల ఆకర్షణీయమైన వ్యక్తిగత నిజ జీవిత కథనాలను మిళితం చేసి రూపొందించిన చిత్రమిది అని చిత్ర నిర్మాత కథానాయకుడు సిద్ధార్థ్ రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మూవీని మీడియాకు ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కుమార గుప్తుడు శా.శ 427లో నిర్మించిన నలందా విశ్వవిద్యాలయం బ్యాక్‌గ్రౌండ్‌లో జరిగిన కొన్ని నిజ జీవితాల కథనాలతో ఈ చిత్రం రూపొందించాము. మా మూవీ ప్రతి ప్రేక్షకుడిలో స్ఫూర్తి నింపుతుంది. ఈ సినిమా చూస్తున్నంతసేపు మనం ఎందుకు జీవితంలో సాధించలేము అనే పట్టుదల మొదలవుతుంది. కష్టాన్ని ఎదుర్కొన్నప్పుడే మనం జీవితంలో ఎదుగుతామని చెప్పే చిత్రమిది. ఈ సినిమాతో ఫిలింమేకింగ్ ఎంత కష్టమో తెలిసింది. ఫస్ట్ కమ్యూనిటీ బేస్డ్ మూవీగా గేమ్ ఆఫ్ ఛేంజ్..ఫిల్మ్ ఇండస్ట్రీలో ఒక రివల్యూషన్ తీసుకొస్తుందని




ఆశిస్తున్నాం అన్నారు. మరో నిర్మాత మీనా చాబ్రియా మాట్లాడుతూ ఇండియాలో ఇప్పటివరకు ఎవరూ చేయని సాహసం చేసాం. నేను మార్కెటింగ్ విభాగంలో 2 వేలకు పైగా సినిమాలకు పనిచేశాను. గేమ్ ఆఫ్ ఛేంజ్‌తో ప్రొడ్యూసర్ గా పనిచేసే అవకాశాన్ని సిద్ధార్థ్ రాజశేఖర్ కల్పించారు. సినిమా అంటే ఎంత హంగామా, ఎంత ఖర్చుతో కూడుకున్నదో మనం చూస్తున్నాం. గేమ్ ఆఫ్ ఛేంజ్ ఫస్ట్ కమ్యూనిటీ బేస్డ్ మూవీ. ఈ రోజుల్లో థియేటర్స్‌కు ప్రేక్షకుల్ని రప్పించడం ఎంత కష్టమో మనకు తెలుసు. కానీ నేటి మీడియా షోకు హౌస్ ఫుల్ అయ్యింది. ఇది మా మూవీకి ప్రేక్షకులు ఇవ్వబోయే సక్సెస్ కు చిన్న శాంపిల్. దేశవ్యాప్తంగా మేము ప్రమోషన్ చేస్తున్నాం. త్వరలోనే మా చిత్రాన్ని థియేట్రికల్, ఓటీటీ ద్వారా రిలీజ్ చేయబోతున్నాం. గేమ్ ఆఫ్ ఛేంజ్ సినిమాకు సీక్వెల్స్ కూడా ఉంటాయి. నెక్స్ట్ మూవీ మరింత గ్రాండ్‌గా రూపొందిస్తాం. గేమ్ ఆఫ్ ఛేంజ్ సినిమాను దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు రీచ్ చేయాలన్నదే మా లక్ష్యం. ఈ ప్రయత్నంలో మీ సహకారం మాకు ఉంటుందని ఆశిస్తున్నాం.. అన్నారు. ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో వస్తున్న చిత్రం గేమ్ అఫ్ చేంజ్. జాతీయ, అంతర్జాతీయ నటి నటులతో సిద్ధార్థ్ రాజశేఖర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో మలయాళ దర్శకుడు సిధిన్ దర్శకత్వంలో సిద్ధార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా నిర్మించిన అంతర్జాతీయ చిత్రం గేమ్ అఫ్ చేంజ్. ఫస్ట్ కమ్యూనిటీ బేస్డ్ మూవీగా తెరకెక్కిన గేమ్ ఆఫ్ ఛేంజ్ సినిమా త్వరలో థియేటర్స్‌తో పాటు ఓటీటీలోనూ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

## లా విద్యార్థి లౌ ఫలించిందా?

ఇషాన్ ఖట్టర్ మరియు అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ నటీనటులుగా వచ్చిన సైరట్ చిత్రం హిందీలో మంచి విజయం అందుకుంది. తాజాగా ఈ సినిమాకు ధడక్ 2 అంటూ సీక్వెల్‌ను తీసుకువస్తున్నారు మేకర్స్. ఈ చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది, యానిమల్ భామ త్రిప్తి డిమ్రి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు షాజియా ఇక్బాల్ దర్శకత్వం వహించబోతుండగా.. ధర్మ ప్రొడక్షన్స్ సమర్పణలో జీ స్టూడియోస్, ధర్మ ప్రొడక్షన్స్ క్లౌడ్ 9 పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగష్టు 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే.. ఈ చిత్రం నిలేష్ (సిద్ధాంత్ చతుర్వేది) విధి (త్రిప్తి డిమ్రీ) అనే ఇద్దరు ప్రేమికుల చుట్టూ తిరుగుతుంది. నిలేష్ అనే అణగారిన కులానికి చెందిన యువకుడు లా చదువుదామని న్యాయ కళాశాలలో జాయిన్ అవ్వగా.. అతడికి విధి అనే ఉన్నత కులానికి చెందిన యువతి పరిచయమవుతుంది. వీరి స్నేహం కాస్తా ప్రేమగా మారాగా.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఏంటి అనేది ఈ సినిమా కథ.





## భాగ్యనగరంలో ఆంధ్రా కింగ్ షూటింగ్

రామ్ పోతినేని, ఉపేంద్ర, మహేష్ బాబు పి, మైత్రి మూవీ మేకర్స్ ఆంధ్రా కింగ్ తాలూకా నెల రోజులు పాటు జరిగే కీలకమైన షూటింగ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో షురూ అయింది. ప్రస్తుతం, రామ్, భాగ్యశ్రీ బోర్సే పై ప్రేమ సన్నివేశాలను నైట్ బ్యాక్ డ్రాప్‌లో చిత్రీకరిస్తున్నారు. ఈ నైట్ షెడ్యూల్ 10 రోజుల పాటు కొనసాగుతుంది. ఆ తర్వాత క్లైమాక్స్, ఇతర కీలక సన్నివేశాలను చిత్రీకరించడానికి 20 రోజులు డే టైంకి షూటింగ్ షిఫ్ట్ అవుతుంది. ఈ చివరి షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ పూర్తవుతుంది. ఈ సినిమాలో కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సినిమాపై అంచనాలని పెంచింది. టాప్ టెక్నిషియన్స్‌తో ఈ ప్రాజెక్ట్ అత్యున్నత స్థాయి సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. సిద్ధార్థ నుని సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. వివేక్‌మెర్విన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా. ఆంధ్రా కింగ్ తాలూకా షూటింగ్ పూర్తయిన తర్వాత మేకర్స్ ప్రమోషన్స్ జోరుని మరింతగా పెంచనున్నారు. తారాగణం: రామ్ పోతినేని, ఉపేంద్ర, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళి శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, జుగిజు గణేష్ .

## 25న సార్ మేడమ్..

వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి, వెరీ ట్యాలెంటెడ్ నిత్యా మేనన్ జంటగా నటిస్తున్న రోమ్ కామ్ ఫ్యామిలీ డ్రామా సార్ మేడమ్.. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్ పై సెందిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ సార్ మేడమ్ టైటిల్ విడుదల చేశారు. ఈ టీజర్ పెళ్లికి ముందు ఓ అమ్మాయికి మెట్టినింటి వాళ్లు చెప్పే మాటలతో మొదలై.. భార్యభర్తల మధ్య జరిగే ఫన్నీ గొడవతో ఆకట్టుకుంది. విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ మధ్య సాగే సంభాషణలు ప్రేక్షకుల్ని అలరించాయి. టీజర్ ప్రారంభంలో వంట మాస్టర్‌లా కనిపించిన విజయ్ సేతుపతి చివర్లో గన్ పట్టుకొని మాస్ యాక్షన్ లుక్ కనిపించడం చాలా ఇంట్రస్టింగ్‌గా వుంది. టీజర్ విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ పెర్ఫార్మెన్స్ హైలెట్‌గా నిలిచింది. డైరెక్టర్ పాండిరాజ్ ఫ్యామిలీ జానర్ లో ఒక యూనిక్ స్టొరీతో వస్తున్నారని టీజర్ చూస్తే అర్థమోతోంది. టైటిల్ టీజర్ కి సంతోష్ నారాయణన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సార్ మేడమ్ ఈ నెల 25న థియేటర్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో యోగి బాబు, శిరీ సురేష్, చెంబన్ వినోద్ జోస్, శర్వణన్, దీప ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డిఓపి ఎం సుకుమార్, ఎడిటర్ ప్రదీప్.



## నిర్మాతగా రీఎంట్రీ



ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోగా ఎదిగిన వడ్డే నవీన్ వడ్డే క్రియేషన్స్ పేరుతో నిర్మాణ సంస్థ ప్రారంభించారని తెలుస్తోంది. దీంతో నిర్మాతగా రీఎంట్రీ ఇస్తున్నారని ఆయన ఫ్యాన్స్ భావి స్తున్నారు. నటుడిగా తిరిగి వస్తారంటూ వార్తలు వచ్చినప్పటికీ, వడ్డే నవీన్ నిర్మాతగా ఇప్పుడు పరిచయం కానున్నారు. 1990లలో కోరుకున్న ప్రియుడు సినిమాతో తెలుగు సినిమాలో అడుగు పెట్టిన వడ్డే నవీన్, తర్వాత పెళ్లి చిత్రంతో మంచి పేరు సంపాదించుకున్నారు. ఆ చిత్రం ఆయనకు ఫ్యామిలీ ఆడి యన్స్‌ని దగ్గర చేసింది. వడ్డే నవీన్ దశాబ్దం పాటు అనేక సక్సెస్‌ఫుల్ సినిమాలతో ఫ్యామిలీ హీరోగా తన క్రేజ్‌ను పెంచుకున్నారు. మనసిచ్చి చూడు, చెప్పాలని ఉంది, ప్రేమించే మనసు, స్నేహి తు లు వంటి సినిమాలు మరిం త ఫ్యామిలీ ఆడియన్‌ను ఆక ట్టుకున్నాయి.

# అసభ్యత లేని సెంటిమెంట్‌తో ..

### ఓ భామ.. అయ్యో రామ

కలర్ ఫొటో ఫేం సుహాస్ ఎంచుకునే పాత్రలు భిన్నంగా ఉంటాయి. మినిమం గ్యారెంటీ అనేలా ఆయన సినిమాలు ఉంటాయి. తాజాగా ఆయన నటించిన చిత్రం ఓ భామ.. అయ్యో రామ మాళవిక మనోజ్ కథానాయిక. రామ్ గోదల దర్శకత్వంలో హర్ష నల్ల నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రామ్ (సుహాస్) చిన్నతనంలోనే తల్లి (అనిత)ను కోల్పోతాడు. తండ్రికి (రవీంద్ర విజయ్) రామ్ అంటే గిట్టదు. అతన్ని దూరం పెడతాడు. తల్లే అతని బాగోగులు చూసుకుంటుంది. అకస్మాత్తుగా తల్లి మరణించడంతో మేనమామ (అలీ) అతని బాధ్యత తీసుకుంటాడు. అక్కడి నుంచి రామ్‌కి ఏ లోటు లేకుండా చూసుకుంటాడు. రామ్ దర్శకుడు కావాలనేది అతని తల్లి కల. కానీ అతను సినిమాలకు దూరంగా ఉంటూ పెద్ద చదువుల కోసం ఫారెన్ వెళ్లానుకుంటాడు. అతని జీవితంలోకి సత్యభామ (మాళవిక మనోజ్) అనే అమ్మాయి రావడంతో తన జీవితం మారిపోతుంది. అమ్మ లేని లోటును సత్యభామ తీరుస్తుంది. ఆమె రాక అతనిలో ఎలాంటి మార్పు తీసుకొచ్చింది. సినిమాలకు దూరంగా ఉండే అతను ఆ దిశగా అడుగులు వేయడానికి కారణమేంటి? సినిమా డైరెక్టర్ కావాలానే తల్లి కోరికకు అతను ఎందుకు దూరంగా ఉన్నాడు? రామ్, సత్యభామల ప్రేమ కథ కంచెకు చేరిందా లేదా? అన్నది కథ. కెరీర్, మదర్ సెంటిమెంట్‌తో కూడిన లవ్‌స్టోరీ ఇది. సింపుల్ కాలేజీ కుర్రాడి కథగా మొదలై ప్రేమ, భావోద్వేగాల వైపు నడుస్తుంది. కథగా చూసినప్పుడు ఫస్టాఫ్‌లో హీరోయిన్ యాక్సిడెంట్, దాని నుంచి కాపాడటం, ఆమె హీరోకి ఫిదా కావడం, అతని వెంట పడటం, అతనికి దగ్గరై సరదాగా బయటకు తిరగడం వంటి సన్నివేశాలు కాస్త విసుగు తెప్పిస్తాయి. అందుకు కారణం అవన్నీ ఎన్నో సినిమాల్లో చూసినవే.




హీరోహీరోయిన్, స్నేహితుల మధ్య సాగే ప్రతి సన్నివేశం రొటీన్‌గా సాగుతాయి. ఇంటర్వెల్‌లో ట్విస్ట్ కొంత వరకూ ఫర్వాలేదు. సెకెండాఫ్ నుంచి కథ సీరియస్ ట్రాక్‌లోకి వెళ్తుంది. మేనల్లుడి మీద బాధ్యతగా వ్యవహరించే అలీ పాత్ర ఎమోషన్‌గా సాగుతుంది. హీరో తల్లికి ఎలా దూరమయ్యాడు, తన తండ్రి వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు అనే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. ఫ్లాష్‌బ్యాక్ ఎడిసోడ్ కూడా బావుంది. చివర్లో ట్విస్ట్ సస్పెన్స్‌ని క్రియేట్ చేస్తుంది. క్లైమాక్స్‌లో రూట్ మార్చినట్టి మార్చి అసలు విషయం రివీల్ చేసిన తీరు బాగుంది. ముగింపు రొటీన్‌గా కాకుండా ట్విస్ట్‌తో ముగించారు. అయితే లాజిక్‌లో వెతికే వారికి ఆ సీన్స్ అంతగా ఎక్కవు. యూత్‌ని ఎట్రాక్ట్ చేసే ప్రయత్నం చేశారు. కానీ అది ఇంకాస్త డీప్‌గా చేసుంటే రిజల్ట్ మెరుగుగా ఉండేది. నటీనటుల విషయానికొస్తే.. సుహాస్ ఎంచుకునే పాత్రలన్నీ పక్కింటి కుర్రాడిలాగా ఉంటాయి. ఇందులో రామ్ పాత్రలో ఒదిగిపోయాడు. నటుడిగా ఇప్పటిదాకా అతను ఎక్కడా ఫెయిల్ కాలేదు. ఇందులో కూడా పాత్రకు న్యాం చేశాడు. ఎమోషన్స్ బాగా క్యారీ చేశాడు. సత్యభామ పాత్రకు మాళవిక మనోజ్ కరెక్ట్‌గా యాప్ట్ అయింది. అందంగా, చక్కని అభినయంతో అలరించింది. నటన పరంగా సుహాస్‌ని డామినేట్ చేసిందని చెప్పొచ్చు. హీరోయిన్ తండ్రి పాత్రలో పృథ్వీ నటన బాగుంది. చాలా కాలం తర్వాత అలీకి నిడివి ఎక్కువున్న పాత్ర దక్కింది. నవ్వులతో పాటు భావోద్వేగాన్ని పంచాడు. సుహాస్ ఫ్రెండ్స్‌గా సాత్విక్ నవ్వించారు.

నయని పావనికి మంచి పాత్రే దక్కింది. అన్నపూర్ణ ఎప్పటిలాగే బాగానే చేశారు. దర్శకుడు హరీష్ శంకర్, మారుతి అతిథి పాత్రల్లో మెరిశారు. మణికందన్ సినిమాటోగ్రఫీ సినిమాకి హైలైట్‌గా నిలిచింది. విజువల్స్ కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. బ్రహ్మకడలి ఆర్ట్ వర్క్‌లో తన మార్క్ చూపించాడు. భవిన్ ఎం షా ఎడిటింగ్ కూడా ఓకే. నేపథ్య సంగీతం పరంగా రథన్ మ్యూజిక్ సినిమాకి మరో ప్లస్. పాటలు అంతగా గుర్తు పెట్టుకునేలా లేవు. నిర్మాణ విలువలు బావున్నాయి. ఓవరాల్‌గా చూస్తే కథలో ఉన్న బలానికి తగ్గ ఎమోషన్స్ తెరపై కనిపించలేదు. ముఖ్యంగా చిన్న చిన్న పొరపాట్లను పక్కన పెడితే ఎలాంటి అసభ్యత లేని సెంటిమెంట్ సినిమా ఇది.

## కేంద్రం కోర్టులోకి ఉదయ్ పూర్ ఫైల్స్

మొదటి నుంచి వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఉదయ్ పూర్ ఫైల్స్ సినిమాకు మళ్లీ ఢిల్లీ హైకోర్ట్ బ్రేక్ వేసింది. శుక్రవారం విడుదల కావాల్సిన సినిమా హైకోర్ట్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల కారణంగా ఆగిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఈ సినిమాను వీక్షి ంచి, ఇది విడుదలకు అర్హమైంది అవునా? కాదా? అనే నిర్ణయం తీసుకోవాలి తెలిపింది. దాంతో ఉదయ్ పూర్ ఫైల్స్ బాల్... కేంద్ర ప్రభుత్వం కోర్టులో పడినట్టు అయ్యింది. టైలర్‌ను ముస్లిం యువకులు హత్య చేయడాన్ని ఖండిస్తూ అప్పట్లో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ కథాంశాన్నే దర్శకుడు భరత్ ఎస్ శ్రీనాథే సినిమాగా తీశాడు. అయితే ఈ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తప్పుపట్టడమే కాకుండా పూర్తి దీనిని నిషేధించాలంటూ జమాయత్ ఉలేమా ఇ హింద్ సంస్థ, జర్నలిస్ట్ ప్రశాంత్ టాండన్ కోర్టు కెక్కారు. ఢిల్లీ హైకోర్ట్‌లో దాఖలైన రెండు పిటీషన్లను చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ అనీశ్ దయాల్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేసింది. పిటీషనర్ల తరఫున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబాల్ వాదించారు. కేవలం టైలర్ కన్హయా లాల్ హత్య గురించి మాత్రమే కాకుండా ఇతర సున్నితమైన అంశాలను సైతం ఈ చిత్రంలో చర్చించారని, ఈ సినిమా విడుదలైతే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని వాదించారు. అయితే ఒకసారి సెన్సార్ అయిన సినిమాను ఆపడం సమంజసం కాదని మేకర్స్ తరఫున లాయర్ వాదించినా... కోర్టు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. సి.బి.ఎఫ్.సి. సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత కూడా తమ చిత్రంపై కోర్టుకు వెళ్ళడాన్ని ఆ చిత్ర దర్శకుడు భరత్ ఎస్ శ్రీనాథే తప్పుపట్టాడు. సినిమా విడుదలకు ఒక్కరోజు ముందు ఢిల్లీ హైకోర్టు తలుపుతట్టి తమ చిత్రాన్ని ఆపుతారని ఊహించలేదని అన్నాడు. న్యాయస్థానాలంటే గౌరవం ఉన్న వ్యక్తిగా సుప్రీమ్ కోర్టును తాము ఆశ్రయిస్తామని చెప్పాడు. రిలయన్స్ ఎంటర్ టైన్ మెంట్ ఈ చిత్రాన్ని పంపిణీ చేయడానికి ముందుకొచ్చింది. విజయ్ రాజ్,





## సరదాగా వింటారా

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ నుంచి వచ్చే సినిమాలకు ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఉంటుంది. ఈ బ్యానర్ నుంచి వచ్చే సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాలను అందుకుంటాయని ప్రేక్షకులు భావిస్తారు. అందుకు తగ్గట్టుగానే ఈ బ్యానర్ వైవిధ్యమైన సినిమాలను అందిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇక తాజాగా ఈ బ్యానర్ ఓ సరికొత్త రొమాంటిక్ చిత్రాన్ని అందించేందుకు సిద్ధమైంది. అశోక్ గల్లా, శ్రీగౌరి ప్రియ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి వింటారా సరదాగా అనే టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను వారు తాజాగా రిలీజ్ చేశారు. రాహుల్ విజయ్, శివాత్మిక ఈ సినిమాలో ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఉద్భవ్ డైరెక్ట్ చేస్తున్నారు. కాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను కూడా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. ఈ చిత్ర టీజర్‌ను జూలై 12న ఉదయం 10.53 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

# పర్యావరణహిత నిర్మాణాలే పరిష్కారం



## 2024-25లో నిర్మాణ రంగం వృద్ధి రేటు 11.97 శాతం

### కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలకు ప్రోత్సాహం

### యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి

### రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల తదితర ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని, ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని సివిల్ ఇంజనీర్లను కోరారు. మూడున్నరేళ్లలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఇంజి నీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండి యాలో నెక్స్ట్ జెన్ హైరైస్ బిల్డింగ్స్ (అడ్వాన్స్ మెంట్స్ ఇన్ కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్) అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. రాష్ట్ర సేవల స్థూల విలువ జోడింపులో ఇది 24.9 శాతం.

ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనం అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. ఇటీవల కాలంలో దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో హైరైస్ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200 కంటే ఎక్కువగా ఉంది. మరో 250 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.

ఇలాంటి తరుణంలోనే మనం పర్యావరణహితంగా అడుగులు వేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో రీన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్ (ఆర్‌సిసి) నిర్మాణాలకు బదులుగా కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్‌కు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది అని అభిప్రాయపడ్డారు. కంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ వినియోగం వల్ల భవనం పూర్తయ్యేందుకు పట్టే సమయం 40 శాతం, భారం 30 శాతం తగ్గుతుంది. భూకంపాలను సమర్థవంతంగా తట్టుకోగలవు. నిర్మాణ సమయంలో వెలువడే కాలుష్యం తగ్గుతుంది. మరీ ముఖ్యంగా పునర్వి నియోగం వల్ల సర్క్యులర్ ఎకానమీ వృద్ధి చెందుతుంది అని చెప్పారు. తెలంగాణలో ఆవిష్కరణలు కేవలం మాటలకే పరిమితం కావడం లేదు. ఆచరణలోనూ చూపిస్తున్నాము. భావితరాల కోసం కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాం.

ఇందుకు నగరవాసులకు అందు బాటులోకి తెచ్చిన స్టీల్ వంతెనలు గొప్ప ఉదా హరణ. నిర్మాణ రంగంలో ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా నిర్మాణ అనుమ తుల్లో వేగం, జవాబుదారీతనం, విశ్వాసాన్ని పెంపొందిం చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం అని పేర్కొన్నారు.

కాంపోజిట్ స్టీల్ హైరైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు(కోడ్) తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్)తో కలిసి పని చేస్తామన్నారు. సాంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజినీర్లకు సూచించారు. స్మార్ట్ నగరాలు, స్థిరమైన గృహనిర్మాణం, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులు ఎస్ జివిఎస్ మూర్తి, మహేందర్ రెడ్డి, శేషాద్రి, కాశీరాం, నర్మద, రమేష్, భీం రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆదరణ పొందిన ఎల్ఐసి అమ్మకం తగదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఖండన

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం బంగారు బాతు వంటి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ (ఎల్ఐసి)ని విక్రయించడాన్ని ఎఐటియుసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ తీవ్రంగా ఖండించారు. 1965లో కేవలం 5 కోట్లతో ప్రారంభించిన ఎల్ఐసి అంచెలంచెలుగా 70 యేళ్ల కాలంలో లక్షల కోట్లు ఆదాయాన్ని, వ్యాపారాన్ని తన సొంతం చేసుకున్నదన్నారు. ఎల్ఐసి సేవలతో భారతదేశ ప్రజల మన్నలను పొందిందని, ఎల్ఐసి రంగంలో ప్రజలను ఆకర్షించి తన శక్తి మేరకు ప్రజలకు సేవ చేస్తున్నదని ఆయన వివరించారు. ఇలాంటి ఎల్ఐసిని దురాశపరులు, అవినీతి పరులు, అక్రమార్కులు, దోపిడీదారులు అయిన ప్రైవేటు వారికి ఎల్ఐసి వాటాలను అమ్మడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి వాటాల అమ్మకాల విరమించుకుంటే మంచిదని, లేకపోతే దేశవ్యాప్తంగా ఎల ్ఐసి ఉద్యోగులు, వాటాదారులైన పాలసీదారులుగా ఉన్న ప్రజలు తిరగబడతారని వి.ఎస్.బోస్ హెచ్చరించారు.



అంబేద్కర విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## రిజర్వేషన్‌లపై ప్రభుత్వ నిర్ణయం బిసి బిడ్డలు, జాగృతి విజయం


### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్‌లపై ఆర్డి నెన్స్ తీసుకువస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని ఇది బిసి బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. తాము ప్రజా ఉద్యమాల ద్వారా వత్తిడీ తీసుకురావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. తాను ఢిల్లీలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కాంగ్రెస్, బిజెపి పార్టీల వైఖరిని ఎండగట్టడం వల్లనే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని, తాము రైల్‌రోకో కార్యక్రమాన్ని ప్రకటించగానే ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చిందని ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించ తలపెట్టిన రైల్‌రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని చెప్పారు. అయితే తమకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయన్నారు. శుక్రవారం బం జారా హిల్స్‌లోని కవిత నివాసం నుంచి ఆనేక మంది జాగృతి కార్యకర్తలు ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో న్యాయస్థానంలో ఏలాంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి రిజర్వేషన్‌ల చుట్టు రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి కేంద్రంలో అధికారంలో ఉన్నదని, అనుకుంటే ఒకే నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదన్నారు. బిసి బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని ఆమె కోరారు.

## బిసి రిజర్వేషన్లపై 'ఆర్డినెన్స్' నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** కేబినెట్ సమావేశంలో బీసీల విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని, 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి బీసీలకు ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లా డుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని గత 18 నెలలుగా అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని గల్లీ నుండి ఢిల్లీ వరకు నిర్వహించిన పోరాట ఫలితమే ఈ 42 శాతం రిజర్వేషన్ల ప్రకటన, ఇది ముమ్మాటికి బీసీల విజయంగా భావిస్తున్నామన్నారు కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం మొదటగా తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగనన చేపట్టాలని, ఆ తర్వాత బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశామని తమ డిమాండ్‌ను గౌరవించి తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లును రాష్ట్ర గవర్నర్ ద్వారా గత ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రపతికి పంపించడం జరిగిందన్నారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన బిల్లు జూలై 11 నాటికి మూడు నెలలు పూర్తయిందని అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్ల విషయంలో కనీసం స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య కృతజ్ఞతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 11:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం సాయంత్రం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డిని ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాల నాయకులు, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు కలిశారు.

# కొత్త ఆవిష్కరణలకు కేంద్రాలు తెలంగాణ, యుపి

### ఉత్తరప్రదేశ్ ఎంఎస్ఎంఇ, ఖాదీ, గ్రామీణ, హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ పరిశ్రమల మంత్రి రాకేష్‌సచన్

### ఉత్తరప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో యుపిఐటిఎస్-2025పై అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 11, ప్రభాతవార్త :** ఉత్తరప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలు పరిశ్రమలు, ఐటి, హ్యాండీక్రాఫ్ట్స్, ఫార్మా తదితర రంగాలు, కొత్త ఆవిష్కరణలకు కేంద్రాలని, ఈ రెండు రాష్ట్రాలు కలిస్తే అనేక సామాన్యతలతో ఎన్నో అద్భుతాలు సంభవిస్తాయని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఖాదీ గ్రామీణ పరిశ్రమలు, సిరికల్చర్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి రాకేష్ సచన్ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, భారత ఎక్స్‌పొజిషన్ మార్ట్ లిమిటెడ్ సంయుక్త నిర్వ హణలో సెప్టెంబరు 25 నుండి 29వరకు జాతీయ అంతర్జా తీయస్థాయిలో 5రోజుల పాటు ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్, గ్రేటర్ నోయిడాలో జరగనున్న ఉత్తరప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో-2025 (యుపిఐటిఎస్)పై అవగాహన పెంపొందించడమే, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆయా పారిశ్రామిక వాణిజ్య సంస్థలను ఆహ్వా నించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈ రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐ, సురానా ఆడిటోరియంలో శుక్ర వారం మధ్యాహ్నం జరిగిన



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి రాకేష్ సచన్, రాజ్‌కమల్ యాదవ్, సురేష్‌కుమార్ సింఘాల్, రవికుమార్, సుదీప్‌సర్కార్

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి రాకేష్ సచన్‌పాటు గౌరవ అతిథులుగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల శాఖ అదనపు కమిషనర్ రాజ్‌కమల్ యాదవ్ ఐఎఎస్, ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్, ఎఫ్‌టిసిసిఐ సీనియర్ ప్రెసిడెంట్ ఆర్.రవికుమార్, ఇండియా ఎక్స్‌పొజిషన్ మార్ట్ లిమిటెడ్ సిఈఓ సుదీప్ సర్కార్‌లు పాల్గొన్నారు. మంత్రి రాకేష్ సచన్ మాట్లాడుతూ దేశంలో మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో యుపిఐటిఎస్ అంతర్జాతీయ ట్రేడ్‌షో నిర్వహిస్తున్న తొలిరాష్ట్రం ఉత్తరప్రదేశ్ అన్నారు. జాతీయ అంతర్జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఈ ట్రేడ్‌షోకై రోడ్‌షో కార్యక్రమాల్లో భాగంగా ఢిల్లీ తర్వాత రెండవది హైదరాబాద్‌లో నిర్వహి స్తున్నట్లు, దేశవ్యాప్తంగా పరిచయం చేయడం లక్ష్యంగా సాగుతున్నామని చెప్పారు. యుపిఐటిఎస్ ప్లాట్ ఫామ్ ద్వారా ఓడిఓపి ఉత్తత్తులు, హ్యాండ్లూమ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవిలు, రిన్యూవబుల్ ఎనర్జీ వంటి పలురంగాలలో ఉన్న సామర్థ్యాన్ని ప్రదర్శి స్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఉత్పత్తి, విమాన, రైలు, రోడ్డు రవాణా సౌకర్యాలు, శాంతి భద్రతల పరిరక్షణ, అన్ని రంగాలకు ప్రభుత్వ ఇతోధిక ప్రోత్సాహం తోడుగా నిలు స్తుందని, ఈ ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన వాణిజ్య వ్యాపారసంస్థలు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. చివరిగా దేశ విదేశాల్లో భారతదేశ గొప్పదనం, ప్రాముఖ్యతను చాటుదామని పిలుపునిచ్చారు.

# గ్రేటర్‌లో ఇళ్ల నిర్మాణదారులకు తీపికబురు

### అందుబాటులోకి నాలుగు ఇసుక రీచ్‌లు

### ఇక కొరత ఉండదంటున్న అధికారులు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌లో ఇసుక కొరత తీర్చడానికి తెలం గాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టిఎస్ఎం డిసి) కొత్తగా నాలుగు ఇసుక బజార్లను ప్రారంభిం చింది. సన్న ఇసుక టన్ను రూ. 1800, దొడ్డు ఇసుక రూ. 1600 చొప్పున విక్రయిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని వట్టినాగులపల్లి, అబ్దుల్లాపూర్ మెట్, ఆదిభట్ల, మేడ్చల్ జిల్లాలోని భౌరంపేటలో ఇవి అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల రీచ్‌ల నుంచి ఇసుక వస్తుండగా.. వర్షాకాల కొరతను ఈ బజార్లు తీరుస్తాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టే వారికి నిజంగా ఇది శుభవార్తే. ఇసుక కొరతను తీర్చడానికి తెలంగాణ రాష్ట్ర ఖనిజా భివృద్ధి సంస్థ (టిఎస్ఎండిసి) కీలక చర్యలు చేపట్టింది. భారీ నిర్మాణదారులకు, వ్యక్తిగత విని యోగదారులకు ఇసుకను సులభంగా అందు బాటులోకి తెచ్చేందుకు నాలుగు కొత్త ఇసుక బజార్లను ఏర్పాటు చేసింది. ఇది నిర్మాణ రంగంలో ఎదురవుతున్న ఇ సుక కొరత సమస్యకు ఒక పరిష్కారంగా మారనుందని అధికారులు తెలిపారు.

ఈ నూతన ఇసుక బజార్లలో సన్న ఇసుకను టన్ను రూ. 1800కు, దొడ్డు ఇసుకను రూ. 1600కు విక్రయిస్తున్నట్లు గిళీలీదీది ప్రకటిం చింది. ప్రస్తుతం ఈ ఇసుక బజార్లు రంగారెడ్డి జిల్లాలోని వట్టి నాగులపల్లి, అబ్దుల్లా పూర్‌మెట్, ఆదిభట్ల, మేడ్చల్ జిల్లాలోని భౌరంపేటలో అందుబాటులో ఉన్నాయి. ఈ అన్ని ఇసుక బజార్లలో నాణ్యమైన నదీ ఇసుక సరిపడా నిల్వ ఉందని, వ్యక్తిగత వినియోగదారులు, కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థల అవసరాలను తీర్చగలిగేలా పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవలి కాలంలో హైద రాబాద్ నగరంలో పరిసర ప్రాంతాల్లో ఇసుక కొరత నిర్మాణ రంగంలో పెద్ద సమస్యగా మారింది. ఇసుక సరఫరాలో జాప్యం, అధిక ధరలు, అక్రమ రవాణా వంటి సమస్యల వల్ల నిర్మాణ ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయి. దీనివల్ల నిర్మాణ వ్యయం పెరిగి, వినియోగ దారులపై భారం పడుతోంది. నగరానికి ఇసుక ప్రధానంగా కృష్ణా, గోదావరి నదుల రీచ్‌ల నుంచి వస్తుంది. వర్షాకాలంలో నదీ రీచ్‌లలో తవ్వకాలు నిలిచిపోవడం కూడా కొరతకు ఒక కారణం. ఈ నేపథ్యంలో ఇసుక బజార్ల ఏర్పాటు నిర్మాణ రంగానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుం దని అధికారులు భావిస్తున్నారు.

వినియోగ దారులు టిఎస్ఎండిసి సాండ్ సేల్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకోవచ్చు. మరింత సమాచారం లేదా సందేహాల నివృత్తి కోసం విని యోగదారులు టిఎస్ఎండిసి, హెల్ప్‌లైన్ నంబర్ 155242ను సంప్రదిం చవచ్చు.. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలు, నిర్మాణదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ విజ్ఞప్తి చేసింది. ఇది ఇసుక లభ్యతను మెరుగుపరచి, నిర్మాణ రంగానికి ఊతమిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.

# ఇది బిసిల పోరాట విజయం

### రిజర్వేషన్‌లకు ఆర్డినెన్స్ తెస్తామని ప్రకటించడం అభినందనీయం: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఆర్డిన్స్ తీసుకువస్తామని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం ఇది బిసిల పోరాట విజయమని, ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, పలు బిసి సంఘాల నేతలు అభినం దనలు తెలిపారు. బిసిలు ఎన్నో సంవత్సరాలుగా రిజర్వేషన్‌లు పెంచాలని పోరాటాలు చేస్తున్నారని, గత మార్చి నెలలో ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును జారీ చేసినప్పుడే జివో జారీ చేసి ఎన్నికలు నోటిఫికేషన్ జారీ చేసి ఉంటే ఇప్పటికే ఎన్నికలు జరిగిఉండేవని చెప్పారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఇక ముందు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు జరిగేంతవరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రత్యేకంగా శ్రద్ధ తీసు కోవాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. బిసిలకు వ్యతి రేకంగా కోర్టులకు ఎవరూ వెళ్లరని, రిజర్వే షన్‌లు పెంచు కోవడానికి న్యాయ పరమైన, చట్టపరమైన, రాజ్యాంగ పరమైన అవ రోధాలు ఏమి లేవని స్పష్టం చేశారు. బిసిలం దరూ ఈ 42 శాతం రిజర్వేషన్‌లను కాపాడు కోవడానికి ఐక్యంగా ఉండాలని, వీటిని కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. బిసిలకు ప్రజాస్వా మ్యంగా, రాజ్యాంగంబద్ధమైన వాటా రాకుండా 76 సంవత్సరాలుగా అన్యాయం జరిగిందని, కనీసం స్థానిక సంస్థల్లో బిసిలకు వాటా ఇస్తుంటే కొంత మంది ఓర్వలేకపోతున్నారన్నారు.



సమావేశంలో ఐక్యతను చాటుతున్న బిసి సంఘాల నేతలు

## రాష్ట్రంలో మరో 18 దత్తత కేంద్రాలు

### రెండు బాలల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

### ఫైల్‌పై సంతకం చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మరో 18 ప్రత్యేక దత్తత కేంద్రాలు (ఎస్ఏఏఎస్), 2 బాలల సంరక్షణ కేంద్రాలు (చిల్డ్రన్ హోమ్స్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతి పాదనలు పూర్తి కాగా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆ ఫైల్‌పై శుక్రవారం నాడు సంతకం చేశారు. సీఎం ఆమోదం లభించిన వెంటనే ఈ కేంద్రాల ఏర్పాటుకు అధికారిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. తెలంగాణలో శిశు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనాథలు లేదా తల్లిదండ్రులు వదిలి వేసిన పిల్లలను దత్తత కేంద్రాల్లో సంరక్షిస్తూ, వారికి అన్ని అవసరాలను అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం దత్తత ఇచ్చే ప్రక్రియను చేపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 15 జిల్లాల్లో 17 దత్తత కేంద్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా 18 కొత్త కేంద్రాల ఏర్పాటుతో మొత్తం దత్తత కేంద్రాల సంఖ్య 35కి చేరనుంది. పిల్లల అక్రమ విక్రయాలు, అనధికార దత్తతలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. దీనికి కొనసాగింపుగా దత్తత కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాల నిర్వహణ, పిల్లల బాగోగుల కోసం ఏటా రూ. 5.44 కోట్లు ఖర్చు అవుతాని తెలంగాణ ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసింది. అందులో 60 శాతం (రూ. 3.26 కోట్లు) కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 40 శాతం (రూ. 2.17 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ కేంద్రాల్లో సేవలందించేందుకు 228 మంది సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించనున్నారు. ముఖ్యమంత్రి సంతకం అనంతరం ఈ ప్రాజెక్టు అమలు ప్రారంభమవుతుంది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని నిరాశ్రయ పిల్లల భద్రతకు, దత్తత ప్రక్రియ పారదర్శకతకు మరింత బలాన్ని చేకూర్చనుంది.



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు

## సంక్షేమానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

### మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకరెడ్డి, జూపల్లి కృష్ణారావు

**రంగారెడ్డి అర్బన్, జూలై 11, ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని సంక్షేమానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని మంత్రులు అన్నారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు భవనాలు, సిని మాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంలో రూ. 12.70 కోట్లతో నిర్మించనున్న 30 పడకల ఆసుపత్రి భవనానికి, మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు మాడ్గుల నుండి దేవరకొండ రోడ్ వరకు రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డునకు శంకుస్థాపన చేశారు. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, చాకలి ఐలమ్మ విగ్రహాలకు, మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించిన మంత్రులు, స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడారు.

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు మాడ్గుల నుండి దేవరకొండ రోడ్డు వరకు డబుల్‌లైన్ రోడ్ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ ముందు తీసుకెళుతున్నామన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలోని మాడ్గుల కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. అనంతరం మంత్రులు మాడ్గుల మండలంలోని 220 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి ్మ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 281

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 11, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 281 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణా భివృద్ధి శాఖకు సంబంధించి 67 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 58 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు 24, పౌర సరఫరాల శాఖకు 9, ఇందిరమ్మ ఇళ్ల కోసం 44 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియ జేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

## పురుగులమందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య

**వర్గల్, జూలై 11, ప్రభాతవార్త:** పురుగులమందు తాగి తల్లీ, కూతురు ఆత్మ హత్యకు చేసుకున్న సంఘటన వర్గల్ మండలం గౌరారంలో శుక్రవారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన వెల్దుర్తి మంజునాథ్ భార్య వెల్దుర్తి కవిత(32) పుట్టుకతోనే దివ్యాంగురాలు కాగా అత్త వెల్దుర్తి భారతమ్మ(60) కొంతకాలంగా నరాలవ్యాధితో బాధపడుతున్నది. వారి బాగోగులను మంజునాథ్ చూసు కుంటున్నాడు. అయితే నెల రోజుల నుండి మంజునాథ్ పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 7న చికిత్స నిమిత్తం మంజునాథ్ హైదరాబాద్‌కు వెళ్లగా మంజునాథ్‌కు ఏమైనా అయితే తమ బాగోగులు చూసుకునేవారు ఉండరని ఆందోళనతో మనస్తాపానికి గురై 10వ తేదీ గురువారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మంజునాథ్ హైదరాబాద్ నుండి వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఫిఫా ర్యాంకింగ్స్‌లో..భారత్ పరిస్థితి దారుణం



## 8 యేళ్లలో అత్యంత చెత్త రికార్డు

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో భారత్ ప్రపంచంలోని అగ్రశ్రేణి జట్లలో ఒకటిగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇదే సమయంలో భారత్ ఫుట్‌బాల్ జట్టు పరిస్థితి దారుణంగా తయారైంది. ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో టీమిండియాకు పెద్ద నష్టం వాటిల్లింది. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఫిఫా) విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ 133వ స్థానానికి పడిపోయింది. ఇది భారత ఫుట్‌బాల్ జట్టుకు గత 8 ఏళ్లలో అత్యంత చెత్త ర్యాంకింగ్. అంతకు ముందు భారత జట్టు 2016-2017 సీజన్‌లో 130వ స్థానం కంటే దిగువకు వచ్చింది. ఈ ర్యాంకింగ్స్‌లో నష్టానికి ఒక ప్రధాన కారణం. భారత్ 2025లో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడకపోవడం. భారత ఫుట్‌బాల్ జట్టు ఇంతకుముందు 127వ స్థానంలో ఉంది. కానీ ఇప్పుడు 2025లో పేలవమైన ప్రదర్శనకు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. టీమిండియా 7 స్థానాలు కిందకు పడిపోయి 133వ స్థానానికి చేరుకుంది. 2025లో భారత్ ఇప్పటివరకు మొత్తం 4 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. వాటిలో మూడు మ్యాచ్‌లలో ఓటమి పాలైంది, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది.

దురదృష్టవశాత్తు ఈ నాలుగు మ్యాచ్‌లు కూడా భారత్ కంటే తక్కువ ర్యాంకింగ్‌లో ఉన్న జట్లతోనే ఆడటం గమనార్హం. దీంతో భారత జట్టుపై ఎక్కువగా ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసినప్పుడు జట్టు ఫామ్‌పై విమర్శలు మొదలయ్యాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. భారత జట్టు తన అత్యుత్తమ ర్యాంకింగ్‌ను 1996లో సాధించింది. అప్పుడు అది 94వ స్థానానికి చేరుకుంది. మరోపక్క పాకిస్థాన్ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు 133వ స్థానంలో ఉండగా, పొరుగు దేశమైన పాకిస్థాన్ పరిస్థితి మరింతదిగజారింది. పాకిస్థాన్ టాప్200 ర్యాంకింగ్స్‌లో కూడా లేదు. తాజా ర్యాంకింగ్స్‌లో పాక్ జట్టు మూడు స్థానాలు కిందకు పడిపోయి 201వ స్థానానికి చేరుకుంది. భారత మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ ప్రస్తుతం 184వ స్థానంలో ఉంది.



## ఆస్ట్రేలియా మల్టీ ఫార్మాట్ టూర్
## టీమిండియా కెప్టెన్‌గా రాధ

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో తలపడే భారత్ క్రికెట్ ఎ జట్టు కెప్టెన్‌గా రాధా యాదవ్ నియమితులైంది. ఆగస్టు 7 నుండి 24 వరకు జరగనున్న ఆస్ట్రేలియాలో జరగనున్న బహుళ ఫార్మాట్ పర్యటన కోసం భారత ఎ మహిళా జట్టుకు స్పిన్నర్ రాధా యాదవ్ నాయకత్వం వహిస్తారు. భారత మహిళలు మూడు టి20లు మరియు 50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడనున్నారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా-ఎ తో 4 రోజుల మ్యాచ్ ఆడనున్నారు. ఈ పర్యటన ఆగస్టు 7 నుండి మూడు టి 20 మాకేలో ప్రారంభమవుతుంది. తదుపరి మూడు 50 ఓవర్ల మ్యాచ్‌ల కోసం బ్రిస్బేన్‌లోని నార్త్స్‌కు టీమిండియా వెళుతుంది, భారత మహిళల సీనియర్ జట్టు తరపున ఏడు పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు ఆడిన మిన్ను మణి ఈ పర్యటనకు డిప్యూటీ కెప్టెన్‌గా ఎంపికయింది. ఇక ఇంగ్లాండ్ పర్యటనలో టి20 జట్టులోకి తిరిగి వచ్చిన ఓపెనర్ షఫాలి వర్మ అన్ని ఫార్మాట్ స్క్వాడ్‌లలో చోటు దక్కించుకుంది. అలాగే సజన సజీవన్, ఉమా చెత్రీ, టైటాస్ సాధు, షబ్నమ్ షకీల్ టి20 జట్టులో స్థానం లభించగా, శ్రేయాంక పాటిల్ అతి తక్కువ ఫార్మాట్ మ్యాచ్‌లలో పాల్గోనుంది. ప్రియా మిశ్రా ఫిట్‌నెస్‌కు లోబడి వన్డే, మల్టీడే మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటుంది. టి20 జట్టు: రాధా యాదవ్ (సి), మిన్ను మణి (విసి), షఫాలి వర్మ, డి. వృందా, సజన సజీవన్, ఉమా చెత్రీ (డబ్ల్యుకె), రాఘవి బిస్త్, శ్రేయాంక పాటిల్, ప్రేమ రావత్, నందిని కశ్యప్ (డబ్ల్యుకె), తనూజా కన్వెర్, జోషిత విజె, సహూమా షకీల్, షబ్నా విజె ఉండగా, వన్డే మరియు బహుళ ఫార్మాట్ జట్టులో రాధా యాదవ్ (సి), మిన్ను మణి (విసి), షఫాలీ వర్మ, తేజల్ హసబ్నీస్, రఘ్వీ బిస్త్, తనుశ్రీ సర్కార్, ఉమా చెత్రీ (జూరీ), ప్రియా మిశ్రా, తనుజా కన్వర్, నందిని కశ్యప్ (డబ్ల్యూకె, షబ్, షబ్‌గుజ్‌కే, సాబ్ గుజ్జార్ ఠాకోర్, టిటాస్ సాధు).

## మహిళల ప్రపంచ కప్ మూడవ రౌండ్‌కు
## దివ్య, హంపి, హారిక, వైశాలి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ చెస్ కప్-2025 టోర్నమెంట్‌లో భారత్‌కు చెందిన నలుగురు క్రీడాకారిణిలు మూడవ రౌండ్‌కు చేరుకున్నారు. అగ్రస్థానంలో ఉన్న గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తమ మినీ మ్యాచ్‌లోని రెండవ గేమ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన అఫ్రుజా ఖమ్‌డమోవాతో డ్రా చేసుకుని 1.5-0.5 తేడాతో విజయం సాధించింది. తెల్ల పావులతో ఆడుతున్న హంపి నియంత్రణలో ప్రత్యర్థల వ్యూహాలను చిత్తు చేసి టైబ్రేక్ అవసరం లేకుండానే దూసుకెళ్లింది.

ఈ ఈవెంట్‌లో రెండుసార్లు కాంస్య పతక విజేత అయిన ద్రోణవల్లి హారిక, తన స్వదేశీయురాలు పివి నందిదాను ఓడించి చివరి 32లోకి ప్రవేశించింది. రెండవ గేమ్‌లో హారిక ఎలాంటి దాడి అవకాశాలను తటస్థీకరించి 2-0 తేడాతో విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌లలో, ఆర్ వైశాలి కెనడాకు చెందిన మైలీజాడే ఔలెట్‌ను ఓడించగా, దివ్య దేశ్‌ముఖ్ జార్జియాకు చెందిన కేసరియా మ్గెలాడ్జేను ఓడించి, ఇద్దరూ తమ తమ మినీమ్యాచ్‌లను వరుస గేమ్‌లలో గెలిచారు.

తొలి రౌండ్‌లో నిరాశపరిచిన కె. ప్రియాంక, పోలాండ్‌కు చెందిన క్లాడియా కులోన్‌తో జరిగిన రెండు గేమ్‌లను డ్రా చేసుకుని టైబ్రేక్‌ను సాధించింది. మొదటి గేమ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ అన్నా ఉషెనినాపై అద్భుతమైన విజయం సాధించిన తర్వాత, వంటికా అగర్వాల్ రెండవ గేమ్‌లో ఓడిపోయింది. అలాగూ పద్మిని రౌట్ అలెగ్జాండ్రా కోస్టెనిక్‌ను 1-1తో డ్రాగా ముగించడంతో మ్యాచ్ కూడా టైబ్రేకర్‌కు దారితీసింది.

## యూరప్ టూర్‌లో..
## భారత్ హాకీ జట్టు రెండో విజయం
### 6-0 తేడాతో ఐర్లాండ్ ఓటమి



**న్యూఢిల్లీ:** యూరప్ టూర్‌లో భాగంగా జరుగుతున్న రెండో మ్యాచ్‌లో ఇండియా పురుషుల హాకీ జట్టు తన అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించింది. ఐర్లాండ్‌పై 6-0 తేడాతో రెండో ఘన విజయం సాధించింది. ఇండియా తరపున ఉత్తమ్ సింగ్ మరోసారి గోల్స్ నమోదు చేయగా, కెప్టెన్ సంజయ్ ఆ తర్వాత వరుస గోల్స్ చేశాడు. మిడ్‌ఫీల్డర్ మహ్మద్ రహీల్ మోసేన్ వరుసగా అద్భుతమైన గోల్స్ సాధించగా, అమన్‌దీప్ లక్రా, వరుణ్ కుమార్ ఒక్కొక్క గోల్ చేయడంతో ఇండియా తన రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. హాకీ క్లబ్ ఆరంజేరూడ్‌లో ఐర్లాండ్‌పై 6-1 తేడాతో ఆధిపత్య విజయంతో భారత్ తమ యూరప్ పర్యటనను ప్రారంభించింది. ఉత్తమ్ సింగ్ పురుషుల కోసం గోల్ చేయడం ప్రారంభించాడు. తరువాత అమన్‌దీప్ లక్రా తమ ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. దీని తర్వాత ఆదిత్య లాలేజ్ వరుసగా గోల్స్ చేయడంతో అద్భుతమైన బ్రేస్ సాధించాడు. ఫార్వర్డ్ ఆటగాళ్లు సెల్వం కార్తీ మరియు బాబీ సింగ్ ధామి కూడా ఒక్కొక్క గోల్ చేసి స్కోరు షీట్‌లో చోటు సంపాదించారు. భారత్ తమ డిఫెండింగ్‌లో పటిష్టంగా ఉండటంతో ఐర్లాండ్ ఒక ఓదార్పు గోల్ మాత్రమే చేయగలిగింది. భారత్ తదుపరి రెండు వారాల పాటు ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం మరియు ఆతిథ్య నెదర్లాండ్స్‌తో ఆడుతుంది.

## ఆర్చరీ ప్రపంచ కప్..
## భారత్ రికర్వ్ జట్ల నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్- 2025 టోర్నమెంట్‌లో భారత రికర్వ్ జట్లు ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయాయి. మాడ్రిడ్‌లో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ 4వ దశలో భారత జట్టు ప్రచారం నిరాశాజ నకంగా ప్రారంభమైంది, పురుషుల మరియు మహిళల రికర్వ్ జట్లురెండూ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో నిష్క్రమించాయి. కొత్త కోచ్ రాహుల్ బెనర్జీ మార్గదర్శకత్వంలో దీపికాకుమారి, అంకితా భకత్ మరియు 15 ఏళ్ల అరంగేట్రం గాథా ఖడకేలతో కూడిన మహిళల రికర్వ్ జట్టు ఫ్రాన్స్‌పై తొలి విజయం సాధించింది. ఘనమైన అర్హత స్కోర్ల తర్వాత నాల్గవ సీడ్ అయిన ఈ త్రయం మొదటి సెట్‌ను 58-54తో కైవసం చేసుకుంది. తదుపరి రెండవ సెట్‌ను టైగా ముగించిన తర్వాత 3-1 ఆధిక్యాన్ని సాధించింది. అయితే, ఎనిమిది పాయింట్ల తప్పుడు దాడితో భారత్ మూడో సెట్‌ను 54-56తో కోల్పోవడంతో ఆట వేగం మారిపోయింది. మ్యాచ్ స్థాయి 3-3తో ఉండటం, ఒత్తిడి పెరగడంతో, భారత మహిళలు కోలుకోలేకపోయారు. చివరి సెట్‌లో ఖరీదైన ఆరు పాయింట్ల స్కోరుతో వారి మొత్తం స్కోరు 53కి చేరుకుంది, దీనితో ఫ్రాన్స్ సెట్‌ను 54-53తో అధిగమించి అద్భుతమైన విజయాన్ని సాధించింది. కాగా బ్రెజిల్ చేతిలో ఓడిపోయిన పురుషుల జట్టు పురుషుల రికర్వ్ జట్టు ధీరజ్ బొమ్మదేవర, రాహుల్ సింగ్, నీరజ్ చౌహాన్ తమ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో బ్రెజిల్‌ను ఓడించలేకపోయారు. తొమ్మిదో సీడ్ అయినప్పటికీ, భారతదేశం ప్రారంభంలోనే వెనుకబడి, మొదటి రెండు సెట్‌లను 55-56 మరియు 54-57 తేడాతో కోల్పోయింది.

మూడవ సెట్‌లో 57-56 తేడాతో గెలిచిన కొద్దిపాటి పునరుజ్జీవనం సరిపోలేదు. నాల్గవ మరియు చివరి సెట్‌లో బ్రెజిల్ స్థిరంగాఉండి, 56-54, 6-2 తేడాతో విజయం సాధించి, భారత్‌ను పోటీనుండి తప్పించింది. అంతకు ముందు క్వాలిఫికేషన్ రౌండ్లలో పేలవమైన ప్రదర్శన కారణంగా ఈ తొలినిష్క్రమణలు జరిగాయి. పురుషులలో, ధీరజ్ బొమ్మదేవర భారతదేశం తరపున 13వ స్థానంలో అత్యధికంగా ర్యాంక్ సాధించగా, అరంగేట్రం చేసిన రాహుల్ సింగ్ మరియు చౌహాన్ 34వ మరియు 35వ స్థానాల్లో నిలిచారు, దీనితో భారతదేశానికి తొమ్మిదో సీడ్ జట్టు ర్యాంకింగ్ లభించింది. మహిళలవిభాగంలో, అంకితా భకత్, దీపికా కుమారి మరియు గతా ఖడకే వరుసగా 15, 18 మరియు 25వ స్థానాల్లో నిలిచారు.

# ఎన్‌ఆర్‌ఐ బిలియనీర్లలో 'జెడ్ స్కేలర్' టాప్

**వాషింగ్టన్, జులై 11:** విదేశాల్లో పుట్టి అమెరికాలో పర కుబేరులుగా ఎదిగిన వాళ్లలో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నారు. ఫోర్బ్స్ 2025 ర్యాంకింగ్స్‌లో 12మంది భారత సంతతి బిలియనీర్లు చోటు దక్కించుకోవడంతో అత్యధిక మంది విదేశీ అమెరికన్ కుబేరులకు జన్మస్థానంగా భారత్ నిలిచింది. 2022లో కేవలం ఏడుగురు భారత సంతతి బిలియనీర్లు ఉండగా ఇప్పుడు గణనీయంగా పెరిగారు. అమెరికాలో విదేశీ సంతతి సంపన్నుల తాజా జాబితాలో భారత్ ఇజ్రాయెల్, తైవాన్‌లను అధిగమించింది. ఈ రెండు దేశాలకు చెందినవారు చెరో 11 మంది ఈ జాబితాలో ఉన్నారు. స్వయం కృషితో ఎదిగిన ఈ భారత సంతతి కుబేరులు, విదేశాలలో జన్మించిన యుఎస్ బిలియనీర్ల మొత్తం 1.3 లక్షల కోట్ల డాలర్ల సంపదలో గణనీయ వాటాను అందిస్తున్నారు. ఆల్ఫాబెట్ అధినేత సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల వంటి కొత్తవారు ఇటీవల ఈ జాబితాలో చేరినప్పటికీ అంతగా గుర్తింపులేని దిగ్గజాలతో పోలిస్తే వారు ఆశ్చర్యకరంగా తక్కువ ర్యాంకులో ఉన్నారు. సైబర్ సెక్యూరిటీ దిగ్గజం జెడ్ స్కేలర్ వ్యవస్థాపకుడు జే చౌదరి 17.9 బిలియన్ డాలర్ల సంపదతో భారత సంతతి అమెరికన్ బిలియనీర్లలో అగ్రస్థానంలో ఉన్నారు. విద్యుత్తు, నీరు లేని మారుమూల హిమాలయ గ్రామం పనోహ్‌లో జన్మించిన చౌదరి గ్రాడ్యుయేట్ చదువుల కోసం 1980లో తొలిసారి అమెరికా వెళ్లారు.




**భారత సంతతి అపర కుబేరులు వీళ్లే..**

జె చౌదరి 17.9 బిలియన్ డాలర్లు- సైబర్ సెక్యూరిటీ (జెడ్ స్కేలర్), వినోద్ ఖోస్లా 9.2 బిలియన్ డాలర్లు- సన్ మైక్రో సిస్టమ్స్, వెంచర్ కేపిటల్, రాకేష్ గంగ్వాల్ 6.6 బిలియన్ డాలర్లు -ఎయిర్‌లైన్స్ (ఇండిగో సహ వ్యవస్థాపకుడు), రోమేష్ టి.వాధ్వానీ 5.0బిలియన్ డాలర్లు- సాఫ్ట్‌వేర్- సింఫనీ టెక్నాలజీ గ్రూప్, రాజీవ్ జైన్ 4.8 బిలియన్ డాలర్లు -ఫైనాన్స్ (జీక్యూజీ పార్టనర్స్ చైర్మన్), కవితార్క్ రామ్ శ్రీరామ్ 3.0 బిలియన్ డాలర్లు-గూగుల్, వెంచర్ కేపిటల్, రాజ్ సర్దానా 2.0 బిలియన్ డాలర్లు- టెక్నాలజీ సేవలు (ఐటి సంస్థ టిసిజిఐ), డేవిడ్ పాల్ 1.5 బిలియన్ డాలర్లు - వైద్య పరికరాలు, నికేష్ అరోరా 1.4బిలియన్ డాలర్లు- సైబర్ సెక్యూరిటీ (పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సిఇఒ).

## టాప్ 10లోకి రాని 'ఇంటెల్': సిఇఒ లిప్-బు టాన్

**వాషింగ్టన్, జులై 11:** టెక్‌దిగ్గజం ఇంటెల్ కృత్రిమ మేధ రేసులో చాలా వెనుకబడిందని ఆ సంస్థ కొత్త సిఇఒ లిప్-బు టాన్ అంగీకరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులు విడియోలైవ్ టెలికాస్ట్‌లో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. ఈ పరిస్థితి నుంచి తర్వాత ఉద్యోగులతో మాట్లాడారు. '30యేళ్ల క్రితం మనమే నిజమైన లీడర్లం. కానీ ఇప్పుడు ప్రపంచం మొత్తం మారిపోయింది. సెమీ కండక్టర్ కంపెనీల్లో మనం కనీసం టాప్-10లో కూడా లేం' అని స్పష్టం చేశారు. సంప్రదాయ మార్కెట్ నుంచి కీలకమైన కృత్రిమ మేధ రంగంలోకి మళ్లేందుకు కంపెనీ అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని అభిప్రాయపడ్డారు. ఈ రంగంలోని ఎన్విడియా ఎఐ చిప్ డెవలప్‌మెంట్‌లో చాలా బలంగా ఉందని, దానిని నేరుగా సవాలు చేసే స్థితిలో ఇంటెల్ పరిస్థితి లేదన్నారు. ఇక ఇంటెల్ త్వరలో విడుదల చేయనున్న 18ఎ మోడల్ తమ అంతర్గత


పుంజుకోవడానికి తీవ్రంగా కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఆయన గత సిఇఒ పాట్ గెల్సింగర్ నుంచి బాధ్యతలు స్వీకరించిన



వినియోగదారుల అవసరాలను బలంగా తీరుస్తుందన్నారు. సంస్థలో సమూల మార్పు తీసుకురావడం ఓ మారథాన్ అని పేర్కొన్నారు. కంపెనీ ఎఎండి, ఎన్విడియాలా మరింత దూకుడుగా ఉండాలని చెప్పారు. కష్టమర్లతో ఉద్యోగులు వినయంగా ఉండి, వారి అవసరాలకు తగినట్లు స్పందించాలన్నారు. వాస్తవానికి ఇంటెల్ ఆర్థికంగా కూడా ఇబ్బందుల్లో ఉంది. సంస్థ ఒరెగాన్ క్యాంపస్ నుంచే 529 మంది ఉద్యోగులను తొలగించింది. ప్రపంచవ్యాప్తంగా మరిన్ని కోతలు ఉంటాయని సంకేతాలు ఇచ్చింది. మార్కెట్ విలువ కూడా బాగా తగ్గి 100 బిలియన్ డాలర్లకు చేరింది. దాదాపు 18 నెలల క్రితం ఇది రెట్టింపుగా ఉంది. మరోవైపె ఎన్విడియా మార్కెట్ విలువ ఇప్పుడు నాలుగు లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రపంచంలో ఈమార్క్‌కు చేరిన తొలి కంపెనీలుగా నిలిచింది. ఇక తాము టాప్-10లో కూడా లేమని ఇంటెల్‌సిఇఒ లిప్-బు టాన్ చేసిన కామెంట్‌పై కంపెనీ ప్రతినిధి వివరణ ఇచ్చారు. అది కేవలం మార్కెట్ విలువలో మాత్రమే అని, టెక్నాలజీ సామర్థ్యాల్లో కాదని స్పష్టం చేశారు.

## యుపిఐ చెల్లింపుల్లో మనమే ఫాస్ట్

**న్యూఢిల్లీ, జులై 11:** యుపిఐ దన్నుతో, మిగతా ప్రపంచ దేశాలన్నింటిలోకెల్లా భారత్ చెల్లింపుల విధానం అత్యంత వేగవంతంగా ఉంటోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తెలిపింది. 2016లో ప్రవేశపెట్టిన యుపిఐ విధానం చాలా వేగంగా వినియోగంలోకి వచ్చిందని పేర్కొంది. అదే సమయంలో నగదుకు ప్రత్యామ్నాయాలైన డెబిట్, క్రెడిట్ కార్డుల్లాంటి ఇతరత్రా సాధనాల వినియోగం గణనీయంగా తగ్గిందని వివరించింది. ప్రస్తుతం యుపిఐ ప్రతి నెలా 1,800 కోట్ల లావాదేవీలు ప్రాసెస్ చేస్తోందని ఐఎంఎఫ్ పేర్కొంది. వివిధ పేమెంట్ ప్రొవైడర్స్ సేవలు ఉపయోగించుకునే యూజర్ల మధ్య నిరాటంకంగా చెల్లింపు లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు క్లోజ్డ్ లూప్ సిస్టమ్‌లతో పోలిస్తే యుపిఐ లాంటి ఇంటర్ ఆపరబుల్ పేమెంట్ సిస్టమ్‌లు సమర్థవంతంగా ఉంటాయని తెలిపింది. అయితే ఇది మరింత వినియోగంలోకి వచ్చే కొద్దీ ప్రైవేట్ రంగ సంస్థల గుత్తాధిపత్యానికి కూడా దారి తీయొచ్చని, అలాంటిది జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.



## వాణిజ్యం

# ఐటి షేర్ల ఒత్తిడితోనే సెన్సెక్స్ డౌన్

**ముంబై, జులై 11:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిసాయి. ఓ వైపు టారిఫ్‌ల విషయంలో నెలకొన్న అనిశ్చితి, మరోవైపు ఐటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. దీంతో పాటు టిసిఎస్ ఫలితాలు కూడా ఇన్వెస్టర్లను మెప్పించకపోవడంతో ఐటి షేర్లు డీలాపడ్డాయి. ఆటోమొబైల్ షేర్లూ సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లు మేర నష్టపోగా, నిఫ్టీ 25,200 దిగువకు చేరింది. చివరికి సెన్సెక్స్ 689.81 పాయింట్లు నష్టపోయి 82,500.47 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 205.40 పాయింట్లు క్షీణించి 25,149.85 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.80గా ఉంది. టిసిఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, టైటాన్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంకు, సన్‌ఫార్మా, ఎన్‌టిపిసి, ఎటర్నల్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధర 68.78 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,3522.10 డాలర్ల వద్ద నిలిచింది. త్రైమాసిక ఫలితాల్లో అంచనాలను అందుకోవడంలో టిసిఎస్ విఫలమైంది. గతేడాదితో పోలిస్తే 6శాతం వృద్ధితో రూ.12,760 కోట్ల లాభాన్ని నమోదు చేసినప్పటికీ, స్థిర కరెన్సీ వద్ద 3శాతం మేర క్షీణత నమోదైంది. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో క్లయింట్లు ఐటిపై ఖర్చు తగ్గిస్తుండడంతో బ్రోకరేజీ సంస్థలు కూడా ఈ యేడాదికి ఐటి కంపెనీల ఆదాయ అంచనాలు తగ్గిస్తున్నాయి. దీంతో ప్రధాన ఐటి కంపెనీల షేర్లు 1-3 శాతం మేర క్షీణించగా, నిఫ్టీ ఐటి ఇండెక్స్ దాదాపు 2శాతం మేర నష్టపోయింది.అమెరికా అధ్యక్షుడుట్రంప్ తాజాగా కెనడాపై 35శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ప్రధానవ్యాపార భాగస్వాములపై 15-20శాతం టారిఫ్ విధిస్తారని సంకేతాలు ఇచ్చారు.




# 'లూజ్ ఫాస్టాగ్'లపై కేంద్రం కఠిన కార్యాచరణ

**న్యూఢిల్లీ, జులై 11:** టోల్‌గేట్ల వద్ద సులభతర ప్రయాణం కోసం కొత్త టోల్‌పాస్ విధానాలను తీసుకొస్తోన్న కేంద్రం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. 'లూజ్ ఫాస్టాగ్'ల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమించింది. అలాంటి ఫాస్టాగ్ యూజర్లను ఇకపై బ్లాక్‌లిస్ట్‌లోకి చేర్చనుంది. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. సాధారణంగా వాహనదారులు తమ ఫాస్టాగ్‌లను వాహన విండ్‌షీల్డ్‌లపై అతికించాలి. అప్పుడు టోల్‌ప్లాజాల వద్ద ఉన్న స్కానర్లు వాటిని స్కాన్ చేసేందుకు వీలుంటుంది. కానీ కొందరు ఉద్దేశపూర్వకంగా ఫాస్టాగ్‌లను అతికించట్లేదు. టోల్ గేట్లు వచ్చినప్పుడు పర్సులో నుంచి తీసి చూపిస్తున్నారు. ఇలాంటి వాటినే లూజ్ ఫాస్టాగ్‌గా పిలుస్తారు. ఇలాంటి యూజర్ల వల్ల టోల్ పాస్ నిర్వహణ సమస్యగా మారుతోందని, ప్లాజాల వద్ద రద్దీ పెరుగుతోందని ఎన్‌హెచ్‌ఎఐ తెలిపింది. అంతేకాకుండా కొందరు టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేసేందుకు యత్నిస్తున్నట్లు పేర్కొంది. అందుకే వీటి కట్టడికి చర్యలు చేపట్టినట్లు జాతీయ రహదారుల సంస్థ తెలిపింది. లూజ్ ఫాస్టాగ్‌లను గుర్తించినప్పుడు సంబంధిత టోల్ కలెక్టింగ్ ఏజెన్సీలు వెంటనే దాన్ని రిపోర్ట్ చేయాలని ఎన్‌హెచ్‌ఎఐ ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఇ-మెయిల్-ఐడిని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఆ రిపోర్ట్‌లను పరిశీలించిన తర్వాత సదరు ఫాస్టాగ్ యూజర్లను బ్లాక్‌లిస్ట్ జాబితాలో చేరుస్తామని స్పష్టం చేసింది. ఇటీవల జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌లపై వార్షిక ఫాస్టాగ్ టోల్‌పాస్ విధానాన్ని కేంద్రం ప్రకటించిన విషయం విదితమే.




## టెస్లా తొలి షోరూమ్‌కి తేదీ ఖరారు

**వాషింగ్టన్, జులై 11:** చాలా కాలంగా భారతమార్కెట్లో ఎంట్రీకి చూస్తున్న గ్లోబల్ విద్యుత్ వాహనాల దిగ్గజం టెస్లా ఎట్టకేలకు మొదటి షోరూమ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ యేడాది 15వ తేదీన టెస్లా తమ తొలి 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో ప్రారంభిస్తుందని, ఇది భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు కీలక అడుగు అని పేర్కొంది. ఈ స్టోర్ కోసం టెస్లా కంపెనీ 4వేల చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని లీజుకు తీసుకున్న విషయం విదితమే. గత కొన్ని వారాలుగా యూరప్, చైనా మార్కెట్లలో టెస్లా కార్లకు గిరాకీ తగ్గింది. దీన్ని భర్తీ చేసేందుకు గానూ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద వాహన మార్కెట్‌గా ఉన్న మన దేశం మార్కెట్లోకి అడుగు పెట్టడం ముఖ్యమని టెస్లా భావించింది. ఈ నేపథ్యంలోనే ఎలాన్ మస్క్ కంపెనీ భారత్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. అందుకనుగుణంగా గడచిన నెలా, రెండు నెలల వ్యవధిలోనే భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించే ప్రక్రియను వేగవంతంచేసింది. ముంబైలో తొలి షోరూమ్ ఏర్పాటు అయ్యాక రోజుల వ్యవధిలోనే దేశరాజధాని ఢిల్లీ లోనూ స్టోర్ ఏర్పాటుకు టెస్లా ప్రయత్నిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ అభిప్రాయపడింది. ఇప్పటికే టెస్లా కంపెనీ చైనా, అమెరికా, నెదర్లాండ్స్ నుంచి ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కోసం అవసరమైన సూపర్ ఛార్జర్స్ పరికరాలు, కార్ యాక్సె సరీస్, ఇతర విడిభాగాలను దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. ముంబై షోరూమ్‌తో కలుపుకుని టెస్లా మొత్తం నాలుగు చోట్ల కమర్షియల్ స్థలాలను లీజుకు తీసుకుంది. పుణెలో ఇంజినీరింగ్ హబ్‌తో పాటు బెంగళూరులో రిజిస్టర్డ్ ఆఫీస్,ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ సమీపంలో తాత్కాలిక ఆఫీస్ ఉన్నాయి. కంపెనీకిచెందిన మోడల్ వైరేర్ వీల్ డ్రైవ్ ఎస్‌యువి కార్లు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నాయని తెలుస్తోంది. మోడల్ వై ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడవుతున్న విద్యుత్ కారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.